జూన్ 2009

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 5

పేజీలు: 64

వెల: రూ. 20/-



## రెండవసారి ముఖ్యమంత్రిగా

## డా॥ వై.యస్. రాజశేఖర రెడ్డి




రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన

# శ్రీ వట్టి వసంతకుమార్

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 5

జూన్, 2009

ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**డి. రామకృష్ణ,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఆర్. అరుణ జ్యోతి**

**ఎన్. విజయ కుమార్**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ
**ఎ.ఎం.ఆర్. అపార్డ్**

రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ & ఫ్యాక్స్ : 040-24080656

E-mail ID : peshicomamapard@ap.gov.in

# విషయ సూచిక

సంపాదకీయం ........ 2

ప్రపంచ సమస్యకు స్థానిక పరిష్కారం ........ 3

సుస్థిరమైన జీవనోపాధిని సాధించడం ఎలా? ........ 9

మోహనం... మన్మోహనం ........ 12

పేద ప్రజలకు వరం ........ 16

13వ రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన సభ్యులు ........ 17

రెండవసారి ముఖ్యమంత్రిగా డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి ........ 32

మన మంత్రులు - వారి జీవిత విశేషాలు ........ 36

ఉపాధి కూలీలకు ఇక కనీస వేతనం రోజుకి రూ. 100 ........ 42

స్థానిక సంస్థలకు అధికారాల బదిలీపై త్వరలో నిర్ణయం ........ 44

లోక్‌సభ స్థానాల్లో... ........ 46

లక్షా అరవై వేల గళాల అన్నమయ్య సుస్వరార్చన ........ 49

గ్రామాల్లో మంచినీటి సరఫరాకి మెళకువలు ........ 53

'అభయహస్తం' ........ 56

పల్లెవాసులను ఉర్రూతలూగించిన 'చిందు భాగవతం' ........ 58

శ్రీరమణ పేరడీలు ........ 62

మహనీయుల చతురోక్తులు ........ 64

జూన్, 2009
స్థానిక పాలన,

# సంపాదకీయం..

## ప్రతి మనిషికి ఒక మొక్క నాటుదాం!

**సూ**ర్య కుటుంబంలో భూమి ఒక అందమైన గ్రహం. ఈ అరుదైన, అతి సుందరమైన గ్రహం అచ్చంగా మనదే. గ్రహంపై ఎన్ని లక్షల జాతుల జీవులున్నా, ఎన్ని లక్షల జాతుల వృక్షజాతులున్నా భూమిపై ఆధిపత్యం వహిస్తున్నది మనమే. మనకు ప్రాణం ఇచ్చి, అన్ని సదుపాయాలనూ అందించిన భూగోళాన్ని మనం మన సర్వసుఖాలకు ఉపయోగించుకోవటంలో తప్పులేదు. కాని భూగోళంపై ఉన్న వనరులను అతిగా ఉపయోగించుకోవటంతోనే అసలు చిక్కొచ్చి పడుతోంది.

భూగోళంపై ఉన్న వనరులను, పర్యావరణాన్ని మనం పాడుచేస్తూ, ముందు తరాల వారికి నివాస యోగ్యం కాకుండా చేస్తున్నాం. ఈ పని కూడా అతివేగంగా జరుగుతోంది. అందుకే జూన్ 5న జరిపే ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా ఐక్యరాజ్యసమితికి చెందిన పర్యావరణ కార్యక్రమ సంస్థ (యుఎన్ఇపి) ఈ సారి ఒక సరికొత్త థీమ్‌ని ఎంపిక చేసింది. "మీ గ్రహానికి మీరు కావాలి – వాతావరణ మార్పులను ఎదుర్కోవటానికి ఏకంకండి" అనే థీమ్ స్ఫూర్తిగా ఈ ఏడాది పొడవునా భూగోళాన్ని కాపాడే పలు చర్యలను చేపట్టనున్నారు. మరో ఆరునెలల్లో కోపెన్‌హేగన్‌లో జరగనున్న అత్యంత కీలకమైన వాతావరణ సదస్సులో కుదుర్చుకునే నూతన ఒప్పందానికి అన్ని దేశాలనూ అంగీకరింపచేయటానికి కూడా ఈ థీమ్ సన్నాహక చర్యగా ఉపకరిస్తుంది.

యుఎన్ఇపి ఆధ్వర్యంలో ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మెక్సికోలో నిర్వహిస్తున్నారు. యుఎన్ఇపి ప్రపంచవాప్తంగా 'బిలియన్ (100కోట్లు) మొక్కలు నాటే కార్యక్రమంలో కూడా మెక్సికో ప్రధాన భాగస్వామి. అక్కడి ప్రజలు, నాయకుల సహకారంతో ఆ దేశం 25 శాతం, అంటే 25 కోట్ల మొక్కలను నాటినట్లు అంచనా.

బిలియన్ మొక్కల కార్యక్రమం విజయవంతం కావటంతో ఏడు బిలియన్ (700 కోట్లు) మొక్కలు నాటడమనే మరింత బృహత్తర కార్యక్రమాన్ని యుఎన్ఇపి చేపట్టింది. కోపెన్ హేగన్‌లో ఆరు నెలల్లో వాతావరణ మార్పులపై జరగనున్న సమావేశం నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలని లక్ష్యం.

భూగోళంపై 700 కోట్ల జనాభా ఉన్నారు. భూమిపై నివశించే ప్రతి ఒక్క మనిషి కోసం ఒక చెట్టు ఉండాలనే లక్ష్యంతో మొత్తం 700 కోట్ల మొక్కలు నాటాలనే కార్యక్రమాన్ని యుఎన్ఇపి చేపట్టింది. ఈ లెక్కప్రకారం మన దేశంలోని సుమారు 115 కోట్ల మంది జనాభా కోసం మనం 115 కోట్ల మొక్కలు నాటాలన్నమాట. ఇదే లక్ష్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని మన మన గ్రామాలలో ఎంత మంది జనాభా ఉన్నారో అన్ని మొక్కలు నాటుదాం.

తద్వారా మనం నివశించే ప్రాంతాన్ని నివాస యోగ్యం చేసుకోవటంతో పాటు, భావితరాలకి సురక్షితమైన భూగోళాన్ని అందిద్దాం!



# ప్రపంచ సమస్యకు స్థానిక పరిష్కారం

**21**వ శతాబ్దంలో ప్రపంచ మానవాళి మనుగడకు పెనుముప్పుగా పరిణమిస్తున్న సమస్యలలో పర్యావరణ క్షీణత ఒకటి. పర్యావరణాన్ని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను గుర్తిస్తూ భావితరాల వారికి సుస్థిరమైన జీవన పరిస్థితులు కల్పించటానికి తీసుకొంటున్న చర్యలను సమీక్షించుకొని, భవిష్యత్తు వ్యూహాలను ఖరారు చేసుకొనటానికి ప్రతీ సంవత్సరం జూన్ 5వ తారీఖున ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలు 1972 సంవత్సరం నుండి క్రమం తప్పకుండా జరుపుకొంటున్నాయి. పర్యావరణ సమస్యలలో శీతోష్ణస్థితి లేదా వాతావరణ మార్పు ప్రధానమైనది.

గత శతాబ్ది కాలంగా వాతావరణంలో చోటు చేసుకొంటున్న మార్పులు భూగ్రహంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రపంచ దేశాలు అభివృద్ధి సాధించే ప్రక్రియలో పర్యావరణాన్ని పణంగా పెట్టి పారిశ్రామికీకరణను ప్రోత్సహించటంతో వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువుల పరిమాణం పెరిగి గత శతాబ్ద కాలంలో భూఉపరితల ఉష్ణోగ్రతలలో తీవ్రమైన మార్పులు సంభవించాయి. ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పును ఎదుర్కొనేందుకు, ప్రజలను సంసిద్ధ పరిచేందుకు ఐక్యరాజ్యసమితి 2009వ సంవత్సరాన్ని అంతర్జాతీయ శీతోష్ణస్థితి మార్పు సంవత్సరంగా ప్రకటించింది. పెరుగుతున్న మానవ కార్యకలాపాల వల్ల ప్రపంచంలో ఏ మూలనయినా సంభవించే వాతావరణ మార్పు భూగోళంపై మరో ప్రాంతంలో అనూహ్య పరిణామాలకు దారితీయవచ్చు. పెద్దమొత్తంలో వాతావరణంలోకి విడుదల అవుతున్న కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్ వంటి గ్రీన్ హౌస్ వాయువులు గ్లోబల్ వార్మింగ్‌కు అంటే భూఉపరితలంపై ఉష్ణోగ్రతలు పెరగటానికి ప్రధాన కారణంగా గుర్తించటం జరిగింది. పర్యావరణంపై ఈ గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని పరిమితం చెయ్యకపోతే అంతర్జాతీయ స్థాయిలో పేదరిక నివారణ కోసం పలు దేశాలు చేస్తున్న చర్యలన్నీ నిష్ప్రయోజనంగా మారే అవకాశం ఉన్నదని ఐక్యరాజ్యసమితి మానవ అభివృద్ధి నివేదిక 2007/08 తెలియచేస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలలో విడుదలయ్యే గ్రీన్ హౌస్ వాయువుల పరిమాణం అభివృద్ధి చెందుతున్న దేశాలలో కన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటోంది. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం ఇప్పటికే ప్రపంచ దేశాల పైన ఏదో ఒక రూపంలో ప్రదర్శితం అవుతోంది. తరచుగా వరదలు, కరువు కాటకాలు, తుఫానులు తదితర ప్రకృతి వైపరీత్యాలు సంభవించటం వల్ల ఆయా దేశాల

**వాతావరణ వైపరీత్యం**





ఆర్థిక ప్రగతి కుంటుపడటమే కాక పేదల జీవన పరిస్థితులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

## గ్రీన్ హౌస్ వాయువులు అంటే ఏవి?

భూమండలాన్ని ఆవరించి ఉన్న వాతావరణంలో ప్రధానంగా నత్రజని (78.08%), ప్రాణవాయువు (20.95%), ఆర్గాన్ (0.93%), కార్బన్ డై ఆక్సైడ్ (0.038%) తదితర వాయువులను కల్గి ఉంటుంది. వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, హైడ్రో ఫ్లోరో కార్బన్‌లు, పెర్ ఫ్లోర్ కార్బన్‌లు, సల్ఫర్ హెక్సా ఫ్లోరైడ్ వంటి వాయువులను గ్రీన్ హౌస్ వాయువులంటారు. వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువుల పరిమాణంలో కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణం గణనీయంగా పెరుగుతోంది. కార్బన్ డై ఆక్సైడ్ వాయువు మానవ శ్వాస క్రియలోనేగాక, కట్టెపుల్లలను, బొగ్గును మండించటం వల్ల, పెట్రోలు, డీజిలు వంటి శిలాజ ఇంధన వనరులను మండించటం వల్ల కూడా జనిస్తుంది. పెరుగుతున్న నగరీకరణ వల్ల వాహన కాలుష్యం పెరగటం, పారిశ్రామికీకరణ, విద్యుదీకరణ తదితర మానవజనిత కారణాలవల్ల వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్ వాయువు అధిక మొత్తంలో విడుదల అవుతోంది. అయితే సహజ సిద్ధంగా పర్యావరణంలో కల్సిపోవలసిన కార్బన్ డై ఆక్సైడ్ తరిగిపోతున్న వృక్షసంపద (అటవీక్షీణత) కారణంగా విడుదల అయిన పరిమాణంలో కిరణజన్య సంయోగ క్రియలో వినిమయం కావటంలేదు. అందువల్ల వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణంలో పెరుగుదల కన్పిస్తోంది. 2005లో ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక ప్రకారం గత 100 సంవత్సరాలలో భూఉపరితల ఉష్ణోగ్రత 0.74 ($+-18^0$) సెంటీగ్రేడ్ పెరిగింది. వాతావరణ మార్పుపై అధ్యయనం కొరకు ఐక్యరాజ్యసమితి నియమించిన అంతర ప్రభుత్వ కమిటీ (ఐ.పి.సి.సి) అంచనాల ప్రకారం 1750–2005 సం॥ల మధ్య వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ శాతం 280 పి.పి.ఎమ్ నుండి 379 పి.పి.ఎమ్.కు పెరుగిందని తెలుస్తోంది.

## గ్లోబల్ వార్మింగ్ వల్ల ఏర్పడే దుష్పరిణామాలు

గ్లోబల్‌వార్మింగ్ వల్ల ఏర్పడే దుష్పరిణామాలలో హిమానీ నదులు కరిగిపోవటం, ధృవ ప్రాంతాలలో మంచు కరిగి సముద్ర మట్టం పెరగటం, తీర ప్రాంతాలు కోతకు గురవటం, పచ్చని ప్రదేశాలు ఎడారులుగా మారటం, అతివృష్టి లేదా అనావృష్టి పరిస్థితులు ఏర్పడటం, తుఫానులు కరువు కాటకాలు సంభవించటం వంటివి ముఖ్యమైనవి. ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల కొన్ని రకాల వ్యాధికారక క్రిములు మనగల్గటానికి అనుకూల పరిస్థితులేర్పడి, అంటువ్యాధులు ప్రబలి ప్రజారోగ్యంపై విషమ ప్రభావాన్ని చూపుతాయి. జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతుంది. ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల భూఉపరితలంపై నీరు త్వరగా ఆవిరైపోతుంది. నీటి ఎద్దడి తలెత్తవచ్చు.

గ్లోబల్‌వార్మింగ్ వల్ల వ్యవసాయ పంటలపై కూడా ప్రతికూల ప్రభావం పడి పంటల ఉత్పాదకత తగ్గిపోవటానికి ఆస్కారం ఉన్నది. దీనివల్ల ఆహార భద్రత సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. భారతదేశం ప్రధానంగా వ్యవసాయాధార దేశం. 2001 జనాభా లెక్కల ప్రకారం 57 శాతం శ్రామికులు ప్రాథమిక రంగంలోనే తమ జీవనోపాధులను పొందుతున్నారు. దేశంలో అధికశాతం భూమిలో వర్షాధారంపైనే పంటలు పండిస్తున్నారు. వర్షపాతం సరళులలో ఏమాత్రం మార్పు వచ్చి సకాలంలో వర్షాలు పడకపోయినా ఆ ప్రభావం వ్యవసాయ పంటలపై, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిపై చూపుతుంది.

భూఉపరితల ఉష్ణోగ్రతలలో సంభవించే మార్పు వల్ల ధృవప్రాంతాలలోని మంచు కరిగి సముద్ర మట్టంలో పెరుగుదల వచ్చి తీరప్రాంతాలలో విస్తరించి ఉన్న మడ అడవులు, ప్రవాళ భిత్తులు (కోరల్ రీఫ్) మునిగిపోయే ప్రమాదం ఉన్నది. పెరుగుతున్న సముద్ర ఉపరితల/ వాతావరణ ఉష్ణోగ్రతల వల్ల ఇప్పటికే కచ్ ప్రాంతంలోని కోరల్ రీఫ్పులో 30 శాతం కరిగిపోయినట్లుగా అంచనా వేయబడ్డాయి. శాస్త్రీయ పరిశోధన ప్రకారం 1990–2100 ల మధ్య సముద్ర మట్టంలో పెరుగుదల 0.09 నుండి 0.88 మీ.గా అంచనా వేయబడింది. సముద్రమట్టంలో పెరుగుదల వల్ల తీరప్రాంతంలోని మడ అడవుల వృక్షజాతులలో వైవిధ్యానికి తావులేకుండా ఎక్కువ లవణీయత గల నీటిలో మనగలిగే మొక్కలే బ్రతుకుతాయి. సముద్రమట్టంలోని పెరుగదల వల్ల సుందరబన్ మడ అడవులకు ప్రమాదం లేనప్పటికీ సముద్రతీరంలో గల తమిళనాడులోని పిచ్చవరం, ముత్తుపేట, ఆంధ్రప్రదేశ్‌లోని కొరింగా వంటి ప్రదేశాలలో గల మడఅడవులు ప్రభావితం అయ్యే అవకాశం ఉన్నది. తీరప్రాంతాలలోని



చిత్తడి నేలలలో లవణీయత పెరగటానికి అవకాశం ఉన్నది.

సముద్ర తీర ప్రాంతాలలోని భూగర్భ జలవనరులు కలుషితమై ఉప్పునీటిగా మారిపోతాయి. ఇప్పటికే జనాభా అవసరాల దృష్ట్యా భూగర్భజలాలను విచక్షణా రహితంగా తోడివేయటం వల్ల గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని సముద్ర తీర ప్రాంతాలలోని భూగర్భ జలవనరులలోకి సముద్రపు నీరు చొచ్చుకొని రావటంతో నిరుపయోగంగా మారాయి. సముద్రమట్టం పెరుగుదల వల్ల తీరప్రాంతంలోని భూగర్భంలోని రాతిపొరలలో కొద్దోగొప్పో మిగిలిన మంచినీరు కూడా ఉప్పు నీరుగా మారిపోయే ప్రమాదం ఉన్నది.



శీతోష్ణస్థితి మార్పుతో పశ్చిమ హిమాలయ పర్వతాలలోని హిమానీ నదులు కరగటం వల్ల గంగానదీ డెల్టా ప్రాంతంలోనికి వచ్చే నీటి పరిమాణం పెరుగుతుంది. లోతట్టు ప్రాంతాలలో నివసించే జనాభా తరచుగా వరదల తాకిడికి గురవటమే కాక జీవనోపాధులలో స్థిరత్వాన్ని కోల్పోతారు. అంతేగాక పశ్చిమ బెంగాల్ సుందరబన్‌లోని మడ అడవులలో పెరిగే వృక్ష జాతుల విస్తృతిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. కేవలం తక్కువ లవణీయతగల నీటిలో మాత్రమే మనగలిగే వృక్ష జాతులు మాత్రమే సుందరబన్‌లో పెరిగే అవకాశం ఉంటుంది.

## వాతావరణ మార్పును ఎదుర్కోవటం ఎలా?

వాతావరణ మార్పు ఏ ఒక్క దేశానికో పరిమితమైన సమస్య కాదు. వాతావరణ మార్పుల వల్ల సంభవించే ప్రతికూల ఫలితాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రపంచ దేశాలన్నీ సంఘటితంగా కృషి చేయాలి. అందుకే సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలలో 7వ లక్ష్యం ద్వారా సుస్థిర పర్యావరణ సాధనకు నడుం బిగించాలని 191 ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు ఒప్పందం చేసుకొన్నాయి. దీనిలో భాగంగా పర్యావరణ క్షీణతకు ముఖ్యంగా గ్లోబల్ వార్మింగ్‌కు కారకాలైన కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారం, ఓజోన్ పొరకు నష్టం కలుగచేస్తున్న క్లోరోఫ్లూరో కార్బన్ విడుదల, శిలాజ ఇంధన వినియోగం, ఘన ఇంధన వనరులు వినియోగించే జనాభా శాతం తదితర అంశాలపై సూచికలను రూపొందించి దేశాల వారీగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తరచుగా సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకొనటానికి ఐక్యరాజ్యసమితి కృషి చేస్తుంది. 1997 క్యోటో ప్రోటోకాల్ ప్రకారం 2012 నాటికి అభివృద్ధి చెందిన దేశాలు ఈ వాయువుల విడుదలను 1990ల నాటి స్థాయి అంటే 5.2 శాతానికి తగ్గించాలనేది లక్ష్యంగా నిర్ధారించారు. అమెరికా 2020 నాటికి గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను 1990 స్థాయికి తీసుకురావాలనుకుంటోంది. యూరోపియన్ యూనియన్ 2020 నాటికి గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను 20 శాతం యునైటెడ్ కింగ్‌డమ్ 26 శాతం, స్వీడన్ 35 శాతం తగ్గించుకోవటానికి ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాయి.



వాతావరణ మార్పును ఎదుర్కోవటానికి చతుర్ముఖ వ్యూహంగా 1) మార్పుకు సర్దుకుపోవటం 2) వాతావరణ మార్పు ప్రభావాన్ని తగ్గించటం 3) తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొనటం 4) శీతోష్ణస్థితిపై ప్రభావం తగ్గించే పరిశ్రమలకు, ఇతర ప్రయత్నాలకు ఆర్థిక సహాయం చేయటం అన్న అంశాలను ప్రపంచ దేశాలు అమలు పరుస్తున్నాయి.

## భారతదేశం ఏం చర్యలు తీసుకుంటోంది?

ప్రపంచవ్యాప్తంగా సాలీనా సగటున 4 టన్నుల గ్రీన్ హౌస్ వాయువులు విడుదల అవుతుండగా మనదేశంలో విడుదల అయ్యే తలసరి గ్రీన్ హౌస్ వాయువుల సాలీనా 1.3 టన్నులు మాత్రమే. ఇదే అభివృద్ధి చెందిన అమెరికా, యూరోప్ దేశాలలో సగటున సాలీనా 12 టన్నులు విడుదల అవుతున్నాయి. 1994లో వేయబడిన అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా సాలీనా 8,17,023 గి.గ్రా గ్రీన్ హౌస్ వాయువులు విడుదల అవుతుండగా, 23,353 గి.గ్రా సహజసిద్ధంగా పర్యావరణంలో కలిసిపోతుండగా 7,93,490 గి.గ్రా గ్రీన్ హౌస్ వాయువులు వాతావరణంలో అధికంగా విడుదల అవుతున్నట్లు కనుగొన్నారు. మనదేశంలో విడుదల అయ్యే గ్రీన్‌హౌస్ వాయువులు ప్రధానంగా ఇంధన రంగంలో 61%, వ్యవసాయ రంగంలో 28% పారిశ్రామిక రంగంలో 8% వ్యర్థ పదార్థాల ద్వారా 2%, భూవినియోగం, అడవుల ద్వారా 1% మేర జనిస్తున్నాయి.

ఇంచుమించు 7500కి.మీ సముద్ర తీరప్రాంతం కల్గిన భారతదేశంలో తీరప్రాంతంలో 15 శాతం జనాభా నివసిస్తున్నారు. భారత భూభాగంలో



12 శాతం తరచుగా వరదలకు, 16 శాతం కరువు కాటకాలకు, 3 శాతం కొండచరియలు విరిగిపడి విపత్తులు సంభవించే (ల్యాండ్ స్లైడ్) ప్రాంతంగానూ ఉన్నది. వాతావరణంలో ఏ కొద్దిపాటి మార్పులకైన ముందుగా సముద్ర తీరప్రాంతాలు ప్రభావితం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వాతావరణ మార్పు ప్రభావం కేవలం ఏ ఒక్క రంగానికో పరిమితమైనది కాదు. దీని ప్రభావం ఒక గొలుసు చర్య వలె ఆర్థిక రంగం మొదలుకొని వ్యవసాయం, పరిశ్రమలు, పర్యావరణం, ప్రజల జీవనోపాధులు తదితర రంగాలపై పడుతుంది. అందుకే ఈ విషమ సమస్యపై విస్తృతమైన అవగాహన కలుగచేయటానికి భారత ప్రభుత్వం దేశం నలుమూలలా పర్యావరణ సమాచార వ్యవస్థలను ఏర్పరచి పాలకులకు, పరిశోధకులకు, శాస్త్రవేత్తలకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు కీలకమైన సమాచారాన్ని అందచేయటానికి సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఇంటర్‌నెట్ ఆధార సేవలను అందచేస్తోంది. అనేక విధాన నిర్ణయాలలో, పథకాలలో వాతావరణ మార్పును దృష్టిలో ఉంచుకొని పలు నియమనిబంధనలు రూపొందించి ఈ ప్రభావాన్ని ప్రజలపై పడకుండా చేయటానికి కృషి చేస్తోంది. పాఠశాల, కళాశాల స్థాయిలలో కూడా పర్యావరణ విద్యను పాఠ్యాంశంగా చేసి విద్యార్థులను చైతన్యవంతం చేస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పుల వల్ల మన దేశంపై పడనున్న ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, అందుబాటులోనున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని శక్తి వనరులను, సహజ వనరులను అభిలషణీయమైన రీతిలో వినియోగించుకొని సుస్థిర అభివృద్ధిని సాధించటానికి ప్రభుత్వం వాతావరణ మార్పుపై ఒక జాతీయ కార్యాచరణ ప్రణాళికను ఇటీవల ప్రకటించింది. దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో బొగ్గు నుండి ఉత్పత్తి చేసే విద్యుత్తు మూడింట రెండు వంతులు ఉంది. విద్యుత్ ఉత్పాదనలో బొగ్గును మండించటం వల్ల టన్నుల కొద్దీ బొగ్గుపులుసు వాయువు వాతావరణంలోకి విడుదల అవుతుంది. భారత ప్రభుత్వ నూతన ఇంధన విధానం ప్రకారం సాంప్రదాయేతర ఇంధన వనరుల నుండి అంటే సౌరశక్తి, పవనశక్తి నుండి విద్యుత్తును ఉత్పత్తి చేసే కంపెనీలకు ప్రత్యేక రాయితీలను అందచేస్తూ క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజంను ప్రోత్సహించటం, వివిధ విద్యుత్ పంపిణీ కంపెనీలు సరఫరా చేసే విద్యుత్తులో నిర్ణీత మొత్తంలో సాంప్రదాయేతర ఇంధన వనరుల నుండి ఉత్పత్తి చేసిన విద్యుత్తును తప్పనిసరిగా పంపిణీ చేయాలన్న నిబంధనలను రూపొందించటం వంటివి ఉన్నాయి. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ద్వారా తక్కువ విద్యుత్తును వినియోగించే విద్యుత్తు ఉపకరణాలను ప్రోత్సహించటం వంటి చర్యలను ఇప్పటికే భారత ప్రభుత్వం చేపట్టింది. శిలాజ ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించే క్రమంలో భారత ప్రభుత్వం ఇప్పటికే ఢిల్లీ, ముంబయి వంటి మెట్రో నగరాలలో పెట్రోలు, డీజిల్ స్థానంలో సి.ఎన్.జి/ఎల్.పి.జి లతో నడిచే వాహనాలను తప్పనిసరి చేసింది. సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించటంతో పాటు, జాయింట్ ఫారెస్టు మేనేజ్‌మెంట్, సహజ వనరుల సంరక్షణకు ఉద్దేశించి వాటర్‌షెడ్ అభివృద్ధి పథకం, ప్రజల జీవనోపాధులకు భద్రత కల్పించే ఉపాధిహామీ పథకం, పంటల భీమా పథకం వంటి పథకాలను కూడా కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పర్యావరణ పరిరక్షణకుగాను పలు చట్టాల ద్వారా ఈ మేరకు చర్యలు తీసుకొంటున్నాయి.

వాతావరణ మార్పుపై ప్రభుత్వం ప్రకటించిన జాతీయ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం వాతావరణ మార్పును ఎదుర్కొనేందుకు ఈ క్రింది 8 జాతీయ స్థాయి మిషన్‌లు ఏర్పాటు అయ్యాయి.

1. జాతీయ సౌర మిషను
2. జాతీయ శక్తివనరుల సామర్థ్య పెంపు మిషను
3. జాతీయ సుస్థిర ఆవాసాల మిషను
4. జాతీయ జల మిషను
5. సుస్థిరమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థ సాధన మిషను
6. ఆకుపచ్చని భారతదేశంగా అవతరించేందుకు కృషి చేయడానికి ప్రత్యేక మిషను
7. సుస్థిర వ్యవసాయ మిషను
8. వాతావరణ మార్పును ఎదుర్కొనేందుకు వ్యూహాలను రూపొందించే మిషను

అయితే ఈ 8 మిషన్లు పూర్తి స్థాయిలో కార్యకలాపాలను ప్రారంభించలేదు. రాబోయే కాలంలో ఈ 8 మిషన్లు ఆయా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో విషయ నిపుణులైన మేధావి వర్గంతో, ఇతర మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో కలిసి విధాన పత్రాలను రూపొందించి 11వ మరియు

12వ పంచవర్ష ప్రణాళికల కాలంలో అవసరమయిన చర్యలను చేపట్టవలసిన ఆవశ్యకత ఉన్నది.

## స్థానికంగా పంచాయతీరాజ్ సంస్థలు ఏం చెయ్యవచ్చు?

గ్లోబల్ వార్మింగు సమస్య మూల కారణం ఎక్కడ ఉన్నప్పటికీ దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉన్నది. సమస్యను సృష్టించిన వారే పరిష్కరించాలి అని మడికట్టుకు కూర్చుంటే దాని ప్రభావం తగ్గటానికి బదులు రెండింతలు అవుతుంది. అందుకే ఈ ప్రపంచ సమస్యకు స్థానికంగా పరిష్కారాలు వెదకటం లేదా సమస్యను ఎదుర్కొనేందుకు తగిన వ్యూహాలను అవలంబించవలసిన బాధ్యతను ఏ దేశానికాదేశం తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ స్థానికంగా పంచాయతీరాజ్ సంస్థలు ఈ బృహత్ప్రయత్నంలో పాలుపంచుకోనట్లయితే లక్ష్యాలను సాధించటం కష్టతరమవుతుంది. ఇందుకు స్థానిక సంస్థలు కూడా తమ వంతు పాత్రను స్థానిక ప్రాంతాలలో పోషించాలి. ఈ విషయంలో పంచాయతీరాజ్ సంస్థలు ఈ క్రింది కార్యక్రమాలు చేపట్టవచ్చు.

## మీకు తెలుసా !

- ఐ.పి.సి.సి. నివేదిక ప్రకారం హిందూ మహాసముద్రంలోని 1192 కోరల్ రీఫ్ ద్వీపాలతో గల మాల్దీవులు సముద్ర మట్టానికి కేవలం 1.5-4.0 మీటర్ల ఎత్తులో మాత్రమే ఉన్నాయి. 1961-2003 సం.ల మధ్యకాలంలో సముద్ర మట్టంలో పెరుగుదల సగటున సాలీనా 1.8 మి.మీ. ఉండగా 1993-2003 మధ్య 3.1 మి.మీగా ఉన్నది. ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల సముద్ర మట్టంలో పెరుగుదల రాబోయే శతాబ్దకాలంలో 18-59 సెం.మీ గా ఉండవచ్చు. పెరుగుతున్న సముద్రమట్టం వల్ల మాల్దీవుల ఉనికే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారబోతోంది. మొత్తం 3,80,000ల జనాభాను ఇక్కడి నుండి వేరొక సురక్షితమైన ప్రదేశానికి తరలించవలసిన అవసరం ఉన్నది. అందుకే ఈ దేశం ఇప్పటినుండే ముందుచూపుతో దేశ అదాయంలో కొంతభాగాన్ని పొదుపు చేసి వేరే ప్రదేశంలో స్థలాన్ని కొనుగోలు చేయటానికి ఇన్సూరెన్సు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొంది.
- సముద్రమట్టం పెరుగుదల వల్ల మహారాష్ట్ర, గోవా, గుజరాత్ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. గోవా ప్రాంతంలో 1మీ. సముద్ర మట్టం పెరిగితే 8100 కోట్ల రూపాయల నష్టంతో పాటు 7 శాతం గోవా జనాభా ప్రభావితం అవుతారని, మహారాష్ట్రలో 13 లక్షల జనాభా ప్రభావితం అవటంతో పాటు ముంబయి ప్రాంతంలో రూ. 2,28,700 కోట్ల రూపాయల ఆస్థి నష్టం సంభవించనున్నదని అంచనా.
- సాధారణ బల్బుల స్థానంలో సి.ఎఫ్.ఎల్ బల్బులు వినియోగించటం వల్ల 4 రెట్లు విద్యుత్తు ఆదా చేయవచ్చు. సి.ఎఫ్.ఎల్ బల్బుల జీవితకాలం సాధారణ బల్బుల జీవితకాలం కంటే 8 రెట్లు ఎక్కువ. దీనివల్ల విద్యుత్తు బిల్లు తక్కువ కావటమే కాక విద్యుత్తు బల్బుల కొనుగోలుపై చేసే అనవసర వ్యయాన్ని తగ్గించవచ్చు.
- 100 వాట్ల సాధారణ బల్బు ఇచ్చే వెలుగు 20 వాట్ల సి.ఎఫ్.ఎల్. బల్బుకు, 60 వాట్ల సాధారణ బల్బు 15 వాట్ల సి.ఎఫ్.ఎల్ బల్బుకు, 40 వాట్ల సాధారణ బల్బు 11 వాట్ల సి. ఎఫ్.ఎల్ బల్బుకు సమానం. సాధారణ టి.12 ట్యూబ్‌లైట్ 52 వాట్ల విద్యుత్తును వినియోగిస్తే టి.5. ట్యూబ్ లైట్ 29 వాట్ల విద్యుత్తును వినియోగిస్తుంది.
- బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ వారు ధృవీకరించిన 1 నుండి 5 నక్షత్ర మార్కులు గల్గిన విద్యుత్తు ఉపకరణాలు వినియోగించటం వల్ల విద్యుత్తును ఆదాచేయవచ్చు. ఈ విధమయిన నక్షత్ర గుర్తు గల్గిన విద్యుత్తు పరికరాలు సాధారణ విద్యుత్తు పరికరాలకన్నా 2-10 రెట్లు తక్కువ విద్యుత్తును వినియోగించుకొంటాయి. మనదేశంలో ప్రస్తుతం టి.వి.లు, ఫ్రిజ్‌లు, ఎయిర్ కండీషనర్లు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ఈ పరికరాలపై 1-5 మధ్యలో ఎన్ని ఎక్కువ నక్షత్ర మార్కులు ఉంటే అంత విద్యుత్తును ఆదా చేసే సామర్థ్యం ఉంటుందన్న మాట.
- కార్లు / స్కూటర్లు తదితర వాహనాల టైర్లలో తగినంత గాలి నింపకపోయినట్లయితే పెట్రోలు అధికంగా ఖర్చు అవుతుంది. ఒక లీటరు పెట్రోలు ఆదాచేయటం వల్ల 2.5 కిలోల కార్బన్ డై ఆక్సైడ్ వాతావరణంలోకి విడుదల కాకుండా ఆపగలం. రేడియల్ టైర్ల వల్ల 3-7 శాతం ఇంధనం ఆదా అవుతుంది.
- విద్యుత్తుతో పనిచేసే నీటి హీటర్ల స్థానంలో సౌర శక్తితో పనిచేసే హీటర్లు వినియోగించటం ఉత్తమం. 100 లీటర్ల సామర్థ్యం గల సోలార్ వాటర్ హీటర్ వినియోగంవల్ల సాలీనా సుమారు 1500 యూనిట్ల విద్యుత్తును అదా చెయ్యవచ్చు. అంటే సుమారు 1.5 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదలను తగ్గించవచ్చు.
- ఒక్క పెద్ద వృక్షం దాని జీవిత కాలంలో 1 టన్ను కార్బన్ డై ఆక్సైడ్‌ను వినియోగించుకుంటుంది.
- టి.వి., సి.డి./ డి.వి.డి. ప్లేయర్, మైక్రోవేవ్ ఓవెన్‌ల వంటి విద్యుత్ ఉపకరణాలను రిమోట్‌తో కాకుండా మెయిన్ స్విచ్ అపినట్లయితే 5-7 % విద్యుత్తును ఆదా చేయవచ్చు.
- ఫ్రాస్ట్ ఫ్రీ రిఫ్రిజిరేటర్లు, ఎల్.సి.డి. కంప్యూటర్ మోనిటర్/ టి.వి., ల్యాప్‌టాప్ కంప్యూటర్‌లు సాధారణ ఉపకరణాల కంటే 25-50% తక్కువ విద్యుత్తును వినియోగించుకొంటాయి. ♦



- వాతావరణ మార్పు మనదేశంలోని గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది ఇప్పటికే వాతావరణంలో వచ్చిన మార్పు వల్ల నకాలంలో వర్షాలు పడకపోవటం, వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీ సెం. మించి ఉండటం, భూ ఉపరితల నీటి వనరులు లభ్యం కాకపోవటం, భూగర్భజలాలు ఇంకిపోవటం, విద్యుత్తు శక్తి కొరత ఏర్పడటం వంటి కారణాల వల్ల వ్యవసాయం లాభసాటిగా ఉండటంలేదు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు తమ జీవనోపాధికై వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారు. వాతావరణ మార్పులతో తీవ్రమైన కరువు కాటకాలు సంభవించినపుడు ప్రజలు వలసలు పోకుండా స్థానికంగా ఉపాధి చూపవలసిన గురుతర బాధ్యత పంచాయితీరాజ్ సంస్థలపై ఉన్నది. దీనికి గ్రామీణ ఉపాధి హామీ పథకం, వాటర్ షెడ్ పథకం వంటి వాటిని సాధనాలుగా ఉపయోగించుకొని ప్రజలకు స్థానికంగా పని కల్పించటంతో పాటు సహజవనరులను కూడా సంరక్షించుకొనవచ్చును.
- మారుతున్న వాతావరణ పరిస్థితులకనుగుణంగా శుష్క శీతోష్ణస్థితి పరిస్థితులలో సైతం మనగలిగే వంగడాలను/పంటలపై రైతులకు అవగాహన కలుగచేయటలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. సముద్ర మట్టం పెరుగుదల వల్ల తీరప్రాంతంలోని సారవంతమయిన వ్యవసాయ క్షేత్రాలలో లవణీయత పెరిగిపోతుంది. ఈ ప్రాంతాలలో ఎక్కువ లవణీయతగల నేలలో సైతం మనగలిగే విత్తనాలను వినియోగించటానికి రైతులకు సన్నద్ధం చేయటంలో పంచాయతీరాజ్ సంస్థలు పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఆహర భద్రతను సాధించటానికి ఈ చర్యలు తప్పనిసరి. శ్రీ వరి లాంటి ఆధునాతన వ్యవసాయ విధానాలను అవలంబించేందుకు రైతులను సంసిద్ధపరచాలి.
- తుఫానులు, వరదలు సంభవించినపుడు నిర్వాసితులను ఆదుకొనటంలో ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయ పరిచి సహాయ పునరావాస కార్యక్రమాలలో పాల్గొనటం పంచాయితీ రాజ్ సంస్థల బాధ్యత. తుఫాను షెల్టరును నిర్మించటం, నిర్వహించటం వంటివి చెయ్యవచ్చు.
- వన సంరక్షణ కార్యక్రమాలు చేపట్టి గ్రామ పంచాయతీ పరిధిలో గల సామాజిక భూములలో మొక్కల పెంపకాలను ప్రోత్సహించటం వంటి కార్యక్రమాలు చేయవచ్చును.
- జీవ ఇంధనాలుగా ఉపయోగపడే జట్రోఫా, గానుగ మొక్కల పెంపకానికి రైతులను ప్రోత్సహించవచ్చును.
- దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో బొగ్గు నుండి ఉత్పత్తి చేసే విద్యుత్తు మూడింట రెండు వంతులు ఉంది.

విద్యుత్ ఉత్పాదనలో బొగ్గును మండించటం వల్ల టన్నుల కొద్దీ బొగ్గుపులుసు వాయువు వాతావరణంలోకి విడుదల అవుతుంది. బొగ్గు/శిలాజ ఇంధనాలను వినియోగించే బదులు అవకాశం ఉన్నంత మేర సాంప్రదాయేతర ఇంధన వనరులను వినియోగించటానికి ప్రజలను సమాయత్తం చేయటంలో పంచాయతీరాజ్ సంస్థలు కృషి చేయవచ్చు. సౌరశక్తితో వెలిగే బల్బులు, వీధిదీపాల ఏర్పాటు, బయోగ్యాస్‌తో పనిచేసే పొయ్యి వినియోగం వంటివి ప్రోత్సహించవచ్చు. సాధారణ బల్బుల స్థానంలో సి.ఎఫ్.ఎల్. బల్బులు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్గించటం కూడా పంచాయతీరాజ్ సంస్థలు చేయవచ్చు. మన రాష్ట్రంలో ఈ అంశాలపై అవగాహన కలగచేయటానికి నెడ్‌క్యాప్‌ను నోడల్ ఏజన్సీగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. మరిన్ని వివరాల కోసం ప్రతి జిల్లాలో గల ఈ శాఖ జిల్లా మేనేజరు సంప్రదించవచ్చు.

"మన దగ్గర నిధులు, తగిన సాంకేతిక పరిజ్ఞానం లేక కాదు, అయితే చేయాలనే ధృఢ సంకల్పం లేకపోవటం వల్లనే ఇటువంటి విపరీత పరిణామాలను ఎదుర్కొన లేకపోతున్నాము" అని ఐక్యరాజ్యసమితి మానవ అభివృద్ధి నివేదిక 2007-08 అభిప్రాయ పడింది. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషికి పంచాయతీరాజ్ సంస్థలు కూడా తమవంతు సహకారాన్ని అందచేసి స్థానిక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయటంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ సహజవనరులను కాపాడుకుంటూ గ్రామీణ జీవనోపాధులను సుస్థిరం చేసుకొనటానికి దోహదకారిగా మరియు స్థానిక ప్రభుత్వాలుగా తమబాధ్యతను నిర్వర్తిస్తే పర్యావరణాన్ని సంరక్షించటంలో మరో అడుగు ముందుకు వేసినట్లవుతుంది.

**- డా. వి. శివశంకరప్రసాద్,**
జూనియర్ ఫ్యాకల్టీ
ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి

# సుస్థిరమైన జీవనోపాధిని సాధించడం ఎలా ?





**స్వపరిపాలనలో ఆరు దశాబ్దాలు పురోగమించినప్పటికీ, మనదేశంలో పేదరికం ఇంకనూ విలయ తాండవం చేస్తున్నది. పేదరికాన్ని నిర్మూలించలేక పోవటానికి అనేక కారణాలు, నిరక్షరాస్యత, సరైన ప్రణాళిక లేకపోవటం, మరియు సహజ వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోవటం ముఖ్యమైనవిగా చెప్పవచ్చును. పేదరిక నిర్మూలన అనేది కొంత మంది నాయకుల నినాదాలకే పరిమితమైనదే గాని చెప్పుకోదగినంత ప్రగతిని సాధించటంలో మనం విఫలమయ్యామని చెప్పవచ్చు.**

మన దేశం వ్యవసాయ ఆధారిత దేశం. ఇక్కడ 70% ప్రజలు గ్రామాలలో నివసిస్తూ, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కాని ఇటీవల వాతావరణంలో సంభవించిన మార్పుల వలన సరైన సమయంలో వర్షాలు పడక, పంటలు పండక గ్రామీణ ప్రజలకు ఉపాధి లేక పట్టణాలకు వలస బాటన పడి దుర్భరమైన జీవనాన్ని గడుపుతున్నారు. (ఇటీవల ప్రవేశ పెట్టిన జాతీయ ఉపాధి హామీ ద్వారా వలసలు కొంత వరకు తగ్గినవని అంచనా).

కాని శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోతున్న మనకు పేదరికం అడ్డుకాకూడదు, పేదరికాన్ని రూపు మాపవలసిన బాధ్యత మనందరిపైన ఉంది.

దీనిలో భాగంగా – జీవనోపాధి అంటే ఏమిటి? సుస్థిరమైన జీవనోపాధికి ఎలాంటి వనరులు అవసరం? దాని ద్వారా సుస్థిరమైన జీవనాన్ని ఎలా పొందవచ్చునో ఈ వ్యాసం ద్వారా తెలుసుకుందాం.

**జీవనోపాధి – నిర్వచనం**

ప్రతి వ్యక్తి/ కుటుంబం జీవించటానికి కొన్ని వస్తువులు, సేవలు అవసరమవుతాయి. ఈ అవసరాలు తీరాలి అంటే ఆదాయం కావాలి. ఆదాయం ద్వారా వస్తు, సేవలను పొందవచ్చు. ఆదాయం పనిచేస్తేనే లభిస్తుంది. అటువంటి పనినే వృత్తి అంటాం. అనగా వృత్తి ద్వారా ఒనగూడె పనిని ఉపాధి అంటాం. కాబట్టి జీవనోపాధి అనగా వ్యక్తి గాని కుటుంబం గాని వారు జీవించటానికి ఎంచుకున్న ఆదాయ మార్గం అని చెప్పవచ్చు. ఈ జీవనోపాధి సుస్థిరంగా ఉండాలి అంటే ఎలాంటి పద్ధతులను అవలంబించాలో ఇక్కడ చూద్దాం.

మన రాష్ట్రంలో 3 లక్షలపై చిలుకు మహిళా సంఘాలు క్రమం తప్పకుండా చేసుకుంటున్నారు. వీరికి బ్యాంకులు, ప్రభుత్వం, వివిధ సంస్థలు ఆర్థిక సాయం చేస్తున్నాయి. ప్రతి గ్రూపు దగ్గర దాదాపుగా రూ. 19,000/ – ఉన్నట్లు అంచనా. కాని వారు ఆ డబ్బులతో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, జీవనోపాధిని ఎలా మెరుగుపరుచుకోవాలో తెలియక ఈ మహిళా సంఘ సభ్యులు సుస్థిరమైన జీవనోపాధిని సాధించలేకపోతున్నారు. దీనికి ముఖ్యమైన కారణం సరైన ప్రణాళిక లేకపోవటం.

జీవనోపాధుల అభివృద్ధిలో నాలుగు సానుకూలతా కారణాలు ప్రధాన

భూమికను పోషిస్తాయి. అవి 1) పెట్టుబడి 2) నైపుణ్యం (స్కిల్స్), 3) ముడిసరుకు (రా-మెటీరియల్), 4) అనుసంఘిక సేవలు (సపోర్ట్ సర్వీసెస్) మార్కెట్ కూడా ముఖ్యమైనదే.

## 1) పెట్టుబడి (ఫైనాన్స్)



ఏదైనా ఒక కార్యక్రమాన్ని ఎంచుకున్న తరువాత దానికి ఎంత పెట్టుబడి అవసరం, అంత డబ్బులు మన దగ్గర ఉన్నవా, లేకపోతే కావలసిన రుణాన్ని ఎవరి నుండి పొందాలి అని ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలి. అంతేగాని మన దగ్గర అసలు లేకుంటే కావలసిన డబ్బును అప్పుల రూపంలో బ్యాంకుల నుండి, ఇతరుల నుండి తీసుకొని వారికి వడ్డీల రూపంలో డబ్బులు చెల్లిస్తూ ఉంటే ఆ కార్యక్రమము ముందుకు పోకపోగా ఇంకా అప్పుల ఊబిలో మునిగి పోవటానికి అవకాశం ఉంటుంది. కాబట్టి తగిన పెట్టుబడిని సమకూర్చుకున్న తరువాత ఏదైనా కార్యక్రమాన్ని చేపడితే అది మన జీవన ప్రమాణాలను పెంచే విధంగా తోడ్పడుతుంది.కనుక పెట్టుబడి అనేది సుస్థిరమైన జీవనోపాధిలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

## 2) నైపుణ్యం (స్కిల్)

ఆ కార్యక్రమాన్ని చేపట్టబోయే ముందు ఆ కార్యక్రమంలో మనకు తగిన నైపుణ్యం ఉందా లేదా అనేది చూసుకోవాలి. ఒక వేళ నైపుణ్యం లేకపోతే నైపుణ్యాన్ని గడించిన తరువాత పనిని మొదలు పెట్టాలి. పెట్టుబడి పెట్టి కార్యక్రమాన్ని మొదలు పెట్టి, దానిలో నైపుణ్యం లేక చేపట్టిన పనిని మూసి వేసి అప్పులు పాలైన వారు చాలా మంది ఉన్నారు. కాబట్టి అలా కాకుండ తగిన నైపుణ్యాన్ని పొందిన తరువాత కార్యక్రమాన్ని చేపట్టుట శ్రేయస్కరం.

## 3) ముడి సరుకులు (రా-మెటీరియల్)

చేపట్టబోయే కార్యక్రమానికి ముఖ్యమైన ముడిసరుకులు ఏమి అవసరం అవుతాయి? అవి మన ఊరిలో గాని చుట్టు ప్రక్కల గ్రామాలలోగాని, దొరుకుతాయా? లేదా? ఒకవేళ లేకపోతే వాటిని ఎక్కడ నుండి పొందాలి? వాటిని తీసుకురావటానికి ఎంత ఖర్చు అవుతుంది? తిరిగి మనం అమ్మేటప్పుడు అది లాభదాయకంగా ఉంటుందా? లేదా? అనేది బేరీజు వేసుకోవాలి. లేకుంటే మన జీవన ప్రమాణాలు మెరుగుపడకపోగా ప్రమాదాలలో చిక్కుకునే అవకాశాలు ఉన్నాయి.

**ఉదా :** మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో మహిళా సంఘాలు అగరబత్తీలు చేసి నష్టపోవలసి వచ్చింది. ఎందుకనగా అక్కడ ముడి సరుకు దొరకక భద్రాచలం నుండి తీసుకురావటం వలన రవాణా ఛార్జీలు పెరిగి చేసిన సరుకు అమ్ముడుపోక నష్టపోవలసి వచ్చినది.కాబట్టి అన్ని కోణాలలో ఆలోచించి కార్యక్రమాన్ని మొదలు పెట్టటం మంచిది.

## 4) అనుసంఘిక సేవలు (సపోర్ట్ సర్వీసెస్)

అనుసంఘిక సేవలు కూడా సుస్థిరమైన జీవనోపాధిలో ప్రధాన భూమికను పోషిస్తాయి. ఏదైనా జీవనోపాధుల కార్యక్రమాన్ని మొదలుపెట్టే ముందు దానికి ఎలాంటి అనుసంఘిక సేవలు అవసరమవుతాయి? అవి మన దగ్గరలో ఉన్నవా? లేవా? అని చూసి కార్యక్రమాన్ని మొదలు పెట్టాలి. ప్రతి కార్యక్రమానికి అనుసంఘిక సేవలు అవసరం.

**ఉదా :** కడప జిల్లా రామాపురం మండలంలో జీవనోపాధుల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం వారు మంజూరు చేసిన డబ్బులతో బెంగుళూరుకు దగ్గరలో ఉన్న చిక్కబల్లాపూర్ నుండి ఏడు జెర్సి ఆవులను తేవటం జరిగింది. వాటికి రామాపురం మండలం వాతావరణం అనుకూలించక పోవడంవల్ల అవి వచ్చిన నెల రోజులకు సుస్తి చేయడం జరిగింది. వాటికి వైద్యం అందించటానికి సరైన సేవలు లేక ఏడు ఆవులు చనిపోవటం జరిగింది. కనుక అనుసంఘిక సేవల పాత్ర చాలా ముఖ్యమైనది.

కాబట్టి మన గ్రామంలో ఎంత మంది జనాభా ఉన్నారు? వారి అవసరాలు ఏమిటి? వారు అవసరాలు తీర్చుకోవాలంటే ఎంత దూరం వెళ్ళవలసి వస్తుంది? మన గ్రామంలో దొరికే సహజ వనరులు ఏమిటి? అవి ఏ విధంగా మన జీవన ప్రమాణాలను పెంచటంలో ఉపయోగపడతాయి అని పరిశీలించి తగిన కార్యక్రమం చేపడితే అది సుస్థిరంగాను, మన జీవన ప్రమాణాలు పెంచే విధంగా ఉంటుంది. ఆ విధంగా ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలి.



# కూరగాయల సాగుతో పేదరికం దూరం



వ్యవసాయంలో మెళకువలు తెలుసుకొని నూతన వ్యవసాయ పద్ధతులను, ఆధునిక వ్యవసాయ పరికరాలను వాడి వ్యవసాయంలో అద్భుతాలు సాధించవచ్చునని తద్వారా పేదరికాన్ని తొలగించవచ్చునని అంటాడు ములుస(మం) కొట్నాల గ్రామానికి చెందిన 60 సం॥ల వారాల చంద్రారెడ్డి.

ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మధ్యతరగతికి చెందిన సామాన్య రైతు. ఆయన మాటల్లోనే ఆయన విజయగాథ విన్నాం. "మేము పేరుకి ఉన్నత కులానికి చెందిన వారమైనా, తినటానికి తిండిలేక, కట్టుకోవటానికి బట్టలు లేక పిల్లలను సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో చేర్పించి చదివించాను. మాకు భూమి ఉండి కూడా నీరు చాలక పురాతన పద్ధతులను అవలంబించటం వలన వ్యవసాయమంటే విసుగొచ్చింది. అదే తరుణంలో మా గ్రామంలో వాటర్‌షెడ్ అమలు పరచటానికి ఎంపిక కాబడటం, నా భార్య స్వయం సహాయక సంఘంలో, నేను యూజర్ గ్రూప్‌లో చేరటం జరిగింది.

వాటర్‌షెడ్ అమలులో భాగంగా యూజర్ గ్రూప్ సభ్యులకి శిక్షణ నిమిత్తం మమ్ములను జహీరాబాద్‌లోని కెవికె, అన్నా సాగర్ గ్రామానికి తీసుకెళ్ళి అక్కడ మాకు వ్యవసాయంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ముఖ్యంగా నీటి నిర్వహణ, భూ పరిరక్షణ, నీటి పరిరక్షణ పద్ధతులు, డ్రిప్ పద్ధతిను ఉపయోగించి తక్కువ నీటితో ఎలా అధిక దిగుబడులను పొందవచ్చు, ఈ డ్రిప్ పద్ధతిని పొందగోరు వారు ఎవరిని సంప్రదించాలి అనే విషయాలను కూలంకషంగా వివరించటం జరిగింది.

శిక్షణ నుండి వచ్చిన వెంటనే మాగ్రామాలలో వాటర్‌షెడ్ కార్యక్రమం అమలు పరుస్తున్న స్వచ్ఛంద సంస్థ అధికారులను కలిసి, నా భూమి ప్రక్కగా పెద్దవాగు పోతుంది. దానికి అడ్డంగా చెక్‌డ్యామ్ కట్టాలి, నేను డ్రిప్‌పద్ధతిని వాడుకుని, నాకున్న కొద్ది నీటితో కూరగాయలు పెట్టాలనుకుంటున్నాను . దీనికి మీ సహకారం కావాలని అర్జీ పెట్టినాను. వారు వాటర్‌షెడ్ కమిటీతో చర్చించి నా భూమి దగ్గర చెక్‌డ్యామ్ కట్టడానికి నిర్ణయం తీసుకున్నారు. తరువాత మండల వ్యవసాయ అధికారిని కలిసి డ్రిప్‌పద్ధతి గురించి అడిగితే, వారు 60% రైతు కడితే మిగిలిన 40% తాము సబ్సిడీగా ఇస్తాము  అని చెప్పినారు. దానికి కావలసిన డబ్బులు కొంత మా బంధువుల దగ్గర, మరికొంత వాటర్‌షెడ్ రివాల్వింగ్ ఫండ్ నుండి తీసుకొని డ్రిప్‌ని అమర్చుకున్నాము. అప్పటి వరకు ఉన్న మా బోరులో 2-3 ఇంచుల నీళ్ళు మాత్రం వచ్చి ఏ పంటా సరిగా  పండేది కాదు.

ఈ డ్రిప్‌ని అమర్చిన తరువాత వ్యవసాయ అధికారులను సంప్రదించి ఈ భూమికి అనువైన పంట గురించి, ఏ పంట పండిస్తే నేను లాభాలను గడించవచ్చు అని అడిగినాను. అప్పుడు వారు హైదరాబాద్ సిటీకి మీ ఊరు దగ్గరగా ఉంది కాబట్టి, కూరగాయలను పండించమని సలహా ఇచ్చారు. వారి సలహా మేరకు కాలనుగుణంగా వంగ, టమోట, బీర, దోస, సొర, బెండలను రెండు ఎకరాలలో పండించసాగాను.

ఇప్పుడు టమోటా, వంగ వేశాను. వీటి నుండి రోజుకి రూ. 5000 - 6000 దాకా వస్తున్నాయి. అంటే టమోటా, వంగలు రోజుకి 1200 నుండి 1500 కిలోలు కోస్తున్నాను. కిలో టమోటా రూ 5 - 6/-  మధ్య పోతుంది. వంగలయితే రూ. 4 - 5/- మధ్య పోతుంది. ఇలా 1200 నుండి 1500 కిలోల దిగుబడి మొదటి 30 రోజులు వస్తాయి . రాను రాను దిగుబడి తగ్గుతుంది.  ఈ లోపు వేరే మడి తయారు చేసుకొని వాటిని తీసి వేరే కూరగాయలు పెడతాను. దీనితో నా అప్పులను తీర్చుకోగలిగాను. నా బిడ్డలు ఇద్దరూ పోలీసు ఉద్యోగంలో చేరారు.

చెక్ డ్యామ్ కట్టడం వలన బోరులో నీటి సామర్థ్యం పెరిగింది. 4 - 5 ఇంచుల మేరకు నీళ్ళు నిరాటంకంగా రావటం వలన ఇంకా రెండు ఎకరాలలో కాపర్‌గ్రాస్ పెంచుతున్నాను. ఈ డ్రిప్‌పద్ధతిని ఉపయోగిస్తున్నాను. ఈ గ్రాస్ చదరపు అడుగు 5 - 6 రూ॥ లకు మధ్యవర్తులకు అమ్ముతున్నారు. ఇప్పుడు దీని విలువ షుమారు 3 లక్షలు ఉంటుంది.

నా కూరగాయలు బోయినపల్లి మార్కెట్‌ని శాసిస్తున్నవి. ఎందుకంటే నా కూరగాయల నాణ్యత బాగుంటుంది. డ్రిప్‌పద్ధతి ద్వారా పండించటం వలన కాయ పరిమాణం పెరగటం, మరియు భూమి అంతా తడవదు కాబట్టి కాయలపై మచ్చలు లేకపోవటం వలన నా కూరగాయలు కొనటానికి మధ్య దళారులు నా గంపలు మార్కెట్‌కి వచ్చే వరకు ఎదురు చూస్తుంటారు.

దీనిని చూసి నా చిన్న కొడుకు వెంకటరెడ్డి పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయంలో నాకు తోడుగా ఉంటానంటున్నాడు. ఈ వృద్ధ తల్లిదండ్రులను తోడు ఉంటానంటే అంత కంటే సంతోషం ఏముంది చెప్పండి అంటాడు చంద్రారెడ్డి.

**- పెనుమాక రమేష్**

జూనియర ఫ్యాకల్టి, సి.యన్.ఆర్.యం., అపార్డ్, రాజేంద్రనగర్



# మోహనం . . . మన్మోహనం

***సరిగ్గా 18 సంవత్సరాల క్రితం దేశ ఆర్థికమంత్రి పదవి ఆయనను వెతుక్కుంటూ ఎలా వచ్చిందో, 2004లో కూడా అలాగే దేశంలో అత్యున్నతమైన ప్రధాని పదవి కూడా వెతుక్కుంటూ వచ్చి ఆయనను వరించింది. ఆయన గత 5 సంవత్సరాలలో అందించిన సుస్థిరమైన అభివృద్ధికి బాటలు వేసే సంక్షేమపూరిత పాలన అందించినందుకు ప్రజలు మెచ్చి కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఫలితంగా ఇప్పుడు ఆయన రెండోసారి ప్రధాని పదవిని అధిష్టించారు. సంస్కరణల పలకపై భారత ఆర్థిక వ్యవస్థకు ఓనమాలు దిద్దించి, ప్రపంచ ఆర్థిక పటంలో భారత్‌ను నిటారుగా నిలబెట్టిన ఘనత ఆయనదే. ప్రధాని పదవిని రెండవసారి అధిష్టించిన సందర్భంగా, ఆయన జీవన పర్యావలోకనం. . .***

ఉన్నత విద్య ఆయన సొత్తు. విజ్ఞాన సంపన్నత ఆయనకు పెట్టనికోట. మితభాషిత్వం ఆయన ఆభరణం. సంస్కారం ఆయనకు సహవాసి. సహనం ఆయన సౌందర్యం. మేధాజగత్తులో ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం ఆయన సొంతం. ఆయనెవరో కాదు. మన దేశంలో అత్యున్నత పదవి అయిన ప్రధానమంత్రి పదవిని అనుకోకుండానే అవలీలగా, అలవోకగా రెండుసార్లు అధిష్టించిన డాక్టర్ మన్మోహన్ సింగ్. ఆర్థిక, వాణిజ్య శాస్త్రాలను ఔపోసన పట్టినప్పటికీ, ఔచిత్యం విస్మరించని గుణసంపన్నుడు ఆయన.

సుమారు 65 ఏళ్లక్రితం అమృత్‌సర్ వీధిదీపం వెలుగులో ఏకాగ్రతతో చదువుకుంటున్న కుమారుణ్ని చూసి, అతని తండ్రి 'పెద్దయ్యాక వీడు ప్రధానమంత్రి అవుతాడు' అని ఆట పట్టించేవారు. ఆ మాటకు 'తథాస్తు' అని దేవతలన్నారేమో! అవి అక్షరాలా ఈనాడు నిజమయ్యాయి.

ఎదుటివారి నుంచి ఎన్ని విమర్శలు ఎదురైనా, వారిని పల్లెత్తుమాట అనని గొప్ప సహనశీలి డాక్టర్ మన్మోహన్ సింగ్. మొదటి నుంచి ఉన్నత పదవులు ఆయనను వెదుక్కుంటూ రావటమే తప్ప, వాటికోసం ఆయనెప్పుడూ వెంపర్లాడలేదు. నిగర్వంగా, నిరాడంబరంగా, నిర్వికారంగా, నీతి నిజాయితీలకు ప్రతీకగా, తాను నిజమని నమ్మిన సిద్ధాంతాలను త్రికరణశుద్ధిగా ఆచరించడమే ఆయనకు తెలుసు. ఎంతటి అత్యున్నతమైన పదవులను నిర్వహిస్తున్నప్పటికీ ఎంతో నిరాడంబరంగా, సాదాసీదాగా ఉండటమే ఆయనకు ఇష్టం. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా, నైపుణ్యంతో నిర్వహించడం ఆయన నైజం. పదవులను అంటిపెట్టుకుని ఉండాలనే తపన లేదు ఆయనకు. కేంద్ర ఆర్థికమంత్రిగా ఆయన ఐదేళ్లు పనిచేస్తే, ఆ ఐదేళ్లలో ఆయన మూడుసార్లు రాజీనామా చేశారు.

డాక్టర్ మన్మోహన్‌సింగ్ అవిభాజ్య భారతంలోని పశ్చిమపంజాబ్ (నేటి పాకిస్థాన్)లో గల రావల్పిండిలోని గాహ్ గ్రామంలో 1932, సెప్టెంబర్ 26న జన్మించారు. తల్లిదండ్రులు అమృత్‌కౌర్, గురుముఖ్‌సింగ్‌లు.

# '21వ శతాబ్దం భారతదేశానిదే'

"నేడు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపే సంస్కరణలు కావాలి. సామాన్యుడి ఆశలు నెరవేర్చే సంస్కరణలు కావాలి. ఆర్థిక సంస్కరణలు కొనసాగుతాయి- కానీ, మానవీయ దృక్పథంతో విచక్షణా రహితమైన ప్రైవేటీకరణ ఉండదు. ఓఎన్‌జిసి, గెయిల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించం. వ్యూహాత్మకంగా కీలకమైన ఇలాంటి సంస్థలు ప్రభుత్వరంగంలోనే ఉంటాయి. జాతీయ బ్యాంకులు కూడా ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తాయి.

భారతదేశానికి బలమైన ప్రభుత్వరంగ సంస్థలు అంతే బలమైన ప్రైవేటురంగం అవసరం. ప్రైవేటు రంగానికి గట్టిపోటీ ఇచ్చేలా ప్రభుత్వరంగ సంస్థలను తీర్చిదిద్దాలి. ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఉపాధి కోల్పోయే ఎట్లాంటి చర్యలను చేపట్టం. కాలం కలిసి వస్తే భూమిపై ఏ శక్తి మనలను ఆపలేదు. భారతదేశాన్ని ప్రపంచంలోనే ప్రబల ఆర్థికశక్తిగా ఆవిర్భవింపజేస్తాం. పేదరిక నిర్మూలన, సమగ్ర అభివృద్ధి, అందరికీ విద్య, ఆరోగ్యం, మురికివాడల్లో మగ్గుతున్న లక్షల మందికి గృహనిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ దిగుబడుల్లో వృద్ధి మా సంస్కరణల ముఖ్య ఉద్దేశాలు ఇవే. మా కొత్త అజెండా ఇదే. పెట్టుబడులను ప్రోత్సహిస్తూనే పేదరిక నిర్మూలన చేస్తాం.

అసలు హిందూత్వానికి అర్థం ఏమిటి? మార్గాలేవైనా గమ్యం ఒక్కటే అన్నది దాని సిద్ధాంతం. ప్రపంచంలోనే అత్యంత సహనశీలమైన నాగరికత మనది. అది మన ఘన వారసత్వం. దీన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. మత సామరస్యాన్ని సంరక్షించుకోవాలి. పేదరికం, అవిద్య, వ్యాధులపై ధర్మయుద్ధం చేయాలి. ఇవన్నీ చేస్తే, 21వ శతాబ్దం భారతదేశానిదే".

*- డాక్టర్ మన్మోహన్ సింగ్*

ఆయన తండ్రి గురుముఖ్‌సింగ్ రావల్పిండిలో ఎండు ఖర్జూరాల వ్యాపారం చేసేవారు. ఆయనకు తొమ్మిదిమంది పిల్లలు. మన్మోహన్‌సింగ్ ఆఖరి సంతానం. దేశ విభజన సమయంలో వారి కుటుంబం అమృత్‌సర్‌కు వలస వచ్చింది. తనకు వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉండమని ఆయన కొడుక్కి చెప్పేవారు. కాని, మన్మోహన్‌కు ఎప్పుడూ పుస్తకాలు ముందేసుకుని చదువుకుంటూ కూర్చోవటం ఇష్టం.

ఇంటికి విద్యుత్ దీపాల సౌకర్యం లేకపోవటంతో ఆయన వీధి దీపాల వెలుగులోనే చదువుకునేవారు. తండ్రి మన్మోహన్‌సింగ్‌ను వ్యాపారంలోకి దించాలని ఎంత ప్రయత్నించినా, ఆయనకు చదువంటే ఉన్న మక్కువవల్ల అది సాధ్యం కాలేదు. అదిచూసి, గురుముఖ్ సింగ్ తన కుటుంబ సభ్యులతో 'వీడు దేశానికి ప్రధానమంత్రి అవుతాడు' అని హాస్యంగా అంటుండేవారు. అదే మళ్లీ మళ్లీ నిజమైంది.

మన్మోహన్‌సింగ్ విద్యాభ్యాసం అమృత్‌సర్‌లోని హిందూసభ పాఠశాలలో ప్రారంభమైంది. హోషియార్‌పూర్ ప్రభుత్వ కళాశాలలో ఆయన చదువుకున్నారు. 10 సంవత్సరాలు అమృత్‌సర్‌లో ఉన్న తరువాత వారి కుటుంబం చండీగఢ్‌కు వలస వెళ్లింది. 1952లో పంజాబ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చేసిన మన్మోహన్ సింగ్ బి.ఎ. ఎకనామిక్స్‌లో గోల్డ్‌మెడల్ పొందారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రంలో ఎం.ఎ. చేశారు. ప్రథమస్థానం పొందారు. ఆక్స్‌ఫర్డ్‌లోనే ఆయన డి.ఫిల్ పూర్తి చేశారు. కేంబ్రిడ్జిలోనుంచి డి.లిట్ చదివారు. మన్మోహన్‌సింగ్ చదువులో ఎంతో ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించి, అధ్యాపకుల మనసులను చూరగొన్నారు.

పంజాబ్ విశ్వవిద్యాలయంలోనే కాక , కేంబ్రిడ్జిలోనూ అసమాన ప్రతిభా సంపన్నుడిగా గుర్తింపు పొందారు, 1956లో కేంబ్రిడ్జిలో ఆడమ్ స్మిత్ అవార్డు మొదలుకుని అనేక అవార్డులు, పురస్కారాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. పంజాబ్ యూనివర్సిటీలోనే ఆయన 1957 లో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేశారు. 1958, సెప్టెంబర్ 14న గురుచరణ్‌కౌర్‌ను వివాహం చేసుకున్నారు. తరువాత పంజాబ్ యూనివర్సిటీలోనే రీడర్‌గా, ప్రొఫెసర్‌గా ఎదిగారు. 1969లో ఆయన ఢిల్లీ యూనివర్సిటీలో చేరారు. కేంద్ర ప్రభుత్వానికే కాక, ఐఎంఎఫ్, ఎడిబి వంటి సంస్థలకు కూడా ఆయన ఆర్థిక సలహాదారుగా బాధ్యతలు నిర్వర్తించారు.

కేంబ్రిడ్జి,ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలలో కూడా ఆయన కొద్దిరోజులు పాఠాలు చెప్పారు. ఆర్థిక రంగంలో ఆయన చేసిన సేవలకు1987లో పద్మ భూషణ్ పురస్కారం లభించింది. దేశ, విదేశాల్లోని 15 విశ్వవిద్యాలయాలు పైగా ఆయనకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. మరెన్నో అవార్డులు ఆయనను వరించాయి.

"ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ ట్రెండ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్ సస్టెయిన్డ్ గ్రోత్" అనే పుస్తకాన్ని డాక్టర్ మన్మోహన్ సింగ్ రాశారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో వేలాది వ్యాసాలు రాశారు. పలు సామాజిక, సాంస్కృతిక, సాహిత్య సంస్థలతో ఆయనకు అవినాభావ సంబంధం ఉంది.

# ఈయనకి సాటి రాగలవారెవరు?



*పేరు* : **డాక్టర్ మన్మోహన్ సింగ్**
*పుట్టిన తేదీ* : **26-09-1932**
*పుట్టిన స్థలం* : **గహ్ (పశ్చిమ పంజాబ్)**
*తండ్రి* : **ఎస్. గుర్ముఖ్ సింగ్**
*తల్లి* : **అమృత్‌కౌర్**
*వివాహం* : **14-09-1958**
*భార్య* : **గురుశరణ్ కౌర్**
*పిల్లలు* : **ముగ్గురు కుమార్తెలు**

***1950*** : చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో బి.ఎ. (ఆనర్స్) ఎకనామిక్స్‌లో యూనివర్సిటి ఫస్ట్ వచ్చారు.
***1952*** : చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఎం.ఎ. (ఎకనామిక్స్) యూనివర్సిటీ ఫస్ట్ వచ్చారు.
***1954*** : కేంబ్రిడ్జిలోని సెయింట్ జాన్స్ కాలేజీలో అద్భుతమైన ప్రతిభ కనపరిచినందుకు రైట్స్ ప్రైజు గెలుచుకున్నారు.
***1955-57*** : కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో రెన్‌బరీ స్కాలర్‌గా ఉన్నారు.
***1957*** : ఆక్స్‌ఫర్డ్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ హానరిస్ కాసాలో డాక్టర్ ఆఫ్ లిటరేచర్. భారతదేశపు ఎగుమతుల సామర్థ్యంపై పి. హెచ్‌డి.

**వృత్తిపరమైన అనుభవం (బోధనారంగం)**

***1957-59*** : ఎకనామిక్స్‌లో ప్రొఫెసర్
***1959-63*** : చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ రీడర్‌గా, ప్రొఫెసర్‌గా ఉన్నారు.
***1963-65*** : ఢిల్లీ యూనివర్సిటీలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అంతర్జాతీయ వాణిజ్యం విభాగానికి ప్రొఫెసర్‌గా పనిచేశారు.
***1969-71*** : న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఆనరరీ ప్రొఫెసర్‌గా ఉన్నారు.
***1976*** : ఢిల్లీ యూనివర్సిటీలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ప్రొఫెసర్
***1996*** : సివిల్ సర్వంట్

**ఇతర పదవులు, బాధ్యతలు**

***1971-72*** : కేంద్ర విదేశీ వాణిజ్య మంత్రిత్వశాఖలో ఆర్థిక సలహాదారు.
***1972-76*** : కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో ముఖ్య సలహాదారు.
***1976-80*** : భారతీయ రిజర్వుబ్యాంకుకి డైరెక్టర్, భారతీయ పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకుకి డైరెక్టర్.
ఆసియా అభివృద్ధి బ్యాంకులోని డైరెక్టర్ల బోర్డులో భారతదేశం తరపున ప్రత్యామ్నాయ గవర్నర్‌గా ఉన్నారు.
ఐబిఆర్‌డిలోని డైరెక్టర్ల బోర్డులో భారతదేశం తరపున ప్రత్యామ్నాయ గవర్నర్‌గా ఉన్నారు.
***1976-80*** : కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలో కార్యదర్శిగా పనిచేశారు.
అటామిక్ ఎనర్జీ కమిషన్‌లోని ఆర్థిక విభాగంలో సభ్యులుగా ఉన్నారు.
స్పేస్ కమిషన్‌లోని ఆర్థిక విభాగంలో సభ్యులు.
***1980-82*** : ఇండో-జపాన్ సంయుక్త అధ్యయన కమిటీలోని ఇండియా విభాగానికి ఛైర్మన్‌గా పనిచేశారు.
***1982-85*** : భారతీయ రిజర్వుబ్యాంక్‌కి గవర్నర్
***1982-85*** : ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐ.ఎం.ఎఫ్)లోకి గవర్నర్ల బోర్డులో భారతదేశానికి ప్రత్యామ్నాయ గవర్నర్.
***1983-84*** : ప్రధాన మంత్రి ఆర్థిక సలహామండలిలో సభ్యులు
***1985*** : భారతీయ ఆర్థిక సంఘానికి అధ్యక్షులు
***1985-87*** : ప్లానింగ్ కమీషన్‌కి డిప్యూటీ ఛైర్మన్
***1987-90*** : జెనీవాలోని సౌత్ కమీషన్‌కి సెక్రటరీ జనరల్‌గా, కమీషనర్‌గా ఉన్నారు.
***1990-1991*** : ఆర్థిక వ్యవహారాల్లో ప్రధానమంత్రికి సలహాదారు.
***1991*** : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కి ఛైర్మన్
***1991-96*** : కేంద్ర ఆర్థిక మంత్రి
***1991*** : అస్సాం నుంచి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై రాజ్యసభకు ఎన్నికయ్యారు.
***1995*** : రాజ్యసభకు తిరిగి ఎన్నికయ్యారు.
***1996 నుంచి*** : కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని సంప్రదింపుల కమిటీలో సభ్యులు
***1996-97*** : కామర్స్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి ఛైర్మన్
***1998 నుంచి*** : రాజ్యసభలో ప్రతిపక్షనాయకులు
***1998 నుంచి*** : ఆర్థిక వ్యవహారాల కమిటీలో సభ్యులు
నిబంధనల కమిటీలో సభ్యులు
***1998-2001*** : ప్రివిలెజెస్ కమిటీలో సభ్యులు
***2000 నుంచి*** : భారత పార్లమెంటరీ గ్రూప్‌లోని ఎగ్జిక్యూటివ్ కమిటీలో సభ్యులు
***2001*** : రాజ్యసభకు తిరిగి ఎన్నిక
***2001 నుంచి*** : జనరల్ పర్పసెస్ కమిటీలో సభ్యులు

**రచించిన గ్రంథాలు**

***ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ ట్రెండ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్ సెస్టెయిన్డ్ గ్రోత్***
***వివిధ ఆర్థిక విషయాల పత్రికల్లో వందలాది వ్యాసాలు ప్రచురణ***

**ఇతర అవార్డులు**

***1956లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి ఆడమ్‌స్మిత్ ప్రైజు***
***1987లో పద్మ విభూషణ్***
***1993లో యూరో మనీ అవార్డు, ఫైనాన్స్ మినిస్టర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు***
***1993, 1994లో ఆసియా ఆర్థికమంత్రి అవార్డులు, ఆసియా మనీ అవార్డు***

**అంతర్జాతీయ బాధ్యతలు**

***1966*** : ఆర్థిక వ్యవహారాల అధికారి
***1966-69*** : యుఎన్‌సిటిఎడి (UNCTAD) లోని వాణిజ్య విభాగానికి అధ్యక్షులు
***1972-74*** : ఐఎంఎఫ్ కమిటీ ఆఫ్ ట్వంటీ ఆన్ ఇంటర్నేషనల్ మానిటరీ రిఫార్మ్‌లో భారతదేశ ప్రతినిధి
***1977-79*** : ఎయిడ్ ఇండియా కన్సార్టియా సమావేశంలో భారతీయ ప్రతినిధి
***1980-82*** : ఇండో-సోవియట్ జాయింట్ ప్లానింగ్ గ్రూప్ సమావేశానికి భారతీయ ప్రతినిధి
***1982*** : ఇండో-సోవియట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశానికి భారతీయ ప్రతినిధి
***1993*** : సైప్రస్‌లో జరిగిన కామన్‌వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ సమావేశానికి, వియన్నాలో జరిగిన మానవహక్కుల ప్రపంచ మహాసభకు భారతదేశ ప్రతినిధి

1967లో మన్మోహన్ సింగ్ చండీగఢ్‌ను వదిలి పెట్టారు. అప్పటి నుంచి ఆయన ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో పనిచేశారు. 1966లో యుఎన్‌సీటీఏడీలో ఆర్థిక వ్యవహారాల పదవి ఆయనను వరించింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, సౌత్ కమిషన్, ఆసియా అభివృద్ధి బ్యాంకు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వంటి అనేకానేక ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో మన్మోహన్ సింగ్ పనిచేశారు.

ఉత్తర అమెరికా, యూరప్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. పలు విశ్వవిద్యాలయాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా, గౌరవ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వివిధ అంతర్జాతీయ సంస్థల్లో సభ్యత్వం ఉంది.

1971-72లో భారత విదేశీ వాణిజ్య మంత్రిత్వశాఖలో ఆర్థిక సలహాదారుగా, 1972-76 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిత్వశాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా, 1976-80 మధ్యకాలంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ డైరెక్టర్‌గా, భారతీయ పారిశ్రామిక అభివృద్ధి బ్యాంక్ డైరెక్టర్‌గా, మనీలాలోని ఆసియా అభివృద్ధి బ్యాంక్ గవర్నర్ల బోర్డులో భారతదేశం తరపున సభ్యునిగా, ఐ.బి.ఆర్.డి. గవర్నర్ల బోర్డులో భారతదేశం తరపున సభ్యునిగా, 1976 నవంబర్ నుంచి 1980 ఏప్రిల్ వరకు ఆర్థికశాఖ కార్యదర్శిగా; అణువిద్యుత్ సంస్థ, అంతరిక్ష సంస్థల్లో ఆర్థిక సలహా దారుగా, 1980 నుంచి 1982 వరకు ప్రణాళికా సంఘం కార్యదర్శిగా, 1980 నుంచి 83 వరకు ఇండో జపాన్ కమిటీ ఛైర్మన్‌గా, 1982-85 మధ్యకాలంలో రిజర్వు బ్యాంక్ గవర్నర్‌గా, ఐఎంఎఫ్ గవర్నర్ల బోర్డులో సభ్యునిగా, 1983-84లో ప్రధాని ఆర్థిక సలహామండలి సభ్యునిగా, 1985లో భారత ఆర్థిక సంఘం అధ్యక్షునిగా, 1985-1987 వరకు ప్రణాళికా సంఘం డిప్యూటి ఛైర్మన్‌గా, 1987 నుంచి 1990 వరకు జెనీవాలోని సౌత్ కమిషన్‌కి సెక్రటరీ జనరల్‌గా, కమీషనర్‌గా పనిచేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ 1990-1991 మధ్య భారత ప్రధానికి ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా నియమితులయ్యారు. తరువాత కూడా మరెన్నో పదవులను అలంకరించి వాటికి వన్నె తెచ్చారు.

1991లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. అన్ని పదవులనూ సమర్థంగా నిర్వహించి అందరి ప్రశంసలూ పొందారు. రాజకీయాల్లోకి వచ్చాక మూడుసార్లు అస్సాం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

1991లో డాక్టర్ మన్మోహన్‌సింగ్ జీవితం రాజకీయ మలుపు తిరిగింది. అప్పటి ప్రధాని శ్రీ పి.వి.నరసింహారావు ఆయనను కోరి కేంద్ర ఆర్థికమంత్రిగా నియమించుకున్నారు. ఆర్థికంగా దేశం సంక్షోభంలో కూరుకుని పోయి ఉన్న కాలమది. ఆర్థికశాస్త్రంలో తాను నేర్చుకున్న సూత్రాలను, ఆర్థికరంగం నేర్పిన పాఠాలను అమలు చేసి చూపారాయన.

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆరాధ్యుడిగా, పితామహుడిగా పేరొందారు. సాహసోపేతమైన, వినూత్నమైన నిర్ణయాలు తీసుకుని ఫలితాలు సాధించారు. రాజకీయవేత్తగా మారిన ఈ ఆర్థికవేత్త సగటు భారతీయుడికి సంస్కరణ ఫలాలు రుచి చూపారు. సమాచార విప్లవం, వందకోట్ల డాలర్లు దాటిన విదేశీ మారకద్రవ్య నిలవలు, దేశీయ రహదారులపై రకరకాల వాహనాలు... ఇవన్నీ అప్పట్లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితాలే.

పార్టీలతో నిమిత్తం లేకుండా, ఏ ప్రభుత్వం వచ్చినా సంస్కరణల మంత్రం జపించటం డాక్టర్ మన్మోహన్‌సింగ్ మాయాజాలమే. భారత్ కలలుగనే స్వావలంబన విదేశీ వాణిజ్యం ద్వారా మాత్రమే సాధ్యమని నాలుగు దశాబ్దాల క్రితమే ఆయన తన పిహెచ్‌డి పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు.

ఆయన అనుసరించిన విధానాల వల్ల భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలు దగ్గరయ్యాయి. మేధావిగా అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన డాక్టర్ మన్మోహన్ సింగ్ వివాద రహితుడు. భారత ఆర్థిక వ్యవస్థను సంస్కరణల పథానికి మళ్లించి, ఉదారీకరించిన డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు ప్రారంభించారు. అస్తవ్యస్థంగా, దివాలా తీసే పరిస్థితిలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఒక గాడిలో పెట్టి, గట్టెక్కించినది ఆయనే.

1990 ప్రాంతంలో మన దేశ ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమైంది. స్థూల జాతీయ ఉత్పత్తుల్లో (జిడిపి) ద్రవ్యలోటు 8.5శాతం ఉండగా, పెరుగుదల రేటు కేవలం 4.0శాతం మాత్రమే. అలాంటి అస్తవ్యస్థ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దిన గౌరవం డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కే దక్కింది. పన్నుల సరళీకరణ, పరిశ్రమలపై ఆంక్షలు ఎత్తి వేయటం, పర్మిట్‌రాజ్‌ను సాహసవంతమైన నిర్ణయాల వల్లనే ఆర్థిక సంస్కరణలతో మన దేశ ఆర్థిక వ్యవస్థ వేగవంతంగా అభివృద్ధి చెందింది.

డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు సాహిత్యమంటే కూడా అభిమానం. కేవలం ఆర్థిక శాస్త్రమే ఆయనకు తెలుసుననుకోవటం పొరపాటు. తన బడ్జెట్ ప్రసంగాల్లో ప్రముఖ రచయితల వాక్యాలను ఉటంకించేవారు. చరిత్రాత్మకమైన 1994 బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ, "ఒక ఆలోచన పుట్టిందంటే దాన్ని భూమ్మీద ఏ శక్తి ఆపలేదు", అని ప్రముఖ రచయిత విక్టర్ హ్యూగో అన్న మాటలను తన బడ్జెట్ ప్రసంగంలో ఉల్లేఖించారాయన.

భారత ఆర్థిక వ్యవస్థకు మేలిమలుపు ఇచ్చిన ఈ బడ్జెట్ దేశ ఆర్థిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. కరంట్ అకౌంట్‌పై కన్వర్టబులిటీకి అనుమతిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ విప్లవాత్మకమైన ప్రకటనే దేశీయ వాణిజ్య, పారిశ్రామిక రంగాలపై సంకెళ్లను తొలగించింది. అనేక కొత్తసంస్థలు, ప్రధానంగా ఐటీ సంస్థలు ఆవిర్భవించాయి.

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మే 20వ తేదీ సాయంత్రం ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా... ఓపెన్ టాప్ జీపులో నిలబడిన డాక్టర్ వైఎస్ ప్రజలకు అభివాదం చేస్తూ స్టేడియం ప్రధాన ద్వారం




# రాష్ట్ర చరిత్రలో కొత్తపుట తెరుస్తున్నాం !

ప్రమాణ స్వీకారం సందర్భంగా డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి ప్రసంగం విలక్షణంగా సాగింది. సుమారు అరగంటపాటు ప్రసంగించిన వైఎస్ "నా అక్కలకు, చెల్లెళ్ళకు, అన్నలకు, తమ్ముళ్ళకు నమస్కరిస్తున్నా చేతులు జోడించి సవినయంగా..." అంటూ ప్రారంభించారు. ఆ తర్వాత వేదికపై ఉన్న శ్రీ వీరప్పమొయిలీ, శ్రీ డి.శ్రీనివాస్‌లకు శుభాభివందనాలు తెలిపారు. "దేశంలో ఏ ప్రభుత్వానికీ ఇవ్వనంత శక్తిని నాకిచ్చారు. రాష్ట్రం నుంచి లోక్‌సభకు **33** మంది ఎంపీలను గెలిపించారంటే ఏం చేసి మీ రుణం తీర్చుకోవాలి?" అంటూ ప్రజలపై కృతజ్ఞతాభావాన్ని ప్రకటించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వ పనితీరును విశ్లేషించారు. అనంతరం తొమ్మిది గంటలకు ఉచిత విద్యుత్తు పెంపు, రేషన్ బియ్యం **30** కిలోలకు పెంపు పథకాలపై తొలి సంతకాలు చేశారు. ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా వైఎస్ ఈ సంతకాలు చేశారు. మరో పదేళ్ళూ రాష్ట్రం పచ్చగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. "మంచి వర్షాలు రావాలి. పంటలు పండాలి" అని దేవుడ్ని వేడుకున్నారు. "బలం పెరిగిన కొద్దీ ఒదిగి ఉండడం నేర్చుకుందాం. అధికార గర్వం వద్దు. ప్రజలకు దగ్గరగా ఉందాం..." అంటూ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## సి.ఎం. ప్రసంగం క్లుప్తంగా . . .

"రాష్ట్రంలో 2004 ఎన్నికల ముందు చేసిన ప్రతి వాగ్దానాన్నీ నెరవేర్చాం. ఎన్నికల వాగ్దానాలే కాదు.. ప్రజలకు ఏ అవసరమొచ్చినా వ్యయప్రయాసలు లెక్కచేయకుండా ప్రభుత్వం పనిచేసింది. రాజీవ్, ఆరోగ్యశ్రీ లాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రతి ఒక్కరి కీ ఆహార భద్రత కల్పించడానికి రూ.2కే కిలో బియ్యం అమలు చేస్తున్నాం. ప్రతి చేనుకూ నీరు, ప్రతి చేతికీ పని ఇచ్చేందుకు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాం. 17 ప్రాజెక్టులు పూర్తి చేశాం. మిగిలిన వాటి పనులు వేగంగా జరగుతున్నాయి. జలయజ్ఞం శరవేగంతో జరుగుతోంది. ఐదేళ్లలో విశ్వసనీయ పరిపాలన అందించాం."




## మరింత బాగా చేస్తాం

"గత ఐదేళ్లలో చేసిన పనులను మరింత బాగా చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పాం. లోటుపాట్లు గుర్తించి సరిదిద్దుతామని చెప్పాం. ఆహార భద్రతను పెంచేందుకు 20 కిలోలిచ్చే బియ్యాన్ని 30 కిలోలకు పెంచి మనిషికి నాలుగు నుంచి ఆరు కిలోల బియ్యం ఇస్తామన్నాం."

"రైతాంగానికి ఏడుగంటలు ఇస్తున్న ఉచిత విద్యుత్ చాలడం లేదంటే తొమ్మిది గంటలు ఇస్తామని వాగ్దానం చేశాం. వీటి అమలుకు కార్యాచరణ మొదలుపెట్టాలని అధికారులకు చెప్పాం."

"గోదాములు, ఆహార నిల్వలు సమకూర్చుకోవడానికి నాలుగు నెలల సమయం పడుతుంది. 30 కిలోల చొప్పున బియ్యం ఇవ్వడానికి సెప్టెంబరు వరకు సమయం కావాలని వారు అడిగారు. అక్టోబరు నుంచి చెప్పిన మేరకు 30 కిలోల బియ్యం ఇస్తాం. ఇప్పుడే సంతకం చేస్తున్నాను. తొమ్మిది గంటల ఉచిత విద్యుత్‌ను ఖరీఫ్ నుంచే రైతాంగానికి ఇస్తాం."

## అధికార దుర్వినియోగం వద్దు

"చిత్తశుద్ధి గల పరిపాలన అందించాం. భగవంతుడి ఆశీస్సుల వల్ల ఏటా మంచి వర్షాలు కురిశాయి. ప్రభుత్వ కార్యాచరణలో, కర్తవ్య నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పార్టీ కార్యకర్తలు నిరోధించాలి."

"అధికార దుర్వినియోగం కూడదని శ్రేణులకు విజ్ఞప్తి చేస్తున్నా, బలం పెరిగేకొద్దీ ఒదగాలి తప్ప గర్వంతో ఉండకూడదు. ఎదిగేకొద్దీ ఒదగాలని కాంగ్రెస్ శ్రేణులను కోరుతున్నాను."

## ఋణం ఎలా తీర్చుకోను?

"లోక్‌సభ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపించి భారతదేశంలో ఏ రాష్ట్రమూ ఇవ్వని అత్యంత గొప్ప శక్తిని ఆంధ్ర ప్రజలు కాంగ్రెస్‌కు అందించినందుకు కృతజ్ఞతలు. 42 లోక్‌సభ స్థానాలకు గాను 33 స్థానాలు ఇచ్చారంటే ఏం చేస్తే మీ రుణం తీర్చుకోగలను? ఐదేళ్ల క్రితం కాంగ్రెస్, మరికొన్ని పార్టీలతో కలిసి అధికారంలోకి వచ్చింది. నిన్నటి ఎన్నికల్లో మీ ఆదరాభిమానాలతో ఏ ఇతర పార్టీ సహకారం లేకుండా కాంగ్రెస్ బలాన్ని పెంచి 156 స్థానాలు ఇచ్చినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు. అపూర్వ విజయమిది. "

"ఐదేళ్ల తర్వాత ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుందని, గెలుపు అంత సులభం కాదని కొందరన్నారు. పూర్తి స్థాయి మెజారిటీ రావడం దుస్సాధ్యమన్నారు రాజకీయ విశ్లేషకులు. నాకు మాత్రం ఏ రోజూ అనుమానం రాలేదు. దేశంలో యూపీఏ ప్రభుత్వం శ్రీమతి సోనియా, డాక్టర్ మన్మోహన్ సింగ్‌ల అధ్వర్యంలో మంచి పరిపాలన అందించింది."

"భారతదేశం వెలగడమంటే ధనవంతులు, భూస్వాములు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు వెలగడం కాదు. సామాన్యుడికి మేలు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించి... జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు లాంటి విప్లవాత్మక చట్టాలు తెచ్చారు. రైతాంగాన్ని ఆదుకోవడానికి రూ. 70వేల కోట్ల రుణాలను మాఫీ చేశారు. కమ్యూనిస్టులు వ్యతిరేకించినా దేశంలో విద్యుదుత్పతికి అణు ఇంధనం అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని అణు ఒప్పందం చేసుకున్నారు."

"అధికారంలో ఉన్నా లేకున్నా పరిశ్రమలు పెట్టడానికి, విద్యుదుత్పత్తికి నిలబడతామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. యువనేత రాహుల్‌గాంధీ నాయకత్వం పార్టీకి మరింత ఊపునిచ్చింది. ఆయన నాయకత్వానికి యువత బాగా ఆకర్షితమైంది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మీ అందరి ఆదరాభిమానాలు, ఆశీర్వాద బలంతో కొత్తపుట తెరుస్తున్నాం. మంచి పరిపాలన అందించి రాష్ట్ర ప్రజలకు మంచి సేవలందించాలని గవర్నరు తివారీ ఆదేశిస్తూ రాజ్యాంగబద్ధంగా పని చేయాలని పదవీ ప్రమాణం చేయించారు."




నుంచి వేదిక వద్దకు చేరుకున్నారు.

ఆయన సతీమణి శ్రీమతి విజయలక్ష్మి, కుమారుడు, కడప ఎంపీ శ్రీ జగన్మోహన్‌రెడ్డి, మనవడు రాజారెడ్డి (కూతురు షర్మిల తనయుడు),



ఆప్తమిత్రుడు, రాజ్యసభ సభ్యుడు శ్రీ కేవీపీ రామచంద్రరావు తదితరులు వైఎస్ వెంట ఆ జీపులో ఉన్నారు. వైఎస్‌తో పాటే వేదిక పైకి వచ్చారు. అనంతరం సరిగ్గా సాయంత్రం 6.32 గంటలకు గవర్నర్ శ్రీ నారాయణ్‌ దత్ తివారీ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

"వై.యస్. రాజశేఖరరెడ్డి అను నేను... భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటానని, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుతానని, అధికార రహస్యాలను కాపాడుతానని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంత:కరణతో నిర్వర్తిస్తానని, భయంగానీ, పక్షపాతంగానీ, రాగద్వేషాలు లేకుండా రాజ్యాంగాన్ని, శాసనాలను అను-సరించి ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను" అని మాతృ, అధికార భాష అయిన తెలుగులో రాష్ట్ర 22వ ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ ప్రమాణ స్వీకారం చేశారు.

అనంతరం తివారీ పుష్పగుచ్ఛం అందించి ఆయనను అభినందించారు. ఆ తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు, వేద పండితులు ముఖ్యమంత్రి వైఎస్‌ను ఆశీర్వదించారు. అనంతరం ఆయన బైబిల్‌పై ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు, ఆ తర్వాత ఇస్లాం మత గురువు ప్రార్థనలు చేశారు. చివరగా సభ ముగిసే ముందు శ్రీ డి. శ్రీనివాస్, శ్రీ వీరప్పమొయిలీ డాక్టర్ వైఎస్‌ను అభినందించారు.

**– రాధాకృష్ణ**



# మన మంత్రులు - వారి జీవిత విశేషాలు



**శ్రీ కొణిజేటి రోశయ్య**
*ఆర్థిక-ప్రణాళిక, చిన్నమొత్తాల పొదుపు*

**75** సంవత్సరాల శ్రీ కొణిజేటి రోశయ్య 1933, జూలై 4న గుంటూరు జిల్లా వేమూరు గ్రామంలో జన్మించారు. 1952లో గుంటూరులోని హిందూ కళాశాలలో విద్యార్థి నాయకుడిగా పనిచేసి, విద్యార్థి సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1968, 1974, 1980లలో రాష్ట్ర శాసన మండలికి ఎన్నికయ్యారు. 1978 నుంచి శాసనమండలిలో ప్రతిపక్షనాయకుడిగా వ్యవహరించారు. 1998లో నర్సరావుపేట నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికై, వివిధ పార్లమెంటరీ కమిటీల్లో పనిచేశారు.

1979లో శ్రీ టి. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రవాణా, గృహ నిర్మాణం, వాణిజ్య పన్నుల శాఖల మంత్రిగా పనిచేశారు. 1982లో శ్రీ కె. విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హోం శాఖ మంత్రిగా పనిచేశారు. 1989లో తిరిగి డాక్టర్ ఎం. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆర్థిక, ప్రణాళిక, రవాణా, చేనేత, జైళ్ళ, ఉన్నత విద్య, శాసనసభా వ్యవహారాల మంత్రిగా పనిచేశారు.

1991లో శ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి కేబినెట్‌లో వైద్య, ఆరోగ్య శాఖామంత్రిగా, 1992లో శ్రీ కె. విజయభాస్కరరెడ్డి కేబినెట్‌లో ఆర్థిక, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల మంత్రిగా పనిచేశారు. 1995-1997 మధ్య ఎపిసిసి అధ్యక్షునిగా పనిచేశారు.

2004 నుంచి 2009 వరకు డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో ఆర్థిక, ప్రణాళిక, శాసనసభా వ్యవహారాల మంత్రిగా, 2005 నుంచి 2006 మధ్య కాలంలో వైద్య, ఆరోగ్య శాఖమంత్రిగా పనిచేశారు.

ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి 2007లో గౌరవ డాక్టరేట్ పొందారు. 2009లో రాష్ట్ర శాసనమండలి సభ్యునిగా నియమితులై, ప్రస్తుతం ఆర్థిక, ప్రణాళిక, చిన్న మొత్తాల పొదుపు, లాటరీలు, శాసనసభా వ్యవహారాల మంత్రిగా పదవి చేపట్టారు.



**శ్రీ పొన్నాల లక్ష్మయ్య**
*భారీ, మధ్యతరహా, నీటిపారుదల*

**65** సంవత్సరాల శ్రీ పొన్నాల లక్ష్మయ్య 15, ఫిబ్రవరి 1944న వరంగల్లు జిల్లా రఘునాథ్‌పల్లి మండలం ఖిల్లాషాపురంలో శ్రీ రామకిష్టయ్య, శ్రీమతి రాధమ్మ దంపతులకు జన్మించారు. బి.ఇ. మెకానికల్ ఇంజనీరింగ్ చేసి, వివిధ సంస్థల్లో ఇంజనీర్‌గా పనిచేశారు.

డిసిసి కోశాధికారిగా, కెయు సెనెట్ సభ్యునిగా, డిసిపి ఉపాధ్యక్షునిగా పనిచేశారు. 1989లో జనగామ శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 1991-92 రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 1999లో రెండవసారి, 2004లో మూడవసారి జనగామ శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2009లో కూడా జనగామ శాసనసభ్యునిగా ఎన్నికై, మంత్రిపదవిని చేపట్టారు.



**శ్రీ ధర్మాన ప్రసాదరావు**
*రెవెన్యూ, సహాయ, పునరావాసం, యుఎల్‌సి*

**50** సంవత్సరాల శ్రీ ధర్మాన ప్రసాదరావు 1958, మే 21న శ్రీకాకుళం జిల్లాలోని పొలకి మండలంలో గల మబగం గ్రామంలో శ్రీ రామలింగం నాయుడు, శ్రీమతి సావిత్రమ్మ దంపతులకు జన్మించారు. విశాఖపట్నంలోని ఎవిన్ కళాశాలలో చదువుకున్న శ్రీ ప్రసాదరావు యువజన కాంగ్రెస్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే మబగం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై, పొలకి మండలాధ్యక్షునిగా కూడా ఎన్నికయ్యారు. 1987లో శ్రీకాకుళం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై, 1989లో నరసన్నపేట నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. ఎపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఎఐసిసి సభ్యునిగా కూడా ఆయన పనిచేశారు. గుంటూరు, విశాఖపట్నం జిల్లాలకు పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేశారు. శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి, శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గాల్లో టెక్స్‌టైల్స్, యువజన వ్యవహారాలు, క్రీడలు, మధ్యనిషేధ, పారుదల, రేవుల శాఖలకు మంత్రిగా పనిచేశారు. 2004 ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజవర్గం నుంచి ఎన్నికై రెవెన్యూ మంత్రిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి ఎన్నికై మళ్లీ రెవెన్యూ మంత్రి పదవి చేపట్టారు.



**శ్రీ గాదె వెంకటరెడ్డి**
*దేవాదాయం, స్టాంప్ రిజిస్ట్రేషన్*

**70** సంవత్సరాల శ్రీ గాదె వెంకటరెడ్డి ప్రకాశం జిల్లా పావులూరు గ్రామంలో శ్రీ వీరారెడ్డి, శ్రీమతి వెంకాయమ్మ దంపతులకు జన్మించారు. బి.ఏ. ఎల్.ఎల్.బి. చేశారు. 1962లో బాపట్లలో న్యాయవాదిగా ఉన్నారు. 1991 ఉప ఎన్నికల్లో పర్చూరు నుండి ఎన్నికై 1993 శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో బాపట్ల శాసనసభ్యునిగా ఎన్నికై మంత్రి పదవి చేపట్టారు.



## శ్రీ ఆనం రామనారాయణరెడ్డి

*మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి*

**57** సంవత్సరాల శ్రీ ఆనం రామనారాయణరెడ్డి జులై 10, 1952 న శ్రీ వెంకటరెడ్డి, శ్రీమతి వెంకట రమణమ్మ దంపతులకు జన్మించారు. బి.కాం., బి.ఎల్. చేశారు. 1983 అసెంబ్లీ ఎన్నికలలో నెల్లూరు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 1985 అసెంబ్లీ ఎన్నికలలో రాపూరు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1989లో ఎన్.టి.ఆర్. కేబినెట్‌లో ఆర్&బి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1999, 2004 ఎన్నికలలో శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 2007 జూన్ నుంచి సమాచార, పౌరసంబంధాలు, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేశారు. 2009 లో ఆత్మకూరు శాసనసభ్యులుగా ఎన్నికై మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖల పదవిని చేపట్టారు.



## శ్రీ ఎన్. రఘువీరారెడ్డి

*వ్యవసాయం, అగ్రికల్చర్, టెక్నాలజీ మిషన్, హార్టీకల్చర్ సెరికల్చర్*

**52** సంవత్సరాల నీలకంఠాపురం రఘువీరారెడ్డి 1957, ఫిబ్రవరి 12 అనంతపురం జిల్లా మడకశిర గ్రామంలో శ్రీ కావేరప్ప, శ్రీమతి నరసమ్మ దంపతులకు జన్మించారు. బి.ఎస్.సి., బిఎల్. చేశారు. 1989లో మడకశిర శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు, శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డి హయాంలో పశు సంవర్ధక శాఖ మంత్రిగా పనిచేశారు. 1999 తిరిగి మడకశిర శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2004లో కూడా మడకశిర నుంచే శాసనసభకు ఎన్నికై వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో కళ్యాణదుర్గం శాసనసభ్యుడిగా ఎన్నికై మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు.



## శ్రీమతి జె. గీతారెడ్డి

*సమాచార, పౌర సంబంధాలు, చలన చిత్రాభివృద్ధి సంస్థ, టూరిజం*

**62** సంవత్సరాల శ్రీమతి జెట్టి గీతారెడ్డి 17, ఏప్రిల్ 1947న హైదరాబాద్‌లో జన్మించారు. ప్రముఖ రాజకీయవేత్త శ్రీమతి జె. ఈశ్వరీబాయి కుమార్తె ఈమె. భర్త శ్రీ రాంచంద్రారెడ్డి. శ్రీమతి గీతారెడ్డి వృత్తిరీత్యా డాక్టరు. 1989లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన డాక్టర్ గీతారెడ్డి మెదక్ జిల్లా గజ్వేల్ (ఎస్.సి.) నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికై, సాంఘిక సంక్షేమం, సెకండరీ విద్యా శాఖలకు మంత్రిగా పనిచేశారు.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. 2004 ఎన్నికల్లో గజ్వేల్ నుంచి శాసనసభ్యురాలిగా ఎన్నికై, పర్యాటక, చక్కెర, భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో జహీరాబాదు శాసనసభ్యురాలిగా ఎన్నికై మంత్రిపదవి చేపట్టారు.



## శ్రీమతి గల్లా అరుణ కుమారి

*రోడ్లు , భవనాలు*

**62** సంవత్సరాల శ్రీమతి గల్లా అరుణకుమారి ఆగస్టు 8, 1947లో జన్మించారు. తండ్రి శ్రీ గల్లా రామచంద్రనాయుడు. యు. ఎస్.ఎ.లో డిగ్రీ చేశారు. ఏఐసిసి సభ్యురాలుగా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, పిసిసి కార్యదర్శిగా పనిచేశారు. 1989, 1999 ,2004లలో శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర వైద్య, విద్య, ఆరోగ్యబీమా శాఖామాత్యులుగా పనిచేశారు. 2009లో చంద్రగిరి శాసనసభ్యురాలిగా ఎన్నికై రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు.



## శ్రీమతి పి. సబితా రెడ్డి

*హోం, జైళ్లు, అగ్నిమాపక సర్వీసులు సైనికసంక్షేమం ప్రింటింగ్ & స్టేషనరీ*

**46** సంవత్సరాల శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి 1963, మే 5న రంగారెడ్డి జిల్లాలోని తాండూరు మండలంలో గల కోటబాస్‌పల్లి గ్రామంలో జన్మించారు. ఆమె భర్త దివంగత శ్రీ పి. ఇంద్రారెడ్డి గతంలో హోంశాఖ మంత్రిగా పనిచేశారు. ఈమె తండ్రి శ్రీ మహిపాల్‌రెడ్డి, తల్లి శ్రీమతి వెంకటమ్మ. చేవెళ్ళలో జరిగిన ఉప ఎన్నికలలో శాసనసభకు ఎన్నికయ్యారు. 2004లోకూడా చేవెళ్ళ శాసనసభ్యురాలిగా ఎన్నికై, గనులు, భూగర్భ వనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో కూడా చేవెళ్ళ నుంచి ఎన్నికై, మంత్రి పదవి బాధ్యతలు చేపట్టారు.



## శ్రీ శత్రుచర్ల విజయరామరాజు

*రవాణా*

**61** సంవత్సరాల శ్రీ శత్రుచర్ల విజయరామరాజు విజయనగరం జిల్లాలోని జయంవలస మండలంలో గల చిన్నమేదంగి గ్రామంలో 148, ఆగస్టు 4న శ్రీ బాలగంగాధర్ నారాయణ రాజు, శ్రీమతి కుముద కుమారిదేవి దంపతులకు జన్మించారు. పియుసి వరకు ఆయన చదువుకున్నారు. తోటపని ఆయనకు ఇష్టం. ఇదివరకు

ఆయన ఐదుసార్లు రాష్ట్ర శాసనసభకు, మూడు సార్లు పార్లమెంటుకు ఎన్నికయ్యారు. రాజకీయాల్లో ప్రవేశించక ముందు ఆయన మిలటరీలో పనిచేశారు. 1999 నుంచి 2004 వరకు సిఎల్‌పి ఉపనాయకుడిగా ఉన్నారు. 2004 ఎన్నికల్లో పార్వతీపురం నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికై అటవీ శాఖ, పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ మంత్రిగా తొలిసారి మంత్రి పదవి చేపట్టారు. 2009 ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గం నుంచి ఎన్నికై రవాణాశాఖ మంత్రి పదవి చేపట్టారు.



## శ్రీ బొత్స సత్యనారాయణ
*పంచాయితీరాజ్*

**51** సంవత్సరాల శ్రీ బొత్స సత్యనారాయణ 1958, జులై 9న విజయనగరంలో శ్రీ గురునాయుడు, శ్రీమతి ఈశ్వరమ్మ దంపతులకు జన్మించారు. శ్రీ సత్యనారాయణ డిగ్రీ వరకు చదివి తరువాత క్రియాశీల రాజకీయల్లోకి ప్రవేశించారు. ఆయన గతంలో సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్‌గా, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా పలు పదవులు చేపట్టారు. 2004లో విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికై భారీపరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధి శాఖ మంత్రిగా, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పని చేశారు. 2009 లో అదే నియోజకవర్గం నుంచి ఎన్నికై పంచాయితీరాజ్ మంత్రి పదవి చేపట్టారు.



## శ్రీ కన్నా లక్ష్మీనారాయణ
*భారీ పరిశ్రమలు, దేవాదాయం, స్టాంప్స్-రిజిస్ట్రేషన్*

**54** సంవత్సరాల శ్రీ కన్నా లక్ష్మీనారాయణ 1955, ఆగస్టు 13న గుంటూరులో శ్రీ రంగయ్య, శ్రీమతి మస్తానమ్మ దంపతులకు జన్మించారు. బి.కాం. వరకు చదివారు. ఆయన శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి హాయాంలో రాష్ట్ర కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 2004లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2009లో గుంటూరు పశ్చిమం నుండి శాసన సభ్యులుగా ఎన్నికై, మంత్రి పదవి చేపట్టారు.



## శ్రీ ఎం. ముఖేష్ గౌడ్
*బి.సి. సంక్షేమం*

**50** సంవత్సరాల శ్రీ ఎం. ముఖేష్‌గౌడ్ 1, జూలై 1959లో హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి శ్రీ ఎం. నరసింహగౌడ్. బి.ఎ. చదివారు. ఎపిసిసిలోని ఒబిసి విభాగానికి ఛైర్మన్‌గా పనిచేశారు. ఎపిసిసి ఎన్నికల కమిటీ సభ్యునిగా, తెలంగాణా ప్రాంతీయ కాంగ్రెస్‌కు సమన్వయ కమిటీ సభ్యునిగా పనిచేశారు. 1983లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1986లో జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికై, ఎం.సి.హెచ్ స్టాండింగ్ కమిటీ సభ్యునిగా పనిచేశారు. 1989లో, 2004లో మహరాజ్‌గంజ్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1991-94 మధ్యకాలంలో రాష్ట్ర పట్టణాభివృద్ధి, హౌసింగ్ కార్పొరేషన్‌కి ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో గోషామహల్ నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు.



## శ్రీ వట్టి వసంతకుమార్
*గ్రామీణాభివృద్ధి*

**56** సంవత్సరాల శ్రీ వట్టి వసంత కుమార్ బి.ఎస్.సి (అగ్రి), యం.బి.ఎ. చేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లో ప్రవేశించారు. 2004లో ఉంగుటూరు శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. 2009లో అదే నియోజకవర్గం నుండి శాసన సభ్యులుగా ఎన్నికై గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు.



## శ్రీ డి. రాజనర్సింహ
*మార్కెటింగ్ - గిడ్డంగులు*

**51** సంవత్సరాల శ్రీ డి. రాజనర్సింహ 5, డిసెంబర్ 1958న సికింద్రాబాద్‌లో జన్మించారు. తండ్రి శ్రీ రాజనర్సింహ. 1989లో ఆంథోల్ ఎమ్మెల్యేగా, 1991లో ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, 2004లో ఆంథోల్ శాసనసభ్యుడి ఎన్నికయ్యారు. 2007 పాఠశాల విద్యాశాఖామంత్రిగా పదవి నిర్వహించారు. 2009లో మూడవసారిగా శాసనసభ్యునిగా గెలుపొందారు.

## శ్రీ దానం నాగేందర్
*ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్యవిధాన పరిషత్, ఆసుపత్రి సేవలు*



**48** సంవత్సరాల శ్రీ దానం నాగేందర్ హైదరాబాద్‌లో జన్మించారు. బి.ఎ. చదివారు. హైదరాబాద్ నగరంలో

ఆసిఫ్‌నగర్ నియోజకవర్గం నుంచి 1994, 1999, 2004 సంవత్సరాల్లో శాసనసభ్యునిగా గెలుపొందారు. 2004లో జరిగిన ఉప ఎన్నికలలో ఈ నియోజకవర్గం నుంచి ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా గెలుపొంది, తొలిసారి మంత్రి అయ్యారు.

స్వతంత్ర అభ్యర్థిగా రామచంద్రాపురం శాసనసభ్యులుగా ఎన్నికై సాంఘికసంక్షేమ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. అదే నియోజకవర్గం నుంచి 2009లో ఎన్నికై మళ్లీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పదవి చేపట్టారు.



## శ్రీ ఎం. వెంకటరమణారావు

*లా & కోర్టులు, సాంకేతిక విద్య-ఐటిఐ*

**45** సంవత్సరాల శ్రీ మోపిదేవి వెంకట రమణారావు గుంటూరు జిల్లాలోని నిజాం పట్నం గ్రామంలో శ్రీ వీర రాఘవయ్య, శ్రీమతి నాగులమ్మ దంపతులకు జన్మించారు. 1987లో ఎంపీపీగా, 1999, 2004 లో కూచినపూడి నియోజకవర్గం శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. మౌలిక వసతులు, రేవులు, విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. 2009 లో రేపల్లె శాసనసభ్యునిగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.



## శ్రీ పినిపే విశ్వరూప్

*గ్రామీణ నీటి సరఫరా*

**47** సంవత్సరాల శ్రీ పినిపే విశ్వరూప్ అక్టోబర్ 2, 1962న తూ.గో. జిల్లా కాట్రేని కోన మండలం నడవపల్లి గ్రామంలో శ్రీ రెడ్డి వంతులుగారికి జన్మించారు. ఈయన బి.ఎస్సీ,బి.ఇడి. చేశారు. 1985లో కాంగ్రెస్ ఎస్‌సి, ఎస్‌టి సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా చేశారు. 2004లో ముమ్మిడివరం నుండి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 2009లో అమలాపురం నుండి శాసనసభ్యులుగా ఎన్నికై, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పదవి చేపట్టారు.



## శ్రీ పసుపులేటి బాలరాజు

*గిరిజన సంక్షేమం, ఆర్ఐఎడి*

**47** సంవత్సరాల శ్రీ పసుపులేటి బాలరాజు మే 12, 1962లో విశాఖపట్నం జిల్లా గూడెం కాలనీ గ్రామంలో జన్మించారు. 1995లో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా రాజకీయ రంగప్రవేశం చేశారు. 1989లో చింతపల్లి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1990లో కాఫీ ప్లాంటేషన్ ఛైర్మన్‌గాను, శాసనసభ కమిటీల్లో సభ్యునిగాను, ఫ్రీ లీగల్ ఎయిడ్ కమిటీ సభ్యులుగాను, పిసిసి జాయింట్ కార్యదర్శిగాను, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగాను, పిసిసి దీర్ఘకాలిక సభ్యులుగాను, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగాను, జిల్లా ప్రణాళిక సంఘం సభ్యులుగాను, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్‌టి సెల్ అధ్యక్షులుగాను బాధ్యతలు నిర్వర్తించారు. 2009 ఎన్నికల్లో పాడేరు నుండి ఎన్నికై గిరిజన సంక్షేమం, ఆర్ఐఎడి మంత్రి పదవి చేపట్టారు.



## శ్రీ పితాని సత్యనారాయణ

*ఆరోగ్యశ్రీ, ఆరోగ్యబీమా, 104, 108 వైద్య మౌలిక సదుపాయాలు*

**53** సంవత్సరాల శ్రీ పితాని సత్యనారాయణ బి.కాం చేశారు. ప్రస్తుతం పెనుగొండ సిట్టింగ్ శాసనసభ్యులుగా ఉన్నారు. 2009లో ఆచంట నియోజకవర్గం నుంచి ఎన్నికై మంత్రి పదవి చేపట్టారు.



## శ్రీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

*సాంఘిక సంక్షేమం*

**59** సంవత్సరాల శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆగస్టు 8, 1950లో తూ.గో. జిల్లా హసన్‌బాదలో జన్మించారు. 1970 నుండి రాజకీయ జీవితం ప్రారంభించారు. 1988లో హసన్‌బాద సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1989లో తొలి సారిగా కాంగ్రెస్‌పార్టీ శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 2004లో కాంగ్రెస్‌పార్టీ మద్దతుతో



## శ్రీ పి. సుదర్శన్ రెడ్డి

*వైద్య, విద్య*

**59** సంవత్సరాల శ్రీ పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ జిల్లా సినార్‌పల్లి గ్రామంలో ఆగస్టు 2, 1950న శ్రీ గంగారెడ్డి, రుక్కుమవ్వ దంపతులకు జన్మించారు. బి.ఎ. చదివారు. 1999, 2004లలో నిజామాబాద్‌లోని బోధన్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. పిసిసి ప్రతినిధిగా పనిచేశారు. టిటిడి బోర్డులో సభ్యునిగా ఉన్నారు. 2009లో బోధన్ శాసనసభ్యుడిగా ఎన్నికై, మంత్రిపదవి చేపట్టారు.



## శ్రీ కొలుసు పార్థసారథి

*పశు సంవర్ధకం, పాడి పరిశ్రమాభివృద్ధి మత్స్య, వెటనరీ యూనివర్సిటీ*

**44** సంవత్సరాల శ్రీ కొలుసు పార్థసారథి ఏప్రిల్ 18, 1965 కారకంపాడు గ్రామంలో శ్రీ పెదరెడ్డయ్య, సామ్రాజ్యం దంపతులకు జన్మించారు. 2004లో ఉయ్యూరు నియోజక వర్గం నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2009లో పెనమలూరు శాసనసభ్యునిగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ❀



## శ్రీ డి.ఎం. ప్రసాదరావు

*సెకండరీ ఎడ్యుకేషన్, రెసిడెన్షియల్ స్కూల్స్, వయోజన విద్య*

**47** సంవత్సరాల శ్రీ డొక్క మాణిక్య వరప్రసాద రావు మార్చి 5, 1962 గురజాల గ్రామంలో జన్మించారు. తండ్రి శ్రీ దేవభిక్షం. శ్రీ వరప్రసాదరావు ఎల్.ఎల్.ఎం. (పి.హెచ్‌డి) చేశారు. 2004లో తాడికొండ శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2009లో కూడా అదే నియోజకవర్గం నుంచి ఎన్నికై మంత్రి పదవి చేపట్టారు. ❀



## శ్రీ బాలినేని శ్రీనివాసరెడ్డి

*గనులు, జియాలజీ, హాండ్లూమ్ & టెక్స్‌టైల్*

**46** సంవత్సరాల శ్రీ బాలినేని శ్రీనివాసరెడ్డి డిసెంబర్ 12, 1963 ప్రకాశం జిల్లా, కొణిజేడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వరరెడ్డి, శ్రీమతి రమాదేవి దంపతులకు జన్మించారు. బి.కాం. చేశారు. 1995-98లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా, 1998-2001 జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పనిచేశారు. 1999లో, 2004లో ఒంగోలు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 2009లో కూడా అదే నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా ఎన్నికై, మంత్రి పదవి చేపట్టారు. ❀



## శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డి

*బి.సి. సంక్షేమం*

**65** సంవత్సరాల శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డి 22, మే 1944లో కావేపల్లి మండలం పాతలింగాల గ్రామంలో జన్మించారు. పాతలింగాల గ్రామ సర్పంచ్‌గా 3 సార్లు, లీడ్‌బ్యాంక్ డైరెక్టర్‌గా, సిసిసి కార్యదర్శిగా, పిసిసి కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేశారు. ఇంతకు ముందు సుజాతానగర్ నియోజక వర్గానికి శాసనసభ్యునిగా ఉన్నారు. 2009లో పాలేరు నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికై, మంత్రిపదవి చేపట్టారు. ❀



## శ్రీ పి. రామచంద్రారెడ్డి

*అడవులు, పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ*

**57** సంవత్సరాల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జులై 1, 1952లో జన్మించారు. తండ్రి పెద్దిరెడ్డి లక్ష్మీరెడ్డి. శ్రీ రామచంద్రా రెడ్డి ఎం.ఎ. పి.హెచ్.డి. చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా ఎన్నికై అడవులు, పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీల మంత్రిగా పదవి చేపట్టారు. ❀



## శ్రీ సి. శిల్పా మోహన్‌రెడ్డి

*హౌసింగ్, బలహీన వర్గాల గృహ నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ సహకార గృహ నిర్మాణం, సంఘాల సమాఖ్య, ఎ.పి. హౌసింగ్ బోర్డు*

**49** సంవత్సరాల శ్రీ సి. శిల్పా మోహన్‌రెడ్డి జనవరి 10, 1960 కొండసుంకేసుల గ్రామంలో జన్మించారు. తండ్రి ఎస్.కె. చెన్నారెడ్డి. 2009 ఎన్నికలలో నంద్యాల నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికై, మంత్రి పదవి చేపట్టారు. ❀



## శ్రీ అహ్మదుల్లా మహమ్మద్ సయ్యద్

*మైనార్టీ సంక్షేమం, ప్రాథమిక విద్య ఎస్ఎస్ఎ, గ్రంథాలయాలు*

**58** సంవత్సరాల శ్రీ అహ్మదుల్లా మహమ్మద్ సయ్యద్ జూన్ 15, 1951లో కడప జన్మించారు. తండ్రి హాజీ మహమ్మద్ రహమతుల్లా. 1977 వరకు యువజన కాంగ్రెస్‌లో పనిచేశారు. 1992 నుండి 1997 వరకు వక్ఫ్ బోర్డు అధ్యక్షుడిగా, 1997లో ఉపాధ్యక్షుడిగా, 1999 నుండి 2000 వరకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, 2000 సంవత్సరంలో మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2004లో కడప నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైనారు. 2004లో కడప శాసనసభ్యులుగా ఎన్నికై, మంత్రిపదవి చేపట్టారు. ❀



## శ్రీ జూపల్లి కృష్ణారావు

*ఆహారం, పౌర సరఫరాలు, లీగల్, మెట్రలజీ, వినియోగదారుల వ్యవహారాలు*

**54** సంవత్సరాల శ్రీ జూపల్లి కృష్ణారావు 1955 ఆగస్టు 10న మహబూబ్‌నగర్ జిల్లాలోని పెద్దదగడ గ్రామంలో జన్మించారు. తండ్రి శ్రీ జి. శేషగిరి రావు. 2009 ఎన్నికలలో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా ఎన్నికై, మంత్రి పదవి చేపట్టారు.

**38** సంవత్సరాల శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు 31, మే 1971 కాటారం మండలం, దన్‌వాడలో శ్రీ శ్రీపాదరావు, శ్రీమతి జయశ్రీ దంపతులకు జన్మించారు. ఎం.ఏ, ఎల్.ఎల్.బి., కంప్యూటర్ డిప్లమా చేశారు. 1999లో డిసిసి, ఏఐసిసి సభ్యులుగా, రెండుసార్లు డిసిసి అధ్యక్షులుగా పనిచేశారు. 2009లో మంథని శాసనసభ్యునిగా ఎన్నికై, ఉన్నత విద్యా శాఖ మంత్రి పదవి చేపట్టారు.



## శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

*ఉన్నత విద్య*

**49** సంవత్సరాల శ్రీమతి డి.కె. అరుణ 1960 మే 4న నారాయణపేటలో జన్మించారు. ఇంటర్ వరకూ చదివారు. భర్త శ్రీ డి.కె. భరత్ సింహారెడ్డి. శాసనసభకు రెండవసారి గద్వాల నుంచి ఎన్నికైనారు. మంత్రి పదవిని చేపట్టారు.



## శ్రీమతి డి.కె. అరుణ

*చిన్నతరహా పరిశ్రమలు, చక్కెర ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు*



## శ్రీమతి కొండా సురేఖ

*మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం వికలాంగుల సంక్షేమం జువనైల్ వెల్ఫేర్*

**44** సంవత్సరాల శ్రీమతి కొండా సురేఖ 19, ఆగస్టు 1965న జన్మించారు. బి.కాం. చదివారు. పిసిసి సభ్యురాలుగా పనిచేశారు. 1999 శాయంపేట శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. సిఎల్పీ కోశాధికారిగా, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలిగా, ఏఐసిసి సభ్యురాలిగా, పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటి సభ్యురాలిగా పనిచేశారు. 2004లో శాయంపేట శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. 2009లో పరకాల శాసనసభ్యురాలిగా ఎన్నికై, మంత్రిపదవి చేపట్టారు.



## శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి

*ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, యువజన సర్వీసులు, క్రీడలు*

**46** సంవత్సరాల శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 1963, మే 23న నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లెంలలో శ్రీ పాపిరెడ్డి, శ్రీమతి సుశీలమ్మ దంపతులకు జన్మించారు. బి.టెక్. చేశారు. యూనివర్సిటీలో ఎన్.ఎస్.యు.ఐ విద్యార్థి విభాగంలో పనిచేశారు. 1994లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1999, 2004లలో నల్గొండ శాసనసభ్యునిగా ఎన్నికైనారు. 2009లో కూడా నల్గొండ శాసనసభ్యుడిగా ఎన్నికై మంత్రిపదవి చేపట్టారు.

**49** సంవత్సరాల శ్రీమతి వాకిటి సునీతారెడ్డి 5, ఏప్రిల్ 1968న మెదక్‌జిల్లా గోమారం గ్రామంలో జన్మించారు. భర్త శ్రీ వాకిటి లక్ష్మారెడ్డి. బి.ఎస్సీ చదివారు. 1999, 2004లలో నర్సాపూర్ శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. 2009లో కూడా నర్సాపూర్ శాసనసభ్యురాలిగా ఎన్నికై, మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రిగా పదవి చేపట్టారు.



## శ్రీమతి వి. సునీతారెడ్డి

*మైనర్ ఇరిగేషన్*

# ఉపాధి కూలీలకు ఇక కనీస వేతనం రోజుకి రూ. 100



**'ఉపాధి' కూలీలకు కనీస వేతనం రోజుకు రూ. 100 చెల్లించడం, వెట్టి నుంచి కూలీలకు విముక్తి కల్పించడం, పలు ఐటీడీఏల్లోని చెంచు కుటుంబాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి కీలక నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లపై గ్రామీణాభి వృద్ధి శాఖ మంత్రి శ్రీ వట్టి వసంతకుమార్ తొలి సంతకాలు చేశారు. మే 21 నుంచే ఉపాధి వేతనం పెంపుదల వర్తిస్తోందన్నారు.**

**రాష్ట్రంలో బడా కాంట్రాక్టర్లు, గుత్తేదార్ల కబంధ హస్తాలలో వెట్టిలో మగ్గుతోన్న పాలమూరు కార్మికులకు విముక్తి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో మహబూబ్‌నగర్ కూలీలకు మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంవత్సరానికి 100 రోజుల పని దినాలు కల్పించాలనే నిబంధనను సడలించి సంవత్సరమంతా జీవనోపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ వట్టి వసంత్ కుమార్ తెలిపారు. కూలీ రేటును రూ.80 నుండి రూ. 125 కు పెంచాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. కేంద్రం నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని, దాంతో కేంద్రం నిర్ణయం కోసం వేచి చూడకుండా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే కూలీని 80 నుంచి 100 రూపాయలకు పెంచేందుకు నిర్ణయించిందన్నారు.

రాష్ట్రంలోని అన్ని షెడ్యూల్డు కులాలు, తెగల కాలనీలకు రహదారి సౌకర్యం కల్పించడం అత్యంత ప్రాధాన్యత అంశంగా అమలు జరప సంకల్పించామని మే 28న పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి తెలిపారు.

పాలమూరు కార్మికులుగా పేరుపొందిన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నిరక్షరాస్య కూలీలు తమ అవసరాల కోసం పదివేలు, ఇరవై వేల రూపాయలు రుణంగా గుత్తేదార్లు, కాంట్రాక్టర్ల వద్ద తీసుకుంటున్నారని, ఈ కూలీలను గుత్తేదార్లు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు తీసుకెళ్ళి పని చేయిస్తున్నారని శ్రీ వసంతకుమార్ వివరించారు.

వెట్టినుంచి కార్మికులను విముక్తి చేసేందుకు సంబంధించిన ఉత్తర్వుల పైనే ఆయన తన తొలి సంతకం చేశారు. గుత్తేదార్లు, కాంట్రాక్టర్లు ఇచ్చే రుణాలను నుంచి కూలీలు విముక్తి కావడం లేదని, జీవితాంతం కాంట్రాక్టర్ల

వద్దే రోజూ 40-45 రూపాయల కూలికే పని చేస్తున్నారన్నారు. దాంతో వారి రుణాలు జీవిత కాలంలో తీరడం లేదన్నారు. ఈ తరహా వెట్టి కార్మికులను గుర్తించి కాంట్రాక్టర్ల కబంధ హస్తాల నుంచి విముక్తి చేస్తామని, వారి రుణాలను తీర్చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రుణ విముక్తి తర్వాత పాలమూరు కార్మికులందరికీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని కల్పిస్తామన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఇజిపి) కింద ఇప్పటి వరకు రోజు 80 రూపాయల వేతనం ఇస్తున్నారని, దీన్ని 125 రూపాయల వరకూ పెంచాలంటూ కేంద్రాన్ని కోరామని మంత్రి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలను ప్రధానమైన గ్రామాలతో కలుపుతూ ఎన్ఆర్ఇజిపి కింద రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం కేంద్రం అనుమతి ఇచ్చిందని, కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మూడేళ్లలో అమలు చేస్తామన్నారు. ఈ పథకం కింద 2009-10 సంవత్సరానికి ఐదువేల కోట్ల రూపాయలు మంజూరు కాగా, ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయలు విడుదల చేశామన్నారు.




రాష్ట్రంలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు మంజూరు చేస్తున్నామని, ఈ అంశంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రజాప్రతినిధులంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి కోరారు. అర్హులైన వారికి పింఛన్లు అందకపోతే కొత్తగా మంజూరు చేస్తామని, ఈ మేరకు ప్రజా ప్రతినిధులకు లేఖ రాశామన్నారు. మైక్రో ఇరిగేషన్ పథకం కింద నూటికి నూరు శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు ఇస్తున్నామన్నారు. ఎన్నికల ముందు 'కోడ్' కారణంగా నిలిచిపోయిన 'అభయహస్తం' (మహిళలకు పింఛన్ పథకం) అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

చెంచులకు వారానికి రూ. 250లు లభించే విధంగా పని కల్పించే హామీ జీవోపై కూడా ఆయన మలి సంతకం చేసి, తమ ప్రభుత్వం పనిచేసే ప్రభుత్వమన్న నినాదానికి ఆదర్శంగా నిలిచారు. ఆ వెంటనే సచివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ విషయాలను వెల్లడించారు. శుభాశీస్సులందించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అభిమానులు అత్యధిక సంఖ్యలో వచ్చి ఆయనను అభినందించారు.

మంచిర్యాలలో జరిగిన ఘటన నేపథ్యంలో పాలమూరు కూలీలు ఎక్కువ సంఖ్యలో వలసలు వెళ్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకుంటున్నదని

## 'డ్వాక్రా గ్రూపులతో ధాన్యం కొనుగోళ్లు'

డ్వాక్రా గ్రూపుల ద్వారా రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవాలయానికి వచ్చిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. కొన్ని జిల్లాల్లో మిల్లర్లు ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై అధికారులతో చర్చించి ఇందిరా క్రాంతి పథం ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 5 మండలాల్లో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మరో రెండు రోజుల్లో 15 సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకూ రూ. 4.50 కోట్ల విలువైన మొక్కజొన్న కొనుగోలు చేశామని, రేటు 840 రూపాయలు చెల్లించామన్నారు.

మంత్రి వివరించారు. పాలమూరు వలస కూలీల జీవనవిధానం పైన పూర్తి స్థాయిలో అధికారులు విచారణ జరిపారని, ఎక్కువ శాతం కూలీలు మేస్త్రీల దగ్గర అతితక్కువ కూలీ రూ. 40లకు పనిచేస్తున్నారని, అంతేకాక మేస్త్రీల దగ్గర వేల రూపాయలు వడ్డీలకు తీసుకుంటున్నారని, దీనితో వారి బతుకులు అక్కడే గడిచిపోతున్నాయని ఆయన చెప్పారు.

ఈ ప్రైవేట్ రుణాలను అధ్యయనం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామని, ఈ ప్రైవేటు రుణాలను తీర్చే పద్ధతిని కూడా ప్రభుత్వం ఆలోచిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా వారి వలసలు నివారించేందుకు కూలీలకు ఎక్కువ రోజులు తమ నివాస ప్రాంతంలోనే పని లభించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఉపాధి హామీ పథకం నిబంధనలను మినహాయించి ఈ కూలీలకు నూరు రోజుల కన్నా ఎక్కువ రోజులు పనులు లభించే విధంగా కార్యాచరణను రూపొందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఉపాధి హామీలో వారికి ఖచ్చితంగా జీవనోపాధి కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కర్నూలు, మహబూబ్‌నగర్, నల్లగొండ, గుంటూరులలోని చెంచులకు ఇదే పథకంలో వారానికి రూ.250 లభించే విధంగా జీవో జారీ చేసినట్లు మంత్రి చెప్పారు. ఈ ఏడాది గ్రామీణ ఉపాధి పథకంలో రూ.4వేల కోట్ల వరకు వెచ్చిస్తామని ఆయన అన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు తుంపర, బిందుసేద్యం పథకంలో 3 లక్షల ఎకరాలలో తోటల పెంపకానికి నిధులు ఇచ్చామని ఆయన చెప్పారు. 'అభయహస్తం' పథకం పై విస్తృతంగా అధ్యయనాలు జరుగుతున్నాయని, 60 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ రూ.500ల పెన్షన్ వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు.

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు భాగస్వామ్యం కావాలని కోరారు.

*- టి. ఎన్.*

**చాలాకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న 'పంచాయితీలకు అధికారాల బదిలీ' అంశంపై త్వరలో సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖా మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీ బొత్స సత్యనారాయణ తెలిపారు.**

**మే 26వ తేదీన పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన సచివాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందినప్పడే గ్రామస్వరాజ్యం సిద్ధిస్తుందని, పంచాయితీరాజ్ వ్యవస్థపై ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డికి నిర్దిష్టమైన ఆలోచనలున్నాయని, వాటికనుగుణంగా తాను పనిచేస్తానని మంత్రి చెప్పారు. పంచాయితీరాజ్ శాఖ ద్వారా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం తనకు దొరికిందని ఆయన అన్నారు.**

# స్థానిక సంస్థలకు అధికారాల బదిలీపై త్వరలో నిర్ణయం




పంచాయితీ సర్పంచ్‌లు, ప్రభుత్వం మధ్యన వారధిగా పనిచేయటం ద్వారా, పంచాయితీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని, తన హయాంలో పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

గ్రామ స్వరాజ్యానికి బాపూజీ కన్నకలలు వై.యస్. నేతృత్వంలో నిజమవుతాయని, గ్రామ సర్పంచ్ నుంచి ప్రభుత్వాధినేత ముఖ్యమంత్రి వరకు నిజమైన వారధిగా ఉంటూ, మౌలిక వసతుల కల్పనకు, గ్రామీణ ప్రజల సాధికారతకు, సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని మంత్రి పునరుద్ఘాటించారు.

డాక్టర్ వై. యస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో అసాధ్యాన్ని సుసాధ్యం చేసి, గ్రామ స్వరాజ్యాన్ని సాధించి చూపుతామని ఆయన చెప్పారు. ఇది వరకు తనకు అప్పగించిన గృహనిర్మాణ శాఖ మంత్రి పదవిని బాధ్యతగా నిర్వర్తించానని, ప్రతి మంగళవారం ఆయా జిల్లాల గృహనిర్మాణ సంస్థల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించే వాడినని మంత్రి చెప్పారు. ఇకముందు కూడా ప్రభుత్వంలో ఒకరిగా లక్ష్యసాధన దిశగా రాష్ట్రాభ్యున్నతికి పాటుపడతానని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం రావాలంటే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలని, ఈ దిశలో తమ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి చెప్పారు. ఇప్పటికే పలు అంశాలను స్థానిక సంస్థలకు అప్పగించటం జరిగిందని, మిగిలిన వాటి విషయాలలో అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి ప్రజలకు ఉపయోగపడే మిగిలిన అంశాల పై తగిన నిర్ణయం తీసుకుంటామని, స్థానిక సంస్థలకు అధికారాలతో పాటు, స్వయం ప్రతిపత్తి

**పంచాయితీరాజ్ శాఖా మంత్రి**
**శ్రీ బొత్స సత్యనారాయణ**

కల్పించటంలో కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

స్థానిక సంస్థలకు అధికారులు, విధులు బదలాయింపునకు సంబంధించిన అంశాలను మూడునెలల్లో తేలుస్తామని, పంచాయితీరాజ్ చట్టంలోని రాజ్యాంగ సవరణలకు అనుగుణంగా స్థానికసంస్థలకు వీలైనన్ని అధికారాలు కల్పిస్తామని, సాధ్యం కాకపోతే, ఆ అంశాల ను కూడా మూడు నెలల్లో ప్రజలకు వివరిస్తామని, అంతా పారదర్శకంగా చేస్తామని శ్రీ బొత్స చెప్పారు. జనాభాలో 70 శాతం నివశించే గ్రామసీమలకు సంబంధించిన పంచాయితీరాజ్ శాఖను ముఖ్యమంత్రి తనకు అప్పగించటం చాలా ఆనందం కలిగించిందని, పల్లెపల్లెలో మౌలిక సదుపాయాల కల్పనే తన



ప్రధాన కర్తవ్యమని, పంచాయితీరాజ్ సిబ్బంది అపరిష్కృత సమస్యలపై ఉద్యోగ సంఘాలతో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఇప్పటికే ఇందిరమ్మ గ్రామాల పేరుతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని, గ్రామాల్లో త్రాగునీరు, అంతర్గత లింక్‌రోడ్లు, డ్రైనేజీ తదితరమైన సదుపాయాలకు ప్రాధాన్యతనిస్తున్నామని, రానున్న ఐదేళ్లలో మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో సమకూర్చుతామని మంత్రి తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 1.87 లక్షల కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు ఉండగా, ఇందులో 67 శాతం మట్టిరోడ్లు ఉన్నాయని ఆయన వివరించారు. గత ఐదేళ్ల కాలంలో 27,698 కిలోమీటర్ల మేరకు తారురోడ్ల నిర్మాణాలు జరిగాయని, మిగతావి మట్టిరోడ్లుగా మిగిలిపోయి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ప్రతి గామాన్ని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతామని, పంచాయితీల ఆధీనంలో ఉన్న రోడ్లన్నింటిని బాగుచేస్తామని ఆయన వివరించారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాలకు, స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎక్కువ నిధులు ఖర్చు చేయాలని నిర్ణయించామని, అవసరాలను బట్టి గ్రామీణాభివృద్ధి శాఖ నిధులను, కేంద్రం నుంచి అదనపు నిధులను రాబడతామని ఆయన చెప్పారు.

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం, 29 అంశాలను పంచాయితీలకు బదిలీ చేయాల్సి ఉంటుందని, ఈ అంశంపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని, అధికారులతో సమీక్షించి త్వరలో తుదినిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు అధికారాల బదిలీకి సంబంధించి జారీ అయిన జీవోలను పరిశీలిస్తామని, వాటిని సమర్ధవంతంగా అమలుచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తుల సమావేశాల్లో ఎం.పి.లు, ఎం.ఎల్.ఎ.లు, ఎం.ఎల్.సి.లు పాల్గొనటంలో తప్పులేదని, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, వాటిని పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందని మంత్రి వ్యాఖ్యానించారు. "నా శాఖలో నా మార్కు చూపుతా" అని ఉత్సాహంగా ఆయన వ్యాఖ్యానించారు.

## "ఏ సమస్య వచ్చినా నేరుగా ఫోన్ చేయండి"

"గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా నేరుగా 9866661285 నెంబరుకు ఫోన్ చేయండి. పి.ఎలు, పి.ఎస్.లు ఉండరు. నేనే ఫోన్ ఎత్తుతా. తక్షణం స్పందిస్తా. సర్పంచ్ నుంచి జడ్.పి. ఛైర్మన్, ఎవరైనా సరే తనతో సెల్‌ఫోన్‌లో మాట్లాడవచ్చని, అందుకోసం 24 గంటలూ అందుబాటులో ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. పంచాయితీరాజ్ శాఖను తనే నిర్వహించాలన్న స్థాయికి చేరుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రస్తుతం సాధించిన అభివృద్ధే తమను మరోసారి గెలిపించిందని, రానున్న ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలు వై.యస్. పాలన మళ్లీ మళ్లీ కావాలని కోరుకునే విధంగా చేస్తామని మంత్రి వ్యాఖ్యానించారు.

*– టి. నర్మద*



# లోక్‌సభ స్థానాల్లో . . .



రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాలకు రెండు విడతలుగా జరిగిన సాధారణ ఎన్నికలలో మొత్తం 569 మంది అభ్యర్థులు పోటీ చేయగా, కాంగ్రెస్ పార్టీ 33 స్థానాలను దక్కించుకుంది.

తెలుగుదేశం ఆరు స్థానాలలోను, ఎంఐఎం ఒక స్థానంలోను, టి.ఆర్.ఎస్ రెండు స్థానాల్లోను విజయం సాధించాయి. రాష్ట్రం నుంచి లోక్‌సభకు అయిదుగురు మహిళలు సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరు శ్రీమతి పురందేశ్వరి (విశాఖ), శ్రీమతి పనబాక లక్ష్మి (బాపట్ల), శ్రీమతి బొత్స ఝాన్సీ (విజయనగరం), శ్రీమతి కిల్లి కృపారాణి (శ్రీకాకుళం), శ్రీమతి విజయశాంతి (మెదక్) ఉన్నారు.

### 1. ఆదిలాబాద్ (ఎస్టీ)


**రమేష్ రాథోడ్**
పార్టీ : టి.డి.పి.
మెజార్టీ : 1,15,087
సమీప ప్రత్యర్థి :
కె రమేష్ (కాంగ్రెస్)

### 2. పెద్దపల్లి (ఎస్సీ)


**డా॥ జి. వివేకానంద్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 49,017
సమీప ప్రత్యర్థి :
జి. శ్రీనివాస్ (టి.ఆర్.ఎస్.)

### 3. కరీంనగర్


**పొన్నం ప్రభాకర్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 50,243
సమీప ప్రత్యర్థి :
బి. వినోద్‌కుమార్ (టి.ఆర్.ఎస్.)

### 4. నిజామాబాద్


**మధుయాష్కి గౌడ్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 60,390
సమీప ప్రత్యర్థి :
పి. గణేష్ గుప్త (టి.ఆర్.ఎస్.)

### 5. జహీరాబాద్


**సురేష్ షెట్కార్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 17,407
సమీప ప్రత్యర్థి :
సయ్యద్ యూసుఫ్ అలీ (టి.ఆర్.ఎస్.)

### 6. మెదక్


**ఎం. విజయశాంతి**
పార్టీ : టి.ఆర్.ఎస్.
మెజార్టీ : 6,077
సమీప ప్రత్యర్థి :
చాగళ్ళ నరేంద్రనాథ్ (కాంగ్రెస్)

### 7. మల్కాజిగిరి


**సర్వే సత్యనారాయణ**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 93,326
సమీప ప్రత్యర్థి :
టి. భీంసేన్ (టి.డి.పి.)

### 8. సికింద్రాబాద్


**యం.అంజన్‌కుమార్ యాదవ్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 1,70,167
సమీప ప్రత్యర్థి :
బండారు దత్తాత్రేయ (బి.జె.పి.)

### 9. హైదరాబాద్


**అసదుద్దీన్ ఓవైసి**
పార్టీ : ఎం.ఐ.ఎం.
మెజార్టీ : 1,13,865
సమీప ప్రత్యర్థి :
జహీద్ అలీఖాన్ (టి.డి.పి.)

### 10. చేవెళ్ళ


**ఎస్. జైపాల్ రెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 18,532
సమీప ప్రత్యర్థి :
ఎ.పి. జితేందర్ రెడ్డి (టి.డి.పి.)

### 11. మహబూబ్‌నగర్


**కె.చంద్రశేఖర్‌రావు**
పార్టీ : టి.ఆర్.ఎస్.
మెజార్టీ : 20,184
సమీప ప్రత్యర్థి :
విఠల్ రావు (కాంగ్రెస్)

### 12. నాగర్ కర్నూలు (ఎస్సీ)


**మంద జగన్నాథరావు**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 47,767
సమీప ప్రత్యర్థి :
గువ్వల బాలరాజు (టి.ఆర్.ఎస్.)

### 13. నల్గొండ


**గుత్తా సుఖేందర్‌రెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 1,52,982
సమీప ప్రత్యర్థి :
సురవరం సుధాకర్‌రెడ్డి (సి.పి.ఐ.)

### 14. భువనగిరి


**కె. రాజగోపాల్‌రెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 1,39,888
సమీప ప్రత్యర్థి :
నోముల నర్సింహయ్య (సి.పి.ఎం.)

### 15. వరంగల్ (ఎస్సీ)


**సిరిసిల్ల రాజయ్య**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 1,24,661
సమీప ప్రత్యర్థి :
ఆర్. పరమేశ్వర్ (టి.ఆర్.ఎస్)

**16. మహబూబాబాద్ (ఎస్టీ)**



**పి. బలరాం**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 68,957
సమీప ప్రత్యర్థి :
కె. శ్రీనివాసరావు (సి.పి.ఐ)

**17. ఖమ్మం**



**నామా నాగేశ్వరరావు**
పార్టీ : టి.డి.పి.
మెజార్టీ : 1,24,448
సమీప ప్రత్యర్థి :
రేణుకా చౌదరి (కాంగ్రెస్)

**18. అరకు (ఎస్టీ)**



**కిశోర్‌చంద్ర సూర్యనారాయణ దేవ్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 1,92,444
సమీప ప్రత్యర్థి :
యం. బాబూరావు (సి.పి.యం.)

**19. శ్రీకాకుళం**



**డా॥ కిల్లి కృపారాణి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 82,987
సమీప ప్రత్యర్థి :
కె. ఎర్రంనాయుడు (టి.డి.పి..)

**20. విజయనగరం**



**బొత్స ఝాన్సీ**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 60,571
సమీప ప్రత్యర్థి :
కె. అప్పల్‌నాయుడు (టి.డి.పి.)

**21. విశాఖపట్నం**



**డి. పురంధేశ్వరి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 66,686
సమీప ప్రత్యర్థి :
పి. శ్రీనివాసరావు (పి.ఆర్.పి.)

**22. అనకాపల్లి**



**సబ్బం హరి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 52,912
సమీప ప్రత్యర్థి :
సూర్యప్రకాశరావు (టి.డి.పి.)

**23. కాకినాడ**



**ఎం.ఎం. పల్లంరాజు**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 34,044
సమీప ప్రత్యర్థి :
చలమలశెట్టి సునీల్ (పి.ఆర్.పి.)

**24. అమలాపురం (ఎస్సీ)**



**జి.వి. హర్షకుమార్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 40,005
సమీప ప్రత్యర్థి :
పి. ప్రమీలాదేవి (పి.ఆర్.పి.)

**25. రాజమండ్రి**



**ఉండవల్లి అరుణ్‌కుమార్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 2,147
సమీప ప్రత్యర్థి :
ఎం. మురళీమోహన్ (టి.డి.పి.)

**26. నర్సాపురం**



**కనుమూరి బాపిరాజు**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 1,14,690
సమీప ప్రత్యర్థి :
తోట సీతారామలక్ష్మి (టి.డి.పి.)

**27. ఏలూరు**



**కావూరు సాంబశివరావు**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 42,783
సమీప ప్రత్యర్థి :
మాగంటి బాబు (టి.డి.పి.)

**28. మచిలీపట్నం**



**కొనకళ్ల నారాయణ**
పార్టీ : టి.డి.పి.
మెజార్టీ : 12,456
సమీప ప్రత్యర్థి :
బాడిగ రామకృష్ణ (కాంగ్రెస్)

**29. విజయవాడ**



**లగడపాటి రాజగోపాల్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 12,712
సమీప ప్రత్యర్థి :
వి. వంశీమోహన్ (టి.డి.పి.)

**30. గుంటూరు**



**రాయపాటి సాంబశివరావు**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 39,355
సమీప ప్రత్యర్థి :
మాదల రాజేంద్ర (టి.డి.పి.)

**31.నర్సరావుపేట**



**ఎం. వేణుగోపాల్‌రెడ్డి**
పార్టీ : టి.డి.పి.
మెజార్టీ : 1,607
సమీప ప్రత్యర్థి :
వల్లభనేని బాలశౌరి (కాంగ్రెస్)

**32. బాపట్ల (ఎస్సీ)**



**పనబాక లక్ష్మి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 69,338
సమీప ప్రత్యర్థి :
మాల్యాద్రి శ్రీరాం (టి.డి.పి.)

**33. ఒంగోలు**



**మాగుంట శ్రీనివాసులురెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 78,523
సమీప ప్రత్యర్థి :
ఎం. మాలకొండయ్య యాదవ్ (టి.డి.పి.)

**34. నంద్యాల**



**ఎస్.పి.వై. రెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 90,847
సమీప ప్రత్యర్థి :
ఫరూక్ (టి.డి.పి.)

**35. కర్నూలు**



**కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 73,773
సమీప ప్రత్యర్థి :
బి.టి. నాయుడు (టి.డి.పి.)

### 36. అనంతపురం



**అనంత వెంకట్రామిరెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 77,921
సమీప ప్రత్యర్థి :
కాలవ శ్రీనివాసులు (టి.డి.పి.)

### 37. హిందూపురం



**నిమ్మల కిష్టప్ప**
పార్టీ : టి.డి.పి.
మెజార్టీ : 22,835
సమీప ప్రత్యర్థి :
పి. కాశింఖాన్ (కాంగ్రెస్)

### 38. కడప



**వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 1,75,751
సమీప ప్రత్యర్థి :
పి.శ్రీకాంత్‌రెడ్డి (టి.డి.పి.)

### 39. నెల్లూరు



**మేకపాటి రాజమోహన్‌రెడ్డి**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 54,993
సమీప ప్రత్యర్థి :
వి. వేణుగోపాల్‌రెడ్డి (టి.డి.పి.)

### 40. తిరుపతి (ఎస్సీ)



**చింతా మోహన్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 19,276
సమీప ప్రత్యర్థి :
వర్ల రామయ్య (టి.డి.పి.)

### 41. రాజంపేట



**ఎ. సాయిప్రతాప్**
పార్టీ : కాంగ్రెస్
మెజార్టీ : 1,10,377
సమీప ప్రత్యర్థి :
రమేష్‌కుమార్ రెడ్డి (టి.డి.పి.)

### 42. చిత్తూరు (ఎస్సీ)



**ఎన్. శివప్రసాద్**
పార్టీ : టి.డి.పి.
మెజార్టీ : 10,813
సమీప ప్రత్యర్థి :
ఎం. తిప్పేస్వామి (కాంగ్రెస్)

సేకరణ : ఆర్.కె.

## కేంద్రప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ మంత్రులు



**శ్రీ ఎస్. జైపాల్ రెడ్డి**
*పట్టణాభివృద్ధి శాఖ*
*(కేబినెట్ హోదా)*



**శ్రీమతి పనబాక లక్ష్మి**
*జౌళి శాఖ*
*(సహాయ మంత్రి)*

**శ్రీ జైరామ్ రమేష్**
*పర్యావరణం - అడవుల శాఖ*
*(సహాయ మంత్రి - స్వతంత్ర హోదా)*



**శ్రీ ఎం.ఎం. పళ్లంరాజు**
*రక్షణ శాఖ*
*(సహాయ మంత్రి)*





**శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి**
*మానవ వనరుల అభివృద్ధి శాఖ*
*(సహాయ మంత్రి)*



**శ్రీ ఎ. సాయి ప్రతాప్**
*ఉక్కు శాఖ*
*(సహాయ మంత్రి)*




# లక్షా అరవై వేల గళాల అన్నమయ్య సుస్వరార్చన

***తొ**లి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్యకు తెలుగుజాతి అద్భుత నీరాజనం పట్టింది. దేశవిదేశాల్లోని 16 కోట్ల మంది తెలుగు ప్రజలు పరవశించే మహత్తర ఘట్టం రాష్ట్ర రాజధానిలో చోటుచేసుకున్నది. తెలుగుపదానికి అరుదైన పురస్కారం లభించింది. ఒకేసారి లక్షా 60 వేలగళాలు అన్నమయ్య గీతాలను ఆలపించాయి. దీంతో బృందగాన విభాగంలో 72 ఏళ్ల క్రితం పోలెండ్‌లో 60 వేల మందితో సృష్టించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు బద్దలైంది.*

## అల్లదిగో శ్రీహరివాసము



"అదివో అల్లదివో శ్రీవారి వాసము...పదివేల శేషుల పడగల మయమూ..." అంటూ గానగంధర్వుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ గళం నుంచి జాలువారిన గీతంతో పులకరించిన భక్తజనానికి పరేడ్ గ్రౌండ్స్ ప్రాంగణం హరివాసమే అయి కనువిందు చేసింది. అప్పట్లో పరమభక్తుడు అన్నమయ్య శ్రీహరిని ఎలా ఊహించుకొని కీర్తించాడో... అదే భావన ప్రేక్షకులకు కలిగేలా స్వరార్చన నిర్వాహకులు వేదికను సిద్ధంచేశారు. వైకుంఠ ద్వారాలను తలపించేలా స్వర్ణకాంతులు వెదజల్లే అలంకరణను ఏర్పాటు చేశారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో వేదికను కనులవిందుగా తీర్చిదిద్దారు.

తిరుపతిలో కొలువైన వెంకటేశ్వరుని భక్తజనులు ఇక్కడి నుంచే ప్రత్యక్షంగా తిలకించిన అనుభూతి పొందారు. శ్రీనివాసుడి విగ్రహం చేయి భాగం నుంచి ప్రేక్షకులకి లేజర్ కిరణాలు ప్రసరించేలా ఏర్పాటు చేయడంతో ఆ దేవదేవుడి ఆశీర్వచనాలు పొందినట్లుగా భక్తులు పరవశించిపోయారు. మైదానమంతటా వినిపించే విధంగా అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో సౌండ్‌సిస్టమ్‌లను ఏర్పాటు చేశారు. వేదికకు రెండు వైపులా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ★

లక్షల మంది భక్తజనం ఒకేచోట చేరి ఆలపించిన సంకీర్తనలకు 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో చోటు లభించింది. తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల 601వ జయంతి సందర్భంగా సిలికానాంధ్ర, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, టిటిడి సంయుక్తంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మే 10వ తేదీ రాత్రి నిర్వహించిన కార్యక్రమం లక్షగళ సంకీర్తనార్చనకు వేదికైంది.

దాదాపు రెండు లక్షల మంది హాజరైన ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు శ్రీ బాలకృష్ణ ప్రసాద్ గళ సారథ్యంలో 1.60 లక్షల మంది ముక్తకంఠంతో అన్నమాచార్య కీర్తనలను ఆలపించారు.

సిలికానాంధ్ర అధ్యక్షుడు శ్రీ కూచిబొట్ల ఆనంద్ ఈ సంకీర్తనార్చనకు ప్రాణం పోశారు. గిన్నిస్ పుస్తకంలో 72 ఏళ్ల క్రితం నమోదైన రికార్డును తాజాగా నిర్వహించిన సంకీర్తనలు అధిగమించాయి. 1937 ఆగస్టు 2న పోలెండ్ (అప్పటి జర్మనీలో భాగం) వాసులు 60వేల మంది ముక్తకంఠంతో తమ జాతీయ గీతాన్ని ఆలపించి గిన్నిస్‌లో స్థానం సంపాదించారు.

### ఏడు సంకీర్తనలు

కార్యక్రమానికి హాజరైన 1.60 లక్షల మంది భక్తులు గంట వ్యవధిలో ఏడు సంకీర్తనలు ఆలపించారు. భావములోన... బ్రహ్మకడిగిన పాదము... ఎంతమాత్రమున... పొడగంటిమయ్యా... కొండలలో నెలకొన్న... నారాయణతే నమోనమో... ముద్దుగారే యశోద కీర్తనలతో నడుమ గోవిందనామ సంకీర్తనలతో పరేడ్ గ్రౌండ్స్ మార్మోగిపోయింది. ఒక్కసారిగా గళం విప్పిన భక్తజనంతో భాగ్యనగరం ఆధ్యాత్మికతతో పులకించింది.



### నిర్వాహకులకు ముఖ్యమంత్రి అభినందన

అన్నమయ్య జయంత్యుత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన లక్షగళ సంకీర్తనార్చన గిన్నిస్ పుస్తకంలో నమోదు కావడం రాష్ట్రానికే గర్వకారణమని ముఖ్యమంత్రి డాక్టర్ వై. యస్. రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్ఫూర్తిదాయకమైన ఈ కార్యక్రమ నిర్వాహకులను ఆయన అభినందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

### అద్భుతం, అమోఘం

లక్షగళార్చన కార్యక్రమం అద్భుతం, అమోఘం అని ఆర్థికమంత్రి శ్రీ కె. రోశయ్య అన్నారు. లక్షన్నరకు పైగా సంగీతాభిమానుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసిన శ్రీ కె.రోశయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రాలేక తనను ఈ కార్యక్రమానికి హాజరుకమ్మని చెప్పారని, చిన్నవాడైనా శ్రీ కూచిభట్ల ఆనంద్ ఆలోచన అద్భుతమైనదని అన్నారు. నేటితరం బాణీలు కట్టని అన్నమయ్య కీర్తనలను మరిన్ని వెలుగులోకి తీసుకురావాలని శ్రీ రోశయ్య చెప్పారు.

600 ఏళ్ల క్రితం కడప జిల్లా తాళ్లపాకలో జన్మించిన అన్నమయ్య రికార్డు స్థాయిలో 32వేల పైచిలుకు కీర్తనలను రాశారని, అందులో 14 వేలు మాత్రమే ప్రచారంలో ఉన్నాయని అన్నారు. ఆయన రాసిన వాటిలో మనకు తెల్సినవి చాలా తక్కువేనని, ప్రతి అక్షరం ఆయన భక్త అర్చనకే ఉపయోగించారని అన్నారు.

అన్నమయ్య పేరిట ప్రాజెక్టును ఏర్పాటు చేశాక, ఆయన చరిత్ర ప్రపంచ ప్రజలకు తెలిసిందని అన్నారు. 1920 వరకూ అన్నమయ్య వెలుగు చూడలేదని, తన సర్వస్వాన్ని, స్వరాన్ని వెంకన్నకే అర్పించారని శ్రీ రోశయ్య అన్నారు. తెలుగువాడైన ఆనంద్ అమెరికాలో అన్నమయ్య కీర్తనలను పాడిస్తే అక్కడి వారు వింతగా చూశారని, అక్కడే ఆయన ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించే సమర్థుడైనా, తెలుగువారి మధ్య నిర్వహించడం గమనార్హమని అన్నారు.

అందరి తోడ్పాటుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిటిడి లక్ష సిడిలను పంచడం విశేషమని, ఈ కీర్తనల ద్వారా పాటకూ, తెలుగు భాషకూ గుర్తింపు వచ్చిందని అన్నారు. తెలుగుకు ప్రాచీన భాష హోదా కల్పిస్తూ కేంద్ర మంత్రివర్గం స్పష్టమైన ఆమోద ముద్ర వేసిందని, ఈ



# ఆనాటి ప్రజాకవి - నేడు విశ్వకవి



ఒక లక్షా అరవై వేల గళాలనుంచి, మండు వేసవిలో మలయమారుతంలా వ్యాపించిన అన్నమయ్య స్వరలహరిలో రాష్ట్ర రాజధాని స్నానమాడింది. పదకవిత పితామహుని పాటను తెలుగు ప్రజలు విశ్వవేదికపై నిలిపి పట్టాభిషేకం చేసిన ఆ సన్నివేశం అత్యంత మనోజ్ఞం! స్ఫూర్తిదాయకం! చరిత్రాత్మకం! మహోన్నతం !

అన్నమయ్య 601వ జయంతి ఉత్సవాన్ని లక్ష గళాల సుస్వరార్చనగా నిర్వహించాలనుకొన్న రాష్ట్ర సాంస్కృతికశాఖ, సిలికానాంధ్ర, తిరుమల తిరుపతి దేవస్థానం తాము సంయుక్తంగా తలపెట్టిన ఈ కార్యక్రమం ఇంతగా జయప్రదం అవుతుందని, 'జన'ప్రదంగా భాసిస్తుందని ఊహించి ఉండరు. లక్ష మందిని సమీకరించాలనుకోవడమే అత్యంత సాహసంగా భావించి ఉంటారు. కానీ, లక్షా అరవై వేల మంది విచ్చేశారు. కొండలపై నెలకొన్న కోనేటి రాయుని కీర్తించిన కవి అన్నమయ్యపై, ఆయన పాటపై గుండెల నిండా కొండంత భక్తినీ, అనురక్తినీ నింపుకొని ఎండల ప్రచండతను కూడా జయిస్తూ పరుగు పరుగున రాజధానికి తరలివచ్చారు. గళం కలిపారు. రాజధాని గగన వీధిని రాగరంజితం చేశారు.

ఇంతమంది ఒక్కచోట చేరి, ఒక్క హృదయమై కూడి, ఒక్క గొంతుగా మారి బృందగానాన్ని పండించిన ఘటన వేరొకటి ఇంతవరకు ప్రపంచ చరిత్రలో లేదు. ఎప్పుడో 1937, ఆగష్టు 2వ తేదీన జర్మనీలో 60 వేల మంది కలిసి నిర్వహించిన బృందగానమే ఇప్పటికి ప్రపంచ రికార్డుల సంపుటి గిన్నిస్‌బుక్‌లో చోటు చేసుకున్న విశేషం. అన్నమయ్య సుస్వరార్చన ఆ రికార్డును అధిగమించింది. గిన్నీస్‌బుక్ ప్రతినిధి సమక్షంలోనే ఈ అద్భుతం జరిగింది. ఆ విధంగా తెలుగు వారి అన్నమయ్య విశ్వవిఖ్యాతుడయ్యాడు. విశ్వకవి అయ్యాడు.

మన అన్నమయ్య పేరు గిన్నీస్‌లో స్థానం సంపాదించడం గర్వించదగినదే, ఘనమైనదే, సందేహంలేదు. దానిని మించి, చరిత్రకు తెలిసిన తమ తొలి వాగ్గేయకారునికి లక్షమందికి పైగా ఈ విధంగా స్వర నీరాజనం సమర్పించడం తెలుగు ప్రజల సాంస్కృతిక ప్రస్థానంలో ఒక సరికొత్త మలుపు అయితే అది మరింత విశేషం అవుతుంది. స్వస్థాన వేషభాషలపై అభిమాన, స్వాభిమానాల పునర్వికాసానికి ఒక ఆశావహ సంకేతం కాగలిగితే అది మరింత హర్షదాయకం అవుతుంది. ఈ మధ్యనే తెలుగుభాషకు ప్రాచీనతా ప్రతిపత్తిని పోరాడి సాధించుకోవడం ఈ సందర్భంలో స్మరించుకోవలసిన ముచ్చట. భాషా సాహిత్యాలే జాతిలో భావసమైక్యతకు సముద్దీపకాలు.

అన్నమయ్య కవితలు వెలుగు చూడడమే ఒక ఆశ్చర్యం! హఠాత్తుగా బయటపడిన అక్షర లక్షల విలువైన పద కవితా ఖజానా అన్నమయ్య 32 వేలకు పైగా సంకీర్తనలు రచించాడట. కానీ దొరుకుతున్నవి పదిహేనువేలే. తొలి తెలుగు పలుకుబడికి పట్టంకట్టిన ఆ పద కవితలు రాసి ఉన్న రాగిరేకులు తిరుమలేశుని సన్నిధిలో వందలాది సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడపడానికి ఎవరు బాధ్యులో తెలియదు. జనం నాలుకలపై నర్తించవలసిన ఆ పదాలు అలా నేల మాళిగలపాలు కావడంవల్ల తెలుగు కవిత ఎంత నష్టపోయిందో ఊహించడం కష్టం. అప్పటినుంచీ అవి ప్రచారంలో ఉండి ఉంటే తెలుగు కవిత ఎంత సుసంపన్నం అయ్యేదో!

పద కవితలను ఈసడించే కాలానికి ఎదురీదిన సాహసి అన్నమయ్య. కడప జిల్లా తాళ్ళపాకలో జన్మించిన అన్నమయ్య తన పాటల పరిమళం పంచుతూ తిరుమల తిరువీధులలో ఊరేగాడు. పదాల విరి సేవతో తిరుమలేశుని నిత్యం అర్చించుకొన్నాడు. శృంగారాన్నీ, భక్తినీ తన కీర్తనలలో సమధ్వనిలో పలికించాడు. దాదాపు ఆరు వందల ఏళ్ళ క్రితం అన్నమయ్య పలికించిన అచ్చ తెలుగు నుడికారం ఇప్పుడు పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మన తెలుగు ఇంత తీయనిదా అన్న సంభ్రమం ముంచెత్తుతుంది.

'సుదతి మోవి చిగుళ్ళు శోభన పత్రికలు' 'కలువ నారలే నీకు కంకణదారాలు', 'నిమ్మపంట వేసుకొంటూ, నిక్కినిక్కి చూసుకొంటూ, చెమట గందాల చెలరేగెవాడె', 'నిలువు చక్కదనాన నిండుకొని వాడె' అన్న అన్నమయ్య పంక్తులు ఏ ఆధునిక భావకవి, గేయకవి రాతలనో తలుపునకు తెచ్చేటంత ఆధునికంగా స్ఫురిస్తాయి, ధ్వనిస్తాయి. 'వేదములే శిలలై వెలసినదీ కొండ' అన్న అలనాటి అన్నమయ్య భావుకత్వపు గాఢతలో నేటి అత్యాధునిక కవిత్వ స్ఫురణ కలగడం ఎంత అబ్బురం! ప్రజల జీవద్భాషను ఎల్లెడలా గుప్పించిన అన్నమయ్య పండితకవి కాదు, ప్రజాకవి! లక్షన్నర గళాల సుస్వరార్చనతో తెలుగువారి ఆ ప్రజాకవి ఇప్పుడు విశ్వకవి. ★




# చక్కటి ప్రదర్శన: గిన్నిస్ ప్రతినిధి

**టి**టిడి, రాష్ట్ర ప్రభుత్వాలు చక్కటి ప్రదర్శన నిర్వహించాయని గిన్నిస్ పుస్తకం అధికార ప్రతినిధి శ్రీ రేమండ్ మార్షల్ చెప్పారు. లక్షల మంది ఉత్కంఠతో ఎదురు చూస్తుండగా... లక్షగళ సంకీర్తనార్చన కార్యక్రమం గిన్నిస్‌లో చోటు సాధించిందని ఆయన ప్రకటించారు. ఇది అరుదైన కార్యక్రమంగా గుర్తించామన్నారు. గిన్నిస్ ధ్రువీకరణ పత్రాన్ని ఆయన శ్రీ రోశయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సిలికానాంధ్ర ఛైర్మన్ శ్రీ కె. ఆనంద్, శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, టిటిడి ఈవో శ్రీ కె.వి. రమణాచారి, సినీ దర్శకుడు శ్రీ రాఘవేంద్రరావు, శ్రీ అక్కినేని నాగార్జున దంపతులు, రచయిత శ్రీ భారవి, మంత్రులు శ్రీమతి పనబాక లక్ష్మి, శ్రీ మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. ☆

శుభసమయంలో లక్షగళార్చన ప్రపంచదేశాల్లోనే అరుదైన దృశ్యమని అన్నారు. దైవం ఉందని, కార్యక్రమం విజయవంతం అవుతుందని తాను నమ్మానని ఆయన వ్యాఖ్యానించారు.

**పవిత్రతను పెంచుతాం: ఆదికేశవులు నాయుడు**

కనీవినీ ఎరుగని రీతిలో భక్త సందోహం రావటం, లక్షగళ సంకీర్తనార్చనలో పాల్గొనటం శ్రీ వెంకటేశ్వరస్వామి మహత్యమని టిటిడి ఛైర్మన్ శ్రీ ఆదికేశవుల నాయుడు చెప్పారు. తిరుమల పవిత్రతను పెంచేందుకు కృషి జరుగుతోందని కూడా ఆయన అన్నారు. లక్షగళార్చన జరిగిన రోజు చాలా పవిత్రమైనదని, తాళ్లపాకను దత్తత తీసుకుని, 108 అడుగుల అన్నమయ్య విగ్రహాన్ని స్థాపించి 3 రోజుల పాటు అతివైభవంగా ఉత్సవాలను జరిపిస్తోందని అన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కింద 30వేల సంకీర్తనల ప్రచారానికి పూనుకుంటామని చెప్పారు.

*– వై. సరోజ*




# గ్రామాల్లో మంచినీటి సరఫరాకి మెళకువలు

## పరిశుభ్రమైన నీటితో మంచి ఆరోగ్యం




**ఆరోగ్యవంతమైన జీవనానికి నీరు ఆధారం. కలుషితమైన నీరు తాగటం వలన గ్రామాలలో అనేక వ్యాధులు వస్తాయి. అతిసార, టైఫాయిడ్, రక్త విరోచనాలు, కాలేయపు వ్యాధులు (కామెర్లు), కలరా మొదలగునవి కలుషిత నీటి వలన కలిగే వ్యాధులు. కావున ఈ వ్యాధుల నుండి రక్షణకు పరిశుభ్రమైన నీటిని తాగాలి.**

సాధారణంగా గ్రామాలలో చెరువులు, బావులు చేతిపంపుల ద్వారా ప్రజలకు నీరు అందిస్తారు. కొన్ని గ్రామాలలో చెరువు నీటిని ఫిల్టర్ల ద్వారా శుభ్రపరచి, మరికొన్ని చోట్ల భూమిలోని నీటిని బోర్ల ద్వారా రక్షిత నీటిని ఎత్తైన ట్యాంకులకు (ఓ.హెచ్.ఎస్.ఆర్) ఎక్కించి కుళాయిల ద్వారా సరఫరా చేస్తారు. ఇలా వివిధ రీతులలో ప్రజలకు నీరు అందించే విషయాలలో గ్రామపంచాయతీ వారు వాటి నిర్వహణలో పాటించవలసిన కొన్ని సూచనలు క్రింద ఇవ్వటం జరిగింది.

## గ్రామ పంచాయతీలు పాటించవలసిన కొన్ని సూచనలు

### మంచినీటి చెరువుల విషయాలలో / తీసుకొనవలసిన జాగ్రత్తలు

గ్రామంలోని వారందరికి సుమారు 45 రోజులకు సరిపడ నీరు చెరువుయందు నిల్వఉంచుకొనే ఏర్పాటు చేస్తే, వేసవిలో మంచినీటి కాలువలు మూసివేసిన సమయంలో మంచినీటి ఇబ్బంది కలుగదు.

1. కాలువల నుండి నీటి బోదెల ద్వారా చెరువులలోనికి నీరు పట్టేటప్పుడు ఎటువంటి కల్మషాలు చెరువులోనికి చేరకుండా జాగ్రత్తపడాలి. అందుకు గాను నీటి బోదెలను శుభ్రం చేయుట, చెరువు ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లు సక్రమంగా పనిచేసే విధంగా ఉంచడం వగైరా చూసుకోవాలి.
2. మంచినీటి చెరువులు కాలువ నీటితో నింపటానికి ముందు పాతనీటిని తోడివేసి రెండురోజులు చెరువును ఎండనిచ్చి చెరువు అడుగుభాగం అంతా బ్లీచింగ్ పౌడర్ చల్లిన తరువాత నీరు పెట్టాలి.
3. చెరువులలో మంచినీరు తెచ్చుకొనే రేవులవద్ద బ్లీచింగ్ పౌడర్ సంచులలో వేసి కట్టాలి.
4. ప్రస్తుతం కాలువలలో నీరు సమృద్ధిగా లేనందున చెరువులలో ఉన్న నీటిని పొదుపుగా అతి జాగ్రత్తగా వాడుకోవాలి.
5. చెరువులలో నాచు వగైరా వ్యాప్తి చెందకుండా పెరుగుదల ప్రారంభించినప్పుడే అవి తొలగించవలెను.
6. చెరువుగట్లు ఎత్తుగా ఉంచి చుట్టుప్రక్కల ఉండే మురుగునీరు చెరువులోనికి రాకుండా చూడాలి. చెరువు గట్లు మీద ఆకురాల్చే చెట్లు పెంచకూడదు.
7. చెరువులలో బట్టలు ఉతకటం, స్నానం చేయటం వగైరా జరుగకుండా చూడాలి.
8. చెరువులోనికి మనుషులుగాని, పశువులుగాని దిగకుండా చూడాలి.
9. చెరువుగట్లపై మల మూత్రాల విసర్జన జరుగకుండా చూడాలి.
10. చెరువు నీరు యథాతథం (Raw Water)గా మంచినీటికి వాడవలసి వచ్చునప్పుడు కాచి, చల్లార్చి, వడబోసి తాగే విధంగా ప్రజలకు

అవగాహన కల్పించడానికి చాటింపు ద్వారా తెలియజేయాలి. వైద్య ఆరోగ్యశాఖ వారి ద్వారా పంపిణీ చేసే క్లోరిన్ బిళ్ళలు బిందెకు ఒక్కటి చొప్పున వేసి అరగంట అయిన తర్వాత వాడుకొనే విధంగా ప్రజలకు తెలియజేయాలి.

11. చెరువు చుట్టు కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేయాలి.

## మంచినీటి బావులు

1. మంచినీటి వాడకపు బావులలో బ్లీచింగ్ పౌడర్ తగు మోతాదులో కలపాలి.
2. బావుల చుట్టూ ప్లాట్‌ఫారంలు, మురుగు పోయే ఏర్పాట్లు చూడాలి.
3. బావుల చుట్టుప్రక్కల పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా శుభ్రంగా ఉండునట్లు చూడాలి.
4. బావుల దగ్గరలో పెంటకుప్పలు లేకుండా చూడాలి.
5. బావుల వద్ద స్నానం చేయటం, బట్టలు ఉతకటం వగైరా లేకుండా చూడాలి.

## చేతిపంపుల నిర్వహణ

1. చేతిపంపులు ఎక్కడైనా పాడయితే, వెంటనే మరమ్మత్తులు చేయించవలెను. అట్టి మరమ్మత్తులు చేపట్టుటకుగాను పంపు విడిభాగాలు (స్పేర్ పార్టులు) గ్రామ పంచాయితీలలో కొంత స్టాకు ఎప్పుడూ ఉండు విధంగా చూడాలి.
2. చేతిపంపులకు ప్లాట్‌ఫారంలు, మురుగు పోయే ఏర్పాట్లు (లీడ్ డ్రైయిన్స్) లేనిచోట్ల అవి వెంటనే నిర్మించాలి.
3. చేతిపంపుల పరిసర ప్రాంతాలలో నీరు నిలువ ఉండకుండా, చెత్తాచెదారాలు వేయకుండా పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలి.
4. చేతిపంపుల వద్ద బట్టలు ఉతకటం, స్నానాలు వగైరా చేయకుండా చూడాలి.

## రక్షిత మంచినీటి పథకాల నిర్వహణలో కొన్ని సూచనలు

### మంచినీటి స్కీముల నిర్వహణ

1. ప్రతిరోజు ఉదయం, సాయంకాలం ప్రతి ట్యాంకు (O.H.S.R) లోడుకు సరిపడే బ్లీచింగ్ ద్రావణం కలిపి అరగంట అయిన తరువాత సరఫరా చేయాలి.
2. ప్రతినెలకు ఒక్కసారి ఓ.హెచ్.ఎస్.ఆర్ ను శుభ్రం చేయాలి.
3. ఓవర్‌హెడ్ ట్యాంకు పైన, పంపువెల్, వాల్వ్‌పిట్సు పైన, మేన్‌హోల్ పైన కవర్స్‌తో ఎల్లప్పుడూ మూసి ఉంచాలి.
4. వాల్వ్‌పిట్సులో నీరు, చెత్తాచెదారం ఉండకుండా, లీకేజీలు లేకుండా చూడాలి.
5. బోరులోని నీటి మట్టం ఏ మేరకైనా తగ్గుతుంటే, అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.
6. రక్షిత మంచినీటి పథకం ఆవరణ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.
7. రక్షిత మంచినీటి పథకం నిర్వహణ చేస్తున్న వివరాలు లాగ్‌బుక్‌లో పొందుపరచాలి.



8. రక్షిత మంచినీటి పథకం ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలి. చక్కని పూలచెట్లు పెంచాలి.

### పైపులైను నిర్వహణ

1. పైపులైను లీకేజీలు ఎక్కడైనా కనిపించిన వెంటనే (24 గంటలలో) అరికట్టాలి. అందుకుగాను అవసరమైన విడిభాగాలను పంచాయతీలో స్టాకు ఉంచుకోవాలి.
2. వీలైనంత వరకు పైపులైను వెళ్ళేప్రక్క మురుగుబోదెలు లేకుండా చూడాలి.
3. ప్రతినెల స్కవరు వాల్వులు ఉపయోగించి పైపులైనులు శుభ్రపరచాలి.

### కుళాయిల నిర్వహణ

1. అన్ని కుళాయిలకు ప్లాట్‌ఫారమ్‌లు ఉండాలి. మురుగునీరు పోవుటకు తగు ఏర్పాటు (డ్రైయిన్) చేయాలి.
2. పబ్లిక్ కుళాయిలు, ప్రైవేటు కుళాయిలు భూమికి దిగువన గోతులలో లేకుండా తప్పనిసరిగా భూమికి రెండు అడుగులు పైన ఉండేటట్లు చూడాలి.
3. ప్రైవేటు కుళాయి కనెక్షన్లు, సంబంధిత గ్రామీణ నీటి సరఫరా విభాగపు ఇంజనీరు వారి అనుమతి లేకుండా ఇవ్వరాదు.
4. అక్రమ ప్రైవేటు కనెక్షన్లు, మోటారు బిగించి అక్రమంగా నీటిని వాడుకొను వారిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలి.
5. పబ్లిక్ కుళాయిలకు కార్కులు బిగించి, మంచినీరు వృధాకాకుండా చూడాలి.

### మోటార్ల నిర్వహణ

1. మోటారు నిర్వహణ అతిముఖ్యం. మోటారు మరమ్మత్తు వచ్చినపుడు అది బాగుచేయుటకు కొంత వ్యవధి పడుతుంది. అలాంటి సందర్భాలలో అదనపు మోటారు ఏర్పాటు చేసి మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి.
2. మోటార్లు పని చేయునపుడు వాటి శబ్ధాలు వినాలి. అసాధారణమైన శబ్దాలు ఉన్న యెడల జాగ్రత్త పడాలి.
3. సాధారణంగా పీక్ అవర్ (ఒకేసారి విద్యుత్ వాడకం జరిగే సమయం)లో వాడునపుడు ఓల్టేజి సరిపడక మోటార్లు పాడవుతాయి. అందుచేత సంబంధిత ఎలక్ట్రికల్ ఇంజనీరు వారి సలహా ప్రకారం మోటారు వాడే సమయాన్ని నిర్ణయించుకోవాలి.
4. ఎలక్ట్రికల్ వైరింగ్, ఇతర కనెక్షన్లు సరిగా లేకపోవడంవలన రిపేర్లు వచ్చి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలి.




5. మోటారు ఏమైనా వేడెక్కిందా? లేదా? గమనిస్తూ ఉండాలి.

## ఫిల్టర్ నిర్వహణ – ముఖ్య అవసరాలు

1. ఫిల్టర్‌లో ఎప్పుడూ కనీసం ఒక మీటరు ఎత్తునీరు ఉండేటట్లు చూడాలి.
2. ఫిల్టర్ ఎప్పుడూ ఎండబెట్టకూడదు.
3. ఫిల్టర్‌లో ఒడపోత తగ్గుతున్నప్పుడు పై ఇసుకపొర అంగుళంలోపు మాత్రమే తొలగించవలసి ఉంటుంది.
4. ఫిల్టర్‌లో ఎప్పుడూ రెండు అడుగుల కనీస మందంగల ఇసుక ఉండాలి.
5. ఫిల్టర్ నందుగల నీటిపై తేలియాడే వస్తువులు, తెట్టు వగైరా తీసివేయాలి.
6. చెరువులోని నీరు ఎక్కువ మట్టి శాతంతో కలసియున్నప్పుడు ఫిల్టరులోకి నీరు పంపే పని చేయకూడదు. ఇలా చేసినచో ఫిల్టర్లు తొందరగా పాడవుతాయి. నీరు ఎక్కువ బురదగా ఉన్నప్పుడు చెరువులోని ఇన్‌టేక్‌వెల్‌లో పటికను గోనెసంచెలో పెట్టి కట్టి వ్రేలాడదీయాలి.
7. ఫిల్టరులో ఒక పోత తగ్గినప్పుడు పై ఇసుకపొర అంగుళంలోపు తొలగించాల్సి ఉంటుంది. అప్పుడు ఫిల్టరులో పూర్తినీరు బయటకు పోనివ్వరాదు. పై ఇసుక పొర నుండి 6 అంగుళాల లోతు వరకు మాత్రమే నీటిని బయటకు వదలి ఇసుకపొర తొలగించిన వెంటనే నీటిని ఫిల్టరులో నిలుపాలి. ఈ విషయంలో ఎట్టి అశ్రద్ధ చేయకూడదు. ఇసుకపై పొరతీయటం, నీటిలో నింపటం వగైరా పనులన్నీ ఒకే దినంలో జరిగిపోవాలి.
8. ఫిల్టరు మరమ్మత్తులో ఉన్నప్పుడు, సరాసరి చెరువునీరు సరఫరా చేసినట్లయితే టాం టాం ద్వారా కాచి ఒకపోసి తాగమని ప్రజలకు తెలియజేయాలి.

## క్లోరినేషన్

| ట్యాంకు పరిమాణము (లీటర్లు) | మోతాదు (గ్రాములు) |
|---|---|
| 10,000 లీటర్లు | 30 గ్రాములు |
| 20,000 లీటర్లు | 60 గ్రాములు |
| 30,000 లీటర్లు | 120 గ్రాములు |
| 40,000 లీటర్లు | 180 గ్రాములు |
| 60,000 లీటర్లు | 270 గ్రాములు |
| 90,000 లీటర్లు | 360 గ్రాములు |
| 1,20,000 లీటర్లు | 450 గ్రాములు |
| 2,00,000 లీటర్లు | 600 గ్రాములు |

### ఎ) బ్లీచింగ్ పౌడర్ కలుపువిధానం

పైన చూపిన మోతాదులో ప్రతి ట్యాంకు లోడుకు బ్లీచింగ్ ద్రావణం కలిపి, 30 నిమిషాలు ఆగిన తర్వాత మాత్రమే నీటిని బయటకు వదలాలి.

బ్లీచింగ్ పౌడర్ స్టాకు పాతపడే కొలదీ దాని పవరు తగ్గుతుంది. అందుకుగాను కొద్దిగా మోతాదు పెంచవలసి ఉంటుంది. ఎంతమేరకు పెంచవలెనంటే, క్లోరోస్కోప్‌తో గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న కుళాయి నుండి వచ్చునీటిని పరీక్ష చేసిన యెడల, అది 0.2 పి.పి.యమ్. రీడింగుకు సరిపడా రావాలి. ఆ రీడింగుకు రాని యెడల అది వచ్చేవరకు బ్లీచింగ్ పౌడర్ మోతాదు పెంచాలి.

### బి) బ్లీచింగ్ ద్రావణం తయారు చేసేవిధానం

అవసరమైనంతమేర బ్లీచింగ్ పౌడర్ తీసుకొని బకెట్‌లో సరిపడా నీటితో బాగా కలిపి, చిక్కటి ద్రావణంగా తయారు చేయవలెను. ఆ తరువాత మరికొంత నీరు కలిపి పలుచటి ద్రావణంగా చేసి తీర్చాలి. అడుగు భాగాన పిప్పిని వదిలి మిగిలిన ద్రావణాన్ని వేరొక బకెట్‌లోనికి మార్చి, దానిని మాత్రమే ట్యాంకులో కలుపాలి.

### సి) బ్లీచింగ్ పౌడర్ కొనేటప్పుడు గమనించవలసిన విషయాలు

1. నాణ్యమైన (ఐ.ఎస్.ఐ మార్కు కలిగిన)దిగా ఉండాలి.
2. తాజాగా (ఘాటుగా) ఉండాలి.
3. తయారైన తేదీని గమనించి కొనాలి.

### డి) బ్లీచింగ్ పౌడర్ నిలువ వుంచడానికి తీసుకొనవలసిన జాగ్రత్తలు

1. తేమలేని ప్రదేశంలో ఉంచాలి.
2. ఉంచే ప్రదేశం చల్లగా ఉండాలి.
3. ఉంచే ప్రదేశమునకు డైరెక్టుగా సూర్యరశ్మి తగులనివ్వరాదు.
4. బ్లీచింగ్ పౌడర్ నుంచి వచ్చే వాయువులు పోవటానికి అనువుగా కిటికీలు, వెంటిలేటర్లు ఉండాలి.
5. బ్లీచింగ్ బస్తా మూతి ఎల్లప్పుడూ బిగించి ఉంచవలెను. వీలైనంతవరకు పింగాణి జాడీలో కాని, ప్లాస్టిక్ డ్రమ్ములలోగాని భద్రపరచటం మంచిది.

**పై సూచనలు అన్నింటిని జాగ్రత్తగా పాటించి, మంచినీటి విషయంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బంది కలుగకుండా ఆయా గ్రామ పంచాయితీల వారు చూడవలసినదిగా కోరడమైనది.** ♦



## మహిళలకు పూర్తి భద్రత

# అభయహస్తం



**ఒక** విత్తనం నాటితే అది మహావృక్షమై అందనంత ఎత్తుకు ఎదిగిపోయి లక్షలాది మందికి నీడతో పాటు ఫలాలను అందజేస్తుంటే ఆ వృక్షం పట్ల ప్రజలు మక్కువ చూపుతుంటారు. సరిగ్గా అలాంటి వృక్షమే ఈ రాష్ట్ర ప్రభుత్వం పెంచి పోషించింది. కొద్దికొద్దిగా ఎదిగిన కొమ్మలు గత 5 సంవత్సరాల కాలంలో విస్తరించిపోయి ఒక మహా వట వృక్షంగా మారిపోవడంతో, లక్షలాది మంది మహిళలు, వారి కుటుంబాలు ఆ చెట్టు నీడన సేద తీరుతున్నారు. ఈ మహా వట వృక్షం పేరు 'పొదుపు'. విస్తృతంగా ఎదిగిపోయిన కొమ్మలన్నీ మహిళా స్వయం సహాయక సంఘాలు.

రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపుగా 7 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో కోటి మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. కోట్ల రూపాయల రివ్వాలింగ్ ఫండుతో మహిళలు ఆర్థికంగా ఊహకు అందనంత ఎత్తుగా ఎదిగిపోయారు. ప్రపంచ మహిళా లోకానికే ఆదర్శప్రాయంగా నిలిచిపోతున్నారు. వివిధ దేశాధినేతలు వీరిలోని పట్టుదలను, నేర్పరితనాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. అయినప్పటికీ, ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే. 'ఆకాశంలో నీవూ నేనూ సగం సగం. . .' అనే చందంగా రాష్ట్ర జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు ఆర్థిక లాభాలు చేకూర్చే అనేక పథకాలు వారికే కేటాయించడం జరుగుతున్నది.

**రాష్ట్రాన్ని సుసంపన్నం చేయడంలో గణనీయమైన పాత్రను పోషిస్తున్న మహిళలకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పింఛను, జీవిత బీమా సౌకర్యం కల్పించడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం.**

**ఏ మనిషికైనా వయస్సు పైబడ్డాక కలిగే సమస్య అభద్రతా భావం. శక్తి ఉడిగిపోయాక సంపాదించ లేకపోతే  నేను ఎలా జీవించగలను అన్న బెంగ వెంటాడడం సహజం. మహిళల్లో ఈ అభద్రతా భావాన్ని తొలగిస్తే ఎలా వుంటుందనే ఆలోచన మన రాష్ట్ర ముఖ్యమంత్రికి రావడం ఈ రాష్ట్ర మహిళలు చేసుకున్న పుణ్యం. ప్రపంచంలో ఎవరికి రాని ఆలోచన, ఎక్కడా లేని పథకం మన రాష్ట్రంలో ప్రారంభం కావడం విశేషం.**

రేషన్‌షాపులు మొదలుకొని ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లు కూడా వారి పేరు మీదే ఇవ్వడం వలన 'కలకంఠి కంట కన్నీరొలికిన తొలగిపోవురా సిరులు' అనే విధంగా తరతరాలుగా అణగదొక్కబడిన మహిళలకు నేడు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు మహిళా సాధికారికతను ప్రతిబింబింప చేస్తున్నాయి.

గ్రామైఖ్య సంఘాల సభ్యులందరికీ పావలావడ్డీకే అప్పులు ఇవ్వడంతో వీరు ఆర్థికంగా ఎంతో బలపడ్డారు. ఇందిరా క్రాంతి పథం ద్వారా నేడు మహిళలు వ్యవసాయ పంటలు మార్కెటింగ్ చేస్తున్నారు. పాల కూలింగ్ సెంటర్లు నడుపుతున్నారు. పాడి పశువులతో డెయిరీలు నిర్వహిస్తున్నారు. గిరిజన ప్రాంతాలలో విద్యుత్ ప్లాంట్లు నడుపుతున్నారు. పల్లెల ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చివేస్తున్నారు. ఇదే కోవలోకి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మరో పథకం **అభయహస్తం సమగ్ర ఫించన్ పథకం**. ఫిబ్రవరి 6, 2009న రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వై. యస్. రాజశేఖరరెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

ఏ మనిషికైనా వయస్సు పైబడ్డాక కలిగే సమస్య అభద్రతా భావం. శక్తి ఉడిగిపోయాక సంపాదించ లేకపోతే  నేను ఎలా జీవించగలను అన్న బెంగ వెంటాడడం సహజం. మహిళల్లో ఈ అభద్రతా భావాన్ని తొలగిస్తే ఎలా వుంటుందనే ఆలోచన మన రాష్ట్ర ముఖ్యమంత్రికి రావడం ఈ రాష్ట్ర మహిళలు చేసుకున్న పుణ్యం. ప్రపంచంలో ఎవరికి రాని ఆలోచన, ఎక్కడా లేని పథకం మన రాష్ట్రంలో ప్రారంభం కావడం విశేషం.

అభయహస్తం పింఛను పొందాలంటే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు రోజుకు ఒక రూపాయి వంతున పింఛన్ నిధి క్రింద చెల్లించాలి. అంటే, ఏడాదికి రూ. 365/–లు, ప్రభుత్వం కూడా తమ వాటాగా అంతే సొమ్మును రూ. 365/–లు జమ చేస్తుంది. ఈ రెండూ కలిపి పింఛన్ నిధిలో వేస్తుంది. అలా చేసినందు వలన మహిళలు 60 ఏళ్ళు దాటిన మరుసటి రోజు నుండి నెలకు రూ.500/–ల నుండి రూ. 2,200/– వరకు పింఛన్ వస్తుంది. ఎంత మొత్తం వస్తుంది అనేది ఈ పింఛన్ పథకంలో చేరే నాటికి మహిళల వయస్సును బట్టి ఉంటుంది. ఇట్టి చెల్లింపులను పారదర్శకంగా వారి పాస్‌బుక్‌లో నమోదు చేసి అందించడం జరుగుతుంది.  వృద్ధాప్యంలో ఒకరి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడకుండా జీవించే ఆర్థిక స్తోమత ఈ పథకం వలన లభిస్తుంది.

ఈ పథకంలో చేరాలంటే, గుర్తించబడిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలలో 01.12.2007 లోపు చేరి, కనీసం ఒక సం. పాటు సంఘ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న తెల్లరేషన్ కార్డు కలిగిన, 18 సం॥లు పై బడ్డ మహిళలు అందరూ అర్హులే.

ఈ పథకంలో సభ్యురాలు ఆకస్మాత్తుగా మరణించినట్లైతే వారు చెల్లించిన వాటా ధనం, ప్రభుత్వ వాటా ధనం, వడ్డీతో పాటు జీవితబీమా ప్రయోజనాల క్రింద సహజ మరణం అయితే రూ. 30,000/– ప్రమాదవశాత్తు అయితే రూ. 75,000/– వారి యొక్క నామినికి బదలాయించబడతాయి.

ఈ పథకంలోని సభ్యుల యొక్క 9వ, 10వ, ఇంటర్, మరియు ఐ.టి.ఐ. చదివే ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ. 1200/– చొప్పున ఉపకార వేతనాలు అందించబడతాయి.

సభ్యులు తమ ఆదాయాన్ని బట్టి వాటాదార్లను నెలకు రూ. 30, 60, 90, 120 వరకు కూడా పొదుపు చేసే అవకాశం ఉంది. పింఛన్ పొందేందుకు కనీసం పది సంవత్సరాల వాటా ధనాన్ని రూ. 3600/– మొదటగానే చెల్లించాల్సి వుంటుంది. ఈ విధంగా ఇప్పటికిప్పుడు 60 సంవత్సరాల వయస్సు వున్న వారు ఒకేమారు గాని, వాయిదాల పద్ధతినగాని చెల్లించాల్సి వుంటుంది.

స్వశక్తితో అభివృద్ధిలో కీలక భాగస్వాములవుతున్న ఆడపడుచులకు ప్రభుత్వోద్యోగుల తరహాలో నెలవారి పింఛన్ పథకం అమలులోకి వస్తుంది. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, అన్ని పట్టణ ప్రాంతాలలోని కోటి ఇరవై ఐదు లక్షల మందికి పింఛను, జనశ్రీ జీవిత బీమా సౌకర్యం ద్వారా వీరు లబ్ధిపొందనున్నారు. మహిళా సాధికారతలో ఈ పథకంతో సరికొత్త శకం ప్రారంభమైనది.

రాష్ట్రాన్ని సుసంపన్నం చేయడంలో గణనీయమైన పాత్రను పోషిస్తున్న మహిళలకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పింఛను, జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం.

ఇలాంటి సమగ్ర పథకం దేశంలో మరెక్కడా లేదు. అభయహస్తం పింఛను పథకం మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని ఆశిద్దాం. . . .

**– కె. ఎం.**

# పల్లెవాసులను ఉర్రూతలూగించిన యక్షగాన ప్రక్రియ 'చిందు భాగవతం'

ఆంధ్రదేశంలో ఓవైపు 'శిష్ట' సాహిత్యం, కళలు రాజాస్థానాలను ఆశ్రయించి, వారి పరిపోషణలో వర్ధిల్లుతుండగా ఇంకోవైపు 'దేశి' సాహిత్యం, కళలూ ప్రజల నోళ్ళల్లో, నాలుకలపైనా మౌఖిక ప్రచారం పొందుతూ ఒక తరం నుండి మరో తరానికి మార్గాన్ని అందిస్తూ నిరంతరంగా సాగిపోతూనే ఉన్నాయి. ఈ 'దేశి' కళలను జానపద సాహిత్యం అన్నారు. పండితులకు అది అనాదృత వాఙ్మయమైతే జనపదాల్లో ఉండే పల్లీయులకు అది జీవన నాళిక. 'జానపదుల్ పురీజనుల్' అన్నాడు ఎర్రన. అతని కాలం నాటికి 'పురం' అంటే పల్లె. ఆ పల్లెలో నివసించే జనులే జానపదులు. నాచన సోమన పేర్కొన్న 'జాజర పాట' జానపదులు పాడిన పాట. శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో 'కీర్తింతురెద్దాని కీర్తిగంధర్వులు - గాంధర్వమున యక్షగాన సరణి' అని యక్షగానాలకు ప్రస్తావించాడు. పాల్కురికి సోమన 'వెన్నెలపదాలు, తుమ్మెద పదాలు, రోకటి పదాలు' వంటివి ఉన్నాయని అంతకు ముందే పేర్కొన్నాడు. వీటిని బట్టి శిష్ట సాహిత్యానికి పూర్వం నుంచే జానపద సాహిత్యం, కళలూ జనజీవనంలో ప్రాచుర్యంలో ఉన్నాయని చెప్పొచ్చు.

జానపద కళారూపాలను వృత్తిగా స్వీకరించి పూర్వకాలంలో రాజాశ్రయంలో, తరువాత శ్రీమంతులు పోషణలోనూ, ఆ తరువాత ఉదర పోషణ కోసం ఇల్లిల్లూ తిరిగి ఆ కళారూపాలను ప్రదర్శిస్తూ బిచ్చమెత్తుతూ జీవనయాత్ర సాగించినవారు జానపద కళాకారులు. 'వీధి వీధులు తిరుగుతూ దోసెడు గింజలకో, దొప్పెడు గంజికో దేశి కవితావిభూతిని పంచి పెట్టెడు దరిద్ర భిక్షుకులు' వీరు.

జానపద కళాకారుల్లో తెలుగునాట ఎన్నో కులాలవాళ్ళున్నారు. పిచ్చుక గుంటలు, శారదకాండ్రు, వీరముష్టులు, జంగాలు, దాసరులు, భాగవతులు, బీరన్నలవారు, సుద్దులగొల్లలు, గంగిరెద్దులవారు, బాలసంతులవారు, బుడబుక్కలవారు, జోగులవారు, బవనీలు, జక్కులవారు, చిందుమాదుగలు మొదలైనవారు జానపద గాయకులే. 'చిందుమాదుగలు' ఆంధ్రప్రదేశ్ వివిధ ప్రాంతాల్లో ఉన్నా, ప్రధానంగా వీరు తెలంగాణా ప్రధానంగా ఎక్కువగా ఉన్నారు. వీరిని 'సిందోళ్ళు', 'చిందోళ్ళు' అని కూడా వ్యవహరిస్తారు. 'చిందు' అంటే ఆడడం. జక్కులవాళ్ళూ చిందు వేసినట్టు కేతన దశకుమార చరిత్రంలో పేర్కొన్నాడు.

**జానపద కళారూపాలను వృత్తిగా స్వీకరించి పూర్వకాలంలో రాజాశ్రయంలో, తరువాత శ్రీమంతుల పోషణలోనూ, ఆ తరువాత ఉదర పోషణ కోసం ఇల్లిల్లూ తిరిగి ఆ కళారూపాలను ప్రదర్శిస్తూ బిచ్చమెత్తుతూ జీవనయాత్ర సాగించినవారు జానపద కళాకారులు. 'వీధి వీధులు తిరుగుతూ దోసెడు గింజలకో దొప్పెడు గంజికో దేశి కవితావిభూతిని పంచి పెట్టెడు దరిద్ర భిక్షుకులు' వీరు.**

'చిందు' వేస్తూ అభినయించే వారు కాబట్టి 'చిందువాళ్ళు' అని పేరు వచ్చింది.

తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే 'యక్షగానం' చాలా ప్రాచీనమైన ప్రక్రియ అని తెలుస్తుంది. పాల్కురికి సోమనాథుని కాలం నాటికే 'యక్షగానం' ప్రచారంలో ఉంది. (యక్షులు) 'జక్కులు' అనే తెగవారు ప్రదర్శించే ప్రక్రియ కాబట్టి యక్షగానంగా పేరొందింది. ఐతే తొలిదశలో యక్షగానం పూర్తిగా గానాభినయాలతో ఉండేది. తరువాత నాటక



## చిందు యక్షగానాలు





స్వరూపాన్ని సంతరించుకుంది. తొలిదశలో ఏకపాత్ర, ద్విపాత్రలతో అభినయించబడ్డ యక్షగానం ఈ శతాబ్దం నాటికి అనేక పాత్రలతో సంపూర్ణ స్వరూపాన్ని పొందింది. ఈ యక్షగానాన్ని తెలంగాణలో 'భాగవతం'గా, రాయలసీమ, చిత్తూరు ప్రాంతంలో 'భారతం'గా, 'ఆట'గా వ్యవహరిస్తారు. జానపదుల నోళ్ళలో అది భాగోతంగా స్థిరపడిపోయింది. తొలి తెలుగురాజులైన శాతవాహనుల కాలం నుండి నేటిదాకా సాగివచ్చిన ఈ యక్షగాన ప్రక్రియ 'భాగోతం'గా అందరి అభిమానాన్ని పొందింది. చిందు వేస్తూ దీనిని అభినయించేవారు 'చిందుమాదిగలు'గా, చిందు కళాకారులుగా వ్యవహరించబడుతున్నారు. చిందుకళాకారులు ప్రముఖంగా ప్రదర్శించే యక్షగానం 'జాంబపురాణం'. మాదిగలు తాము జాంబవంతుని సంతానమని చెప్పుకుంటారు. అందలి పాత్రల సంభాషణలు గీతవచన రూపాల్లో ఉంటుంది. అదే యక్షగానం దృశ్యప్రబంధ రూపాన్ని సంతరించుకుంది. చిందు భాగవతం తెలంగాణాలోని పల్లె పల్లెలో ప్రాచుర్యం పొందిన కళారూపం. జాంబవంతుని కుమారుల్లో చిందు మహాముని ఒకరు. ఆయన సంతతివారం తామని 'చిందుమాదిగలు' గర్వంగా చెప్పుకుంటారు. మాదిగ కులానికి ఉపకులంగా ఉంటూ చిందును ప్రదర్శిస్తున్న కళాకారులు వీరు. చిందు భాగోతాలు జానపద సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని పొందాయి.

## జాంబపురాణం

జాంబపురాణంలో 18 యుగాలకు సంబంధించిన విషయాల వివరణ ఉంటుంది. దీనిలో 18 మంది కళాకారులు పాల్గొంటారు. తొమ్మిది స్త్రీ పాత్రలతో ఆద్యంతమూ రక్తి కట్టించే నాటక ప్రక్రియ ఇది. అనేక వాద్యాల సమ్మేళనం ఇందులో ఉంటుంది. దీనిలో దేవతల జననం, దేవతల వివాహం, శ్రీశక్తి జననం, బసవ పురాణం, విశ్వబ్రాహ్మణ పురాణం, ఇరవై ఆరు శంకరజాతుల వివరణ, యాదవుల జననం, బ్రాహ్మణుల పుట్టుక, అరుంధతి కళ్యాణం, పంచమజాతి జననం వంటి అంశాలపై చర్చ ఈ జాంబవునికి, బ్రాహ్మణులకి మధ్యన జరుగుతుంది. జాంబవుని పాత్ర ఈ యక్షగానంలో ప్రత్యేక ఆకర్షణ. అతని వేషం భేతాళుని పోలి ఉంటుంది. అతడు డప్పులు, కొమ్ములు, వొలిపెనలు ధరించి ఒళ్ళు విరుస్తూ చిందులు తొక్కుతూ, పళ్ళు నూరుతూ హార్మోనియం తాళాల ధ్వనులు మోగుతుండగా రంగప్రవేశం చేస్తాడు. ఈ పాత్ర పోషించడానికి బృందంలో ఓ ప్రత్యేకమైన 'వ్యక్తి' ఉంటాడు. అన్ని విధాలా హావభావాలను పోషించే గంభీరమైన 'మూర్తి' కలిగి ఉంటాడు. మూడు రాత్రులూ సీరియల్‌గా కొనసాగే 'జాంబపురాణం' అంటే జానపదులకు ఎంతో అభిమానం.

## జాంబవంతుని పాత్ర వైశిష్ట్యం-త్రిపురాసురవధ సందర్భం

దేవతలు రాక్షసులను వధించగా రాలిపడే రక్తపుచుక్కలు నేలపై పడితే అవి రాక్షసులుగా అవతరిస్తాయని, వాటిని అలా పడకుండా చూడాలని ఆదిశక్తిని ప్రార్థిస్తారు. ఆమె వికృత రూపంలో నాలుకను చాచి ఆ రక్తపు చుక్కలను తాగుతుంది. రాక్షస సంహారానంతరం శక్తి రక్తదాహం తీరక దేవతల వైపుగా రౌద్రంతో పరిగెత్తుతుంది. ఆమెను శాంతింపజేయడానికి జాంబవుడు నానాలంకారాలను ధరించి నర్తకుడుగా అలంకరించుకుంటాడు. లక్ష్మీదేవి కలువరేకులను, ఈశ్వరుడు మృదంగాన్ని, పార్వతీసరస్వతులు, దేవరాణి, శచీదేవి వంటివారు వస్త్రాలను, ఆభరణాలను జాంబవునికిస్తారు. అతడు శృంగారంగా తయారై కోపంతో ఉన్న ఆదిశక్తి ముందుకు వచ్చి భావ రాగ తాళభరితంగా నాట్యం చేస్తాడు. ఆమె శాంతించి ప్రసన్నురాలవుతుంది.

అది జాంబవంతుడు తనను తాను పరిచయం చేసుకునే రీతి ఈ విధంగా ఉంటుంది.

"ఆది జాంబవంతుడ
హరిభక్తుడ

ఆదిలోని ఓంకార ఝూంకార నాదమందు
నుద్భవించి అవతరించితిని కమలమందున
బ్రహ్మవేత్తను
బ్రహ్మజ్ఞానిని
పరబ్రహ్మమూర్తి స్వరూపమెరిగిన వాడను
ఆది జాంబవంతుడ
హరిభక్తుడ"

జాంబపురాణం ఆద్యంతమూ రక్తి కట్టించే యక్షగానం.

ఇతర యక్షగానాలలో గేయఫణితులు

'చిందులు' ప్రదర్శించే యక్షగానాలలో 'భూకైలాస్' జానపదులను ఆకర్షించేది.

మండోదరి తనను పరిచయం చేసుకునే పాట.



"మయుని కుమార్తెను
మండోదరీ
దయగల పుత్రినీ
దానవకులజనూ
సుమశరుని బంతిన్
సుశీలవేణిని
పాతాళపురం బూ
దామంబూ
ఈ తిరుభీమాంశమున
జన్మించిన
ప్రీతి చెలంగిన ఇంతిన్
పూబంతిన్"

జనాభిమానం పొందిన మరో యక్షగానం 'అల్లిరాణి'.

"రమణీలలామ వినవే
అల్లిరాణిని నేనూ
మంజులవాణిని విను
విన్నాణము తోను
కమలకరంబున
కలుపూవు నందు
విమలతో జన్మించు వీరవిక్రమురాల
ఉమ వరమునను
పాండ్యమహేశుడు
బెంచే మహాత్ముడు"

అనేపాట బహుళ ప్రచారం పొందింది.

'మంధాత' ప్రజలు మెచ్చిన మరో యక్షగానం.

"భాను దీప్తాంబుధి
సీతాభానుడ మాంధాతృడ
ఓరోరి ద్వారకా మానవేంద్రుడ
భూనభోంతరమ్ములు బెగడొందగ
మానవనాథుల నేను జయించిన
పురుషోద్భవుండ నేను వినర
ముద్భరితుడనై ప్రజల పోషింతూ
అయోధ్యాపురము
ధణధణ మద్దెల ఝూం కృతిచేయగ
ననబోణులు నాట్యము చేయగమను"



అని మాంధాత చేసే నృత్యాభినయం ఆబాల గోపాలాన్నీ ఆనందంలో ముంచెత్తుతుంది.

చిందు భాగవతులు రసరమ్యంగా ప్రదర్శించే 'లవకుశ' జానపదుల నలరించింది.

లవకుశులు పాడే ఈ కీర్తన

"చండిలోన రారండి మనమూ
చెండులాడుదామా
ఇచట నుండనేలసుమా
రండి అన్నయా పోదము గుమిగూడీ
ఔర పోవలెనౌరా – మనమూ
అందము తోడుతు – మన అమ్మను జేరగను"

ఆ రోజుల్లో రైతులూ–పసుల కాపరులూ పాడుకున్న పాట.

'హరిశ్చంద్ర' లోని చంద్రమతి పాడిన పాట శోకరసానికి పరాకాష్ఠ.

"ప్రాణేశ! దయలేక నను
బాసీపోయెదవా!
ప్రాణంబు యెట్టుల భరియింతూ
నయ్యెయ్యో!
పశువుల నమ్మిన పగిది
శిశువు నన్ను అమ్మించి
వశముగానట్టి ఆపద
వచ్చే మనకూ"

ఇలా చిందు యక్షగానాల మధుర గీతాలన్నీ జానపదుల హృదయాలను దోచుకున్నవే.

సారంగధర, భక్తప్రహ్లాద, మైరావణ, మాంధాత, లవకుశ, భీమాంజనేయ, రామాంజనేయ, పాండవ వనవాసం, కృష్ణార్జున యుద్ధం, అల్లీఅర్జున, సతీసావిత్రి మొదలైన 60 పౌరాణిక యక్షగానాలను చిందోళ్ళు ప్రదర్శిస్తారు.

చిందు భాగవతులు ఈ యక్షగాన ప్రదర్శనకు ముందు తమ ఆరాధ్యదైవం 'ఎల్లమ్మ' దేవతను పూజిస్తారు. చిందోళ్ళు అలంకరణలోనూ సిద్ధహస్తులు. ఎరుపు, తెలుపు, పసుపు రంగులను మేకప్‌కు ఉపయోగిస్తారు. నగలను, ఆభరణాలను పూసలతో, ముత్యాలతో తయారు చేసుకుంటారు. ఒక్కో పాత్రకు ఆభరణాలు తయారుచేయ్యడానికి ఆరు నెలలదాకా పడుతుందని వారు చెబుతారు. ప్రతి నటుడు, నటి తమ

అలంకరణ తామే చేసుకుంటారు. అందరూ కాళ్ళకు గజ్జెలు ధరిస్తారు. స్త్రీలు పట్టు, మెరుపు చీరలు ధరిస్తారు. యక్షగాన రచయిత అంటూ ప్రత్యేకంగా ఉండడు. తాత నుంచి తండ్రికి, తండ్రి నుంచి కొడుక్కి ఈ యక్షగాన వాఙ్మయం మౌఖికంగా సంక్రమించింది. స్త్రీల విషయంలోనూ అంతే. పాటలకు సంగీతాన్ని వారే స్వరపరుచుకుంటారు. తాళపరిజ్ఞానం వారికెక్కువ. ఆదితాళం, ఏకతాళం వారు ఎక్కువగా పాడే తాళాలు. వీణ మీటడంలో స్త్రీలు ప్రావీణ్యం కలవారు. హార్మోనియంపై ఏ రాగాన్నైనా పలికించగలరు.



కాలానుగుణంగా చిందు యక్షగానంలో ప్రవేశించిన పాత్ర 'బుడ్డర్‌ఖాన్. ఇది హాస్యం కోసం సృష్టించిన పాత్ర. భాష కూడా అపభ్రంశాలతో ఉన్నా ఆ నటనను, ఉచ్ఛారణను చూసి జానపదులు నవ్వుకొని ఆనందిస్తారు. కాలం మారింది. ప్రాచీన కళారూపాలను ఆదరించే నాధుడు లేడు. అందరు జానపద కళాకారుల్లాగే చిందు భాగవతులకు కూడా జీవనోపాధి కరువైంది. ఒకనాడు రాజుల, జమీందారుల ఆదరణలో జానపద కళలు నాలుగు కాలాలు బతికి బట్టకట్టాయి. మారిన దేశకాల పరిస్థితుల్లో ఆధునిక యుగంలో టీవీ ఛానెల్స్, సినిమాల ధాటికి తట్టుకొని నిలిచే స్థితి భవిష్యత్తులో కన్పించడం లేదు. అందుకే చాలామంది చిందోళ్ళు యక్షగాన ప్రదర్శనల్ని మానేసి పొట్టకూటికోసం ఇతర వృత్తులను చేపడుతున్నారు. ఇంకా కొన్నాళ్ళు పోతే ఈ అపురూప కళారూపం అంతరించిపోయే అవకాశం ఉంది. నిజామాబాద్‌కు చెందిన వృద్ధ చిందు కళాకారిణి ఎల్లమ్మ ఈ కళ వికాసం కోసం కృషి చేసినందుకు ఎప్పటికీ కళాకారులు ఆమెను గుర్తు చేసుకుంటారు.

చిందు భాగవతులు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలలో ఉన్నారు. నల్లగొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలలో చిందు భాగవతుల కుటుంబాలున్నాయి. అంతరించిపోతున్న చిందు యక్షగానాన్ని వీడియోలో భద్రపరచడానికి తెలుగు విశ్వవిద్యాలయం ఇదివరకే చిత్రీకరణ జరిపింది. 'జానపద కళాపరిశోధనా వేదిక' కూడా ఈ కళారూపం పరిరక్షణకు కృషి చేస్తున్నది.

### నల్లగొండ జిల్లా చిందోళ్లు

నల్లగొండ జిల్లాలో చిందు యక్షగాన పితామహునిగా పిలిట్ల వెంకయ్యను చెబుతారు. తొలిసారిగా ఆయన గోసంగి, గారడి, ఎరుకల వంటి ప్రత్యేక పాత్రాభినయంతో ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఆయన తరువాత పిల్లిట్ల రాజయ్య, సుల్తాను, రామయ్య దీనికి విస్తృత ప్రాచుర్యం కల్పించారు. మిర్యాలగూడ కొండప్రోలు చింతల చెర్వు బాబూరావు, దేవరకొండ ప్రాంతంలో చిట్టెంపాడుకు చెందిన గడ్డం రాజయ్య, నాంపల్లికి చెందిన గడ్డం జగన్నాధం, శాలిగౌరారం మండలం లింగోటంకు చెందిన చింతల ఫక్కీరు. నల్లగొండ సమీపంలోని అంబారిపేటకు చెందిన చింతల చెర్వు నాగభూషణం, రామన్నపేట ప్రాంతంలోని పొద్దుటూరుకు చెందిన గడ్డం క్రిష్ణయ్య, లక్ష్మణపురంకు చెందిన గడ్డం శంకరయ్య, ఎన్నారంకు చెందిన గడ్డం ఊషయ్య, పల్లివాడకు చెందిన గడ్డం శంకరయ్య, భువనగిరి ప్రాంతం గూడూరుకు చెందిన గడ్డం స్వామి, రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన ప్రభుత్వ కళానీరాజన పురస్కార గ్రహీత, చిందు కళాకారుడు పిల్లిట్ల అంజయ్య, తుక్కాపురం గడ్డం రాజలింగం, ఆలేరు మండలం సాయిగూడెం పిల్లిట్ల సంజీవ్, చౌటపల్లికి చెందిన జి. స్వామి, సోమారంకు చెందిన బాలనర్సయ్య, నుద్దాలకు చెందిన గడ్డం యాదగిరి, వెంకటాపురంకు చెందిన గడ్డం స్వామి బృందాలు, హుజూర్‌నగర్ మండలం లకారం గ్రామం, నేరేడుచర్ల మండలం ముకుందాపురం దాసారం పెన్‌పహాడ్ మండలం అనాజిపురం, తాళ్ళమ్మంపహాడ్ (టి.కె.పహాడ్), అర్వపల్లి మండలం కొత్తపల్లి, వర్ధమానుకోటకు చెందిన చిందు యక్షగాన బృందాలు ఆ కళావికాసం కోసం పని చేస్తున్నాయి.

పాల్కురికి సోమన కవితారచనకు స్ఫూర్తినిచ్చినవి జానపదులు పాడుకున్న పాటలేనని బసవపురాణంలో చెప్పుకున్నాడు. అంతటి ప్రాభవాన్ని చూపే జానపద గేయాలతో కూర్చబడని కళారూపం 'చిందుయక్షగానం' జనసామాన్య పరిచిత వస్తువుతో, రసవంతంగా సాగే జానపదగేయ స్పర్శతో పల్లీయులను ఉర్రూతలూగించే యక్షగాన ప్రక్రియ 'చిందుభాగవతం' యక్షగాన ప్రక్రియ పరిణామంలో జానపద గీతి మాధుర్యాన్ని నింపుకున్న కళారూపం ఈ చిందు యక్షగానం.

*"A folk song is neither new nor old because it is continually taking on new life. It is an individual flowering on a common stem".*

ఈ మాటలు చిందు యక్షగానానికి కూడా వర్తిస్తాయి.

**– తిరునగరి శ్రీనివాస్**

## ఉపయుక్త గ్రంథాలు


1. ఎర్రన - హరివంశము
2. పాల్కురికి సోమన - బసవపురాణం
3. కేతన - దశకుమార చరిత్రము
4. శ్రీనాధుడు - భీమేశ్వర పురాణము
5. డాక్టర్ బి. రామరాజు - జానపద గేయ వాఙ్మయము
6. The Encylopaedia Britanica - R.V.W.
7. ఎం.డి. అబ్దుల్ - చిందు భాగవతం' వ్యాసం - 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక మార్చి-ఏప్రిల్ 1995.
8. ప్రముఖ చిందు కళాకారుడు పిల్లిట్ల అంజయ్యతో ఇంటర్వ్యూ - 02-03-2000.

# సుప్రసిద్ధుల వచన పచనం



***హా**స్య స్ఫోరకమైన అనుకరణ ధ్వని సంబంధం అయితే అది మిమిక్రీ.*

*ఒక రచయిత పద్య లేదా గద్యశైలిని హాస్యస్ఫోరకంగా అనుకరిస్తే అది పేరడీ. మిమిక్రీ కళాకారుడు ప్రసిద్ధ వ్యక్తుల గళాలను, ఎంపిక చేసుకున్నట్లే - పేరడీ ప్రయోగానికి కూడా ప్రముఖ రచయితల శైలిని మాత్రమే ఒరవడిగా తీసుకోవడం జరుగుతుంది. ఇది ఒక రకం స్తుతి వ్యాపారం కనుక అనుకర్త తన అభిమాన రచయితలనే ఎంపిక చేసుకుంటాడు.*

*వాసిగల ప్రతి రచయితకు స్వీయశైలి తప్పక ఉంటుంది. ఇలా స్వీయశైలి లేని రచయితను అనుకరించడం అసాధ్యం, ఇప్పుడు కొందరి గద్యశైలిని అనుకరించి చూపుతాను. వారి రచనలపట్ల నాకు గల గౌరవభావం వల్లనే ఈ పనికి పూనుకున్నాను. కనుక, అపార్థం చేసుకోవడం జరగదనే ఆశిస్తున్నాను.*

*"వెడుతున్న రైలు - ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో*

*అతడేదో ఆలోచిస్తూ ప్రయాణం చేయడం"*

*ఇదీ యిచ్చట ఎన్నుకున్న సన్నివేశం.*

## శ్రీరమణ పేరడీలు

### వైశ్వనాథీయం

**రెం**డు మూడు పదాలతో వాక్య నిర్మాణం చేయడం, భాషాశైలిలో, ఆలోచనా వైఖరిలో ప్రాచీనతపై మోజు విశ్వనాథవారి రచనలో కన్పిస్తుంది. సందర్భాన్ని వదలి ప్రక్కకు వెళ్ళడం వీరికి పరిపాటి. పై సన్నివేశాన్ని విశ్వనాథ వారు ఇలా వ్రాస్తారు.

"అది ధూమశకటము. అభిముఖముగా బోవుచున్నది. అతడు మొదటి తరగతి పెట్టెలోనాసీనుడయ్యెను, ప్రథమశ్రేణి మంజూషము సువిశాల ముగా నున్నది. పదియారు చక్రముల గలవు, గాలిపంకాలమర్చబడినవి. ద్వారకవాటముల కద్దములు కూర్చబడినవి. ప్రాచీన కాలమున గూడ నిట్టి బిసలు గలవు, ధూమశకటము లేమి? పుష్పక విమానములే గలవు గదా? అతడు గంభీరముద్ర దాల్చి బాహ్య ప్రకృతిని వీక్షించును. ఆతడేదియో నాలోచించుచున్నట్లగపడును.

ఆలోచన యనగా నేమి? అది యొక మానసిక వ్యాపారము. అతీంద్రియము, తాత్వికుడు ఆలోచన సేయును. అది లోకమును కుపకరించును. అయినా ఆలోచన చేయనిదెవరు? మనిసి అయిన ప్రతివాడును ఆ కార్యము సలుపగలడు. కాని తారతమ్యములు గలవు. కొందరివి మంచివై వుండును కొందరివి కాదు. ఇంతకూ నాతని మనమందేమి గలదు. మనకు తెలియదు, తెలియును... ఇది యొక చమత్కారము."

ఇట్లా సాగిపోతుంది వారి వచన స్రవంతి. ☆



### సంజీవనీ శైలి

**సంజీవదేవ్ గారు గద్యరచనలో కొత్త పోకడలను ప్రవేశ పెట్టారు. తర్కమూ, గంభీరమైన సంస్కృత పదాలను సామాన్యవాక్యాల్లో పొదగడమూ వీరి ప్రత్యేకత. ఇదే సంఘటనను సంజీవ్‌దేవ్ గారయితే!**

"రైలు జడమే అయినా అది కదుల్తుంది, చెట్టు చేతనమే అయినా అది కదలదు, కదలే అచేతనాలు, కదలని సచేతనాలు; కదలే సచేతనాలు, కదలని అచేతనాలు కూడా తారసపడతాయి. నిత్యజీవితంలో కదలిక సజీవమైన ప్రాణస్పందనకు గతిశీల చిహ్నం.

రైలు చేస్తున్న శబ్దం లయాత్మకంగా తట్టసాగింది ఫస్ట్‌క్లాస్‌లో కూర్చున్న అతడు కిటికి గుండా బాహ్యజగత్తును అనుశీలన చేయసాగేడు. అవి వ్యక్తపరచబడని భావాలేవో అతని మానసాకాశంలో వుండి వున్నాయి. దూరాన ఛాయారూపంలో అస్పష్టంగా అగపడే పర్వత పంక్తులు ముక్తాకాశం క్రింద రమ్యంగా గోచరిస్తున్నవి. అతను వివాహితుడా? అవివాహితుడా? అని ఆలోచన చేయసాగేను. కొందరు వివాహితులు అవివాహితుల్లాగాను కొందరు అవివాహితులు వివాహితుల్లాగాను వుంటారు. అతను వివాహతుడేననే నిర్ణయానికి వచ్చాను. కాని, నా నిర్ణయం భ్రమయేమోననే సందేహం కూడా కలిగింది".



☆

## పాహిమామ్



**బుచ్చిబాబుగారి కథా కథనం, శిల్పం పైతరగతి పాఠకుల్ని ఆకట్టుకుంటాయి. వీరి కథా శీర్షికలు కూడా ప్రత్యేక పంథాలో వుంటాయి. ఇదే సంఘటన బుచ్చిబాబు గారి ధోరణిలో –**

''ప్లాట్‌ఫారం మీద రైలు ఆగ్గానే మనసు కుదుటపడింది. రైలు లేటవడం, దానికోసం వెయిట్ చేయడం– నాకు మహా చిరాకు.

పోర్టరు సామాను ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులో పెట్టాడు. వాడికి ఎంతిచ్చానో గుర్తులేదు కాని వాడు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. మళ్ళీ వాడు కన్పించినా పోల్చుకోలేను. షిఫాన్ చీర కుచ్చెళ్ళలో బిగించిన బొమ్మలా వుంది మూల సీట్లో అమ్మాయి. నేను కొంచెం బెరుగ్గా ఎదురు సీట్లో కూర్చున్నా. ఆమెతో మాట్లాడాలని అన్పించలేదుగాని 'అచ్చం పంకజంలా లేదూ' అనుకున్నా మనసులో.

ఇప్పటి పంకజం కాదు. పుష్కరం క్రిందటి పంకజం. అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు ! మల్లెపూలు, మెడచుట్టూ రక్తనాళాల నీలినృత్యం, నడుం క్రింద వొంపు, మనసులో తెల్లచార, ఆ పంకజాన్ని చూడగలనా? ఇప్పుడు పంకజం పిల్లలకోడి.. రైలు కూతతో తెగినదారంలా ఆలోచనా చయనిక తెగిపోయింది. మామ్ అన్నట్లు అనుభవంలో కన్నా ఆలోచనలోనే మాధుర్యం యెక్కువ...

☆

## ఉపమారాచకొండన్న



**సామాజిక స్పృహ, అట్టడుగు మనిషి రాచకొండ విశ్వ నాథశాస్త్రి గారి కథలకు పెట్టుబడులు, వీరి ప్రతి వాక్యమూ రసాత్మకమైన కావ్యమే! వీరి శైలిని సొంతం చేసుకుని ఔనన్పించుకున్నవారు బీనాదేవిగారు. రా.వి.శాస్త్రి గారి కథాకథనం;**

రైలు పాకుతున్న కొండచిలువలా వుంది. ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటు ఖరీదైన సబ్బుపెట్టె లాగుంది. కూపేలు పెద్దసైజు ఎ. సి. యూనిట్లలాగున్నై. వాటి ముందు కారిడార్ చీకటి గుహలా వుంది. ప్రక్కన వాష్‌బేసిన్ విధేయుడైన నిరుద్యోగిలావుంది.



బెర్తుమీద కూర్చున్నతను ప్యాంటు తొడుక్కున్న పెద్దపులి లాగున్నాడు. నోట్లో సిగరెట్ బయటకు వచ్చిన కోరలా వుంది.

రైలు కూత నల్లధనం దాచిన ఆసామీ నవ్వులా వుంది. వెనక్కు పరుగెత్తే చెట్లూ, పుట్టలూ అలుక్కుపోయి పికాసో చిత్రంలా కన్పిస్తున్నాయి. రైలు వుయ్యాలలా ఊగుతోంది. అది చేసే చప్పుడు జోల పాటలా వుంది.'

ఇలా వుంటుంది ఆ ధోరణి.

☆

## మైథాలజీ సీత

**పురాణం సీతగారి ప్రత్యేకత ఇంగ్లీషు మాటల్ని తెలుగైజు చేయడం. సాదా విషయంపై అసాధారణంగాను, అనర్గళంగాను చర్చించడమూ.**



'పిల్లికి పులి మేనమామ' ట. అలాగే నా వొపీనియన్‌లో రైలు బస్సుకి మేనమామ. అదే విషయంరైల్లో ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌లో మా గురూగారితో అన్నాను. గురూగారంటే మా ప్రియతమ హజ్‌బెండ్. అసలీ హబ్బీలు రైలు డబ్బీల్లా రెండు రకాలు, బాడ్ హబ్బీలు అని, ఎరస్ట్ హబ్బీలు అని కమింగ్ టు ది లెక్చర్ రైలుకూతలో వొక తమాషా వుంది. అది ప్రగతిశీల శక్తికి, సామాజిక స్పృహకి, సాంఘిక దృక్పథానికి సంకేతం. శ్రీవారు ఫస్ట్‌క్లాస్‌లో ఆవకాయ జాడీ తీసికెళ్ళడం మర్యాద కాదన్నారు. విమానాల్లో ఉల్లిపాయలు తీసుకెళ్ళడం లేదా అని ఒక ప్రశ్నార్థకంతో వారి నోరు మూశాను. ఏమంటారు.... నేను అవాక్స్ అండ్ చవాక్స్ పేలుతున్నానంటారా? అయితే సరే మీకు.... రైలు ప్రయాణపు ముచ్చట్లకు ఎగ్ బై ; ఎగ్ అంటే గుడ్డు లెండి.

☆

## కొడవటిగంటీయం

**మధ్య తరగతి జీవితాలకు అద్దం పట్టాయి కొడవటిగంటి కుటుంబరావు గారి కథలు. కథ చదివేటప్పుడు ఆ సంఘటన కళ్ళముందు జరుగుతున్నట్టుగా ఫీల్ అవుతాం. వారి పోకడ చూడండి.**



'రైలు ఆగడం, సుందరం ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌లో కూర్చోవడం – ఏది ముందా అన్నంతగా జరిగి పోయాయి. సుందరం మొదట ప్రెస్ బాయ్‌గా చేరి, కంపోజిటరై, ట్రెడిల్‌మెన్ అయి అలా అలా పైకొచ్చి ప్రెస్ ఓనరైపోయాడు. ఫస్ట్‌క్లాస్‌లో తప్ప ప్రయాణం చెయ్యడు. అయితే సుందరానికి కొన్ని వింత అల వాట్లున్నాయ్. ఇంత గొప్పవాడైనా తన పాత జీవితాన్ని మర్చిపోకూడదని ఖరీదైన డ్రెస్ మాత్రం వేసుకోడు. సుందరాన్ని చూసి వో సిల్క్ లాల్చీ ఆసామీ "అబ్బాయ్ ఇది పరుపుల పెట్టె" అన్నాడు.

"తెలుసు" అన్నాడు గంభీరంగా సుందరం. అప్పర్‌క్లాస్ మెంటాలిటీ అంటే ఇదే. తాము తప్ప ఇంకెవరూ పై తరగతి పెట్టెలో ప్రయాణం చేయకూడదని వారి అభిప్రాయం.

☆

# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## సొగసరి - గడసరి

**త**మ అష్టావధాన శతావధానాలతో ఆంధ్రదేశంలో సాహితీ చైతన్యాన్ని కలిగించి, పాండవోద్యోగ విజయాల ద్వారా నాటక పిపాసను రేకెత్తించిన పుంభావ సరస్వతులు తిరుపతి వెంకట కవులు. వారి పూర్తి నామధేయాలు, దివాకర్ల తిరుపతి శాస్త్రీ, చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రీను. దివాకర్ల వారిది పశ్చిమగోదావరి జిల్లా ఎండగండీ, వెంకటశాస్త్రి గారిది తూర్పుగోదావరి జిల్లా కడియమూను.

వీరిద్దరిలో వెంకటశాస్త్రిగారు, సర్మోక్తులు విసురుతూ, హాస్య సంభాషణ సాగిస్తూ, తన చతుర వచోవిలాసంతో అందరి మనస్సుల్నీ ఆకట్టుకొనేవారు. అర్థవంతంగా మాట్లాడి అవతలివాళ్ళని ఆశ్చర్యంలో ముంచడం, అవసరం అయితే నోరు మూయించడం, ఆయనకి వెన్నతో పెట్టిన విద్య.

ఓ మారు వెంకటశాస్త్రిగారు మండపేట వెళ్ళారు. అక్కడ ఆ రోజుల్లో కళాభిజ్ఞత, రసజ్ఞత, లోకజ్ఞత గల వేశ్యామణులెందరో వుండేవారు. వారిలో నృత్య గీతాది లలితకళల్లో ఆరితేరిన ఓ యౌవనాంగి వుండేది. ఆమె పేరు మణి !

వెంకట శాస్త్రి గారి సాన్నిధ్యంలో మణి అద్భుతంగా నాట్యం చేసింది. శాస్త్రిగారు ఎంతో సంతోషించారు. ఆమెని అభినందించారు. అభినందించి ఊరుకోలేదు. చివర్ని కొంటెగా "మణి మామూలుగా వుండే కంటే, కడియంలో వుంటే, సార్థకత లభిస్తుంది. శోభస్కరంగా వుంటుంది" అన్నారు. అంటే, "మా ఊరు కడియం, అక్కడికి రా" అని అర్థస్ఫూర్తితో చెప్పారన్నమాట.

ఆమె ఏం తక్కువది కాదు.

వెంటనే, పేట అనే మాటకి మండపేట, మెడలో వేసుకొనే బంగారపు గొలుసు అనే రెండర్థాలు స్ఫురించేలాగ –

"మహాకవులు! తమకి తెలియంది ఏముంది? స్వచ్ఛమైన మణి కడియంలో వుంటే ఏమిటి, పేటలో వుంటే ఏమిటి" అని సమాధానం ఇచ్చింది. వెంకటశాస్త్రి గారి చతురతికి దీటైన చతురత అది. ఆయన వెంటనే నవ్వి "సొగసరివే అనుకున్నా –గడసరిని కూడా అన్నమాట" అని అభినందించారు. ☆

## జడ, మెడ వెనుకే ఉండనేల?

**గ**ద్వాల రాజుగారు తిరుపతి వెంకట కవులకి దర్శనం ఆలస్యంగా ఇప్పించినా, ఆ జంటకవులు రాజుగారిని కలుసుకుని కాని వెళ్ళకూడదని ఉండిపోయారు. ఎందుకంటే, గద్వాల రాజుగారు రసజ్ఞులు, సాహితీ పిపాసకులు. వినిపిస్తే తమ కవిత్వం అటువంటి వారికే వినిపించాలి. అదీ ఆ జంటకవుల ఊహ.

వారి ఊహ నిజమైంది. గద్వాల రాజుగారికీ తిరుపతి వెంకట కవులకీ మధ్య ఎన్నో చమత్కారమైన సంభాషణలు సాగేవి. ఒకమారు రాజుగారు "అయ్యా – స్త్రీకి కనులు, ముక్కు, అధరములు, కంఠము, జడ ఇవన్నీ సౌందర్య హేతువులు కదా – అన్నీ ముందు భాగాన్నే వుండి, ఒక్క జడ మాత్రం వెనుక భాగాన్ని ఎందుకుంది?" అని అడిగారు.

"సన్నని లేనడుము –ఘనమైన పిరుదులు – స్త్రీకి వెలలేని సంపదలు – ఆ సంపదలను భద్రంగా కాపాడడానికి జడ, మెడ వెనుకే వుంది. అంతేకాదు, నేను ఆశ్రయించిన స్త్రీకి అందము ముందు భాగాన్నే కాదు, వెనుక భాగాన్ని కూడా వుంది అని చాటడానికి జడ ఆమె వెనుక భాగాన వుంది.

అంతేకాదు, పదిమంది దృష్టి పడితే కంటకం అవుతుంది. కనపడకుండా వుంటే మంచిది అని అనుకొని జడ వెనక భాగానికి చేరింది. ఆకతాయితనం చేసే పురుషుణ్ణి హఠాత్తుగా బంధించడానికి కూడా ఆ జడ వెనుకవైపున దాగుకొని వుంది" అంటూ చెప్పి గద్వాల రాజుగారిని మెప్పించి, పారితోషికాలందుకున్నారు తిరుపతి వెంకట కవులు. ☆

## కవితకు వెలనాటిన కవి

**తి**రుపతి వెంటకకవులలో తిరుపతి శాస్త్రి గారిది కొంచెం సౌజన్యమైన ప్రకృతి. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారిలో వుండే దుడుకుతనం, దివాకర్ల తిరుపతి శాస్త్రిగారిలో వుండేది కాదు. అలాగని ఆయనేం మెతక మనిషి కాదు. మాటపడే మనిషి అసలే కాదు. అవసరం అయితే ఎదుర్కోనూ గలరు, ఎదుటివారి – నోరు మూయించనూ గలరు. ఆ ప్రకృతి ఆయనకి విద్యార్థి దశనుండీ వుంది.

విద్యార్థిగా వున్నప్పుడు ఆయనొకమారు ఏలూరులో మైలవరము కృష్ణమూర్తిగారింటికి వెళ్ళారు. ఆ కబుర్లూ, ఈ కబుర్లూ అయ్యాయి. మాటల ప్రస్థావనలో బ్రాహ్మణులలో గల వెలనాటి, వేగినాటి, కాసరనాటి, తెలగాణ్య, ఆరామ ద్రావిడ, ఆరువేల నియోగి శాఖల ప్రస్తావన వచ్చింది. కృష్ణమూర్తిగారు పెదవి విరిచి హేళనగా, "అయితే మీరు వెలనాట్లా?" అన్నారు దివాకర్ల తిరుపతి శాస్త్రిగారినుద్దేశించి. వెంటనే శాస్త్రిగారికి కోపం వచ్చింది.

*"వెలనాటి వాడ కవితకు –*
*వెల నాటినవాడ. . . . ."*

అంటూ గంభీరంగా పద్యం చదివారు. తర్వాత ఆయన మనస్సు నొప్పించినందుకు కృష్ణమూర్తిగారూ నొచ్చుకున్నారు. ఏమైతేనేం, దివాకర్ల వారు, కవితకు వెల నాటినవారనేమాట, నేటికీ, ఏనాటికీ రూఢి అయిపోయింది. ఆ పద్యం ప్రచారంలోకి వచ్చింది. ☆

*Printed & published by Phanikumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : Phani Kumar*




రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన

# శ్రీ బొత్స సత్యనారాయణ




Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.